www.jagritiweekly.com

సంపుటి : 76 సంచిక : 35 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి ఆషాఢ శుద్ధ తదియ

08-14 జూలై 2024

వెల : ₹20/-






## 18వ లోక్‌సభ.. ధ్వని.. ప్రతిధ్వని




## భారత్ మెరిసింది.. జాతి మురిసింది...

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# సమైక్యంగా ఉండేందుకు శిబిరాల్లో శిక్షణ: చంపత్‌రాయ్




ఆధునిక కాలంలో కౌమార దశలోని బాలబాలికలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు వ్యక్తిత్వ వికాసంలో మార్గదర్శనం అత్యవసరంగా మారింది. దీనిని దృష్టిలో పెట్టుకునే 'సూర్యా ఫౌండేషన్' గత మూడు దశాబ్దాలుగా వేసవికాలంలో వ్యక్తిత్వ వికాస శిబిరాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎనిమిది శిబిరాలలో **14** రాష్ట్రాలకు చెందిన **1100**మంది పిల్లలు పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న యువత ఆరోగ్య, ఆధ్యాత్మిక వృద్ధి కోసం యోగ, వ్యాయామం, ధ్యానం, ప్రార్థన సెషన్లు జరిగాయి. వీరిలో **100**మందికి ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌ను అందిస్తుంది.

సైనిక కవాతులు, నిర్మాణాత్మక దినచర్య ద్వారా సమయపాలన చేయడం సహా క్రమశిక్షణతో ఉండటాన్ని వారు నేర్చుకున్నారు. యువతలో నాయకత్వాన్ని, జట్టు స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు క్రీడలు, ఇతర పోటీలు నిర్వహించారు. అదనంగా, వివిధ మేనేజ్‌మెంట్ అంశాలపై పలువురు నిపుణులు సెషన్లు నిర్వహించారు. కెరీర్ కౌన్సిలింగ్ కూడా కాలానుగుణంగా నిర్వహించారు.



ఈ ఏడాది మహారాష్ట్ర- శంభాజీనగర్‌లోని ఆర్య చాణక్య విద్యాధామ్‌లో, గుజరాత్‌లో శ్రీ గుర్జర్ క్షత్రియ సమాజ్ ఆర్గనైజేషన్ సహకారంతో అంజర్‌లోనూ, సూర్యఫౌండేషన్ నిర్వహించే పిఎం శ్రీసూర్య ఏకలవ్య పాఠశాల, మధ్యప్రదేశ్‌లోని ఓంకారేశ్వర్‌లో సంవిద్ గురుకులం, సెహోర్‌లోని కన్యా శిక్షా క్యాంపస్, ఝింఝోలీ (న్యూఢిల్లీ)లో సూర్యసాధనా స్థలి సహా పలుచోట్ల శిక్షణా శిబిరాలు జరిగాయి.

గత ఏడాది శిబిరాల నుంచి ఎంపిక చేసిన యువతకు ఝింఝోలీ (న్యూఢిల్లీ)లో సూర్యసాధనా స్థలిలో **15** రోజుల ఉన్నత వ్యక్తిత్వ వికాస శిబిరం నిర్వహించారు. ఈ ఉన్నత శిబిరంలో అత్యుత్తమంగా రాణించిన యువతకు సూర్య ఫౌండేషన్‌లో నెలసరి స్కాలర్‌షిప్‌లు పొందుతూ శిక్షకులు అయ్యే అవకాశం లభిస్తుంది. ఈ ఏడాది నిర్వహించిన శిబిరంలో ఎనిమిది రాష్ట్రాలకు చెందిన **76**మంది విద్యార్థులు పాలుపంచుకున్నారు.

ఈ శిబిరాలలో పాలుపంచుకున్నవారు పద్మశ్రీ ఆచార్య సుకమా దీదీ, విశ్వహిందూ పరిషత్ (శ్రీ రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి)కు చెందిన చంపత్ రాయ్, సూర్యాగ్రూప్ చైర్మన్ జయప్రకాష్ అగర్వాల్, ఇస్కాన్‌కు చెందిన కేశవ ప్రభు వంటి గౌరవనీయ వ్యక్తుల మార్గదర్శనం పొందారు. దేశం కోసం బాధ్యతాయుతమైన పౌరులను తీయారుచేసేందుకు ప్రతి ఏడాది జరుపుచున్న కార్యక్రమాలలో నేటివరకూ **2** లక్షలమంది యువతకు ఫౌండేషన్ శిక్షణను ఇచ్చిందని సూర్యా ఫౌండేషన్ వైస్ చైర్మన్ హేమంత్ శర్మ వెల్లడించారు.



ప్రత్యేక వ్యాసం

# అమ్మకు ఆషాఢ బోనాలు...



తెలంగాణ జానపద సంస్కృతీ ప్రస్థానంలో పర్వదినత్రయంగా చెప్పుకునే వాటిలో బోనాలు ఒకటి. మిగిలిన రెండు, బతుకమ్మ పండుగకాగా, మరొకటి సమ్మక్క, సారలమ్మ జాతర. మొదటి రెండింటిని ఏటా జరుపుకుంటే మూడవదానిని రెండేళ్లకు ఒకసారి ప్రధాన జాతరగా, ఒక ఏడాది సాధారణంగా నిర్వహిస్తారు. ఆషాఢం రాకతో అమ్మవారిని కొలిచే బోనాలు సంబరాలు మొదలయ్యాయి. బోనాలు, బతుకమ్మ పండుగల్లో మహిళలే కీలకం.

తెలుగునాట అందునా భాగ్యనగర పరిసర ప్రాంతాల వారికి అత్యంత ప్రధానమైనవి బోనాలు. గోల్కొండ నవాబుల కాలంలో అక్కన్న మాదన్నలు ప్రారంభించిన ఈ జాతర క్రమంగా అన్ని ప్రాంతాలకు విస్తరించింది. ఏటా ఆషాఢ మాస తొలి ఆదివారం గోల్కొండ కోటలోని జగదాంబిక (ఎల్లమ్మ) ఆలయంలో బోనాలు మొదలై ఆ తరువాత ఒక్కొక్క ఆదివారం ఒక్కొక్క ప్రాంతంలో జరుగుతుంది. ఆ ప్రకారం, వరుసగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి (లష్కర్ బోనాలు), లాల్‌దర్వాజలోని మహంకాళి ఆలయంలో, గన్ ఫౌండ్రిలో నిర్వహిస్తారు. ఆషాఢ మాసం చివరిరోజున గోల్కొండ కోటలో జరిగే బోనం పూజతో జాతర పరిసమాప్తమవుతుంది. ప్రధాన ఆలయాలతో పాటు జంట నగరాల వ్యాప్తంగా గల గ్రామదేవతల ఆలయాలలో బోనాల సందడి మిన్నంటుతుంది. తెలంగాణలో పూజలందుకునే ఏడుగురు గ్రామదేవతలు... పోచమ్మ, మైసమ్మ, బాలమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మహంకాళి, పెద్దమ్మ అక్కాచెల్లెళ్లని, పోతురాజు వారి సోదరుడని కథ ప్రచారంలో ఉంది.

వర్షాకాలం ప్రారంభంలో అనారోగ్యం కలుగకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా కాపాడాలని అమ్మవారిని వేడు కుంటూ నైవేద్యం సమర్పిస్తారు. 1675లో గోల్కొండ పాలకుడు అబుల్ హాసన్ కాలంలో దక్కన్‌లో బోనాల పండుగా ప్రారంభ మైంది. అంతే కాకుండా, 1869 ప్రాంతంలో నేటి జంటనగరాల్లోని వివిధ ప్రాంతాలలో మలేరియా వ్యాధి ప్రబలి పెద్ద ఎత్తున ప్రాణ నష్టం చోటు చేసుకుంది. ప్రకృతిని ప్రసన్నం చేసుకొనే క్రమంలో ఈ జాతరను మరింత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తూ వస్తున్నారు.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

కొత్త కుండలో బియ్యం, బెల్లం, పాలు, పసుపు కలిపి వండేదే బోనం. బోనం కుండను సున్నం, కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించి, దానిపై దీపాలు వెలిగించి మహిళలు శిరస్సునధరించి మేళ తాళాలతో ఆలయానికి 'శోభా యాత్ర'గా బయలుదేరుతారు. ఇలా బోనం తలకెత్తు కున్నవారిని అమ్మశక్తికి ప్రతీకగా భావించి, భక్తులు వారి పాద ప్రక్షాళన చేస్తుంటారు. బోనాన్ని తలపై ధరించి డప్పు వాయిద్యాల నడుమ,పాటలు పాడుతూ, లయ బద్ధంగా నృత్యం చేస్తూ/అడుగులు వేస్తూ ఆలయంలో ఏడు ప్రదక్షిణలుచేసి, నైవేద్యం సమర్పిస్తారు.

బోనం కోసం సిద్ధపరచే పూజాద్రవ్యాల్లో ఆరోగ్య సూత్రాలు ఇమిడి ఉన్నందున సామాజిక శాస్త్రవేత్తలు వీటిని 'ఆరోగ్య బోనాలు' అన్నారు. వీటిలో వాడే వేపమండలు, పసుపు, నిమ్మకాయలు, జ్యోతిలో రోగనిరోధకాలు ఉన్నాయని సైన్స్ పేర్కొంటోంది. పసుపు, బెల్లం, బియ్యంతో తయారు చేసే బోనం ప్రసాదం స్వీకరణతో దేహంలోని రోగకారకాలు నిర్మూలనమవుతాయని చెబుతారు. ఆషాఢ బహుళ పక్షంలో వేప, రావి, మద్రి, మామిడి, జామ చెట్ల నుంచి చిగుళ్లను సేకరించి తేనె మిశ్రంతో 'కోకిలా వ్రతం' పేరిట అమ్మవారికి నివేదించి, దానిని ప్రసాదంగా స్వీకరిస్తారు. దీనివల్ల కఫ సంబంధిత అనారోగ్య సమస్యలు తొలగుతాయని విశ్వాసం.

**పోతురాజుల విన్యాసాలు**

బోనాల ముగింపు సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలుస్తాయి. యువకులు పోతురాజులా నుదుట కుంకుమ, కళ్లకు కాటుక, నోట్లో నిమ్మ కాయలు, చేతులలో త్రిశూలం, కాళ్లకు గజ్జెలు అలంకరించుకొని కొరడా ఝుళిపిస్తూ, తప్పెట్లకు అనుగుణంగా విన్యాసాలు చేస్తారు.

గుమ్మడి, సొరకాయల (కూష్మాండాలు)ను పళ్లెంలో ఎత్తి పట్టుకొని తిప్పుతూ బలి ఇస్తారు (పూర్వం జంతు బలులు ఉండేవి. వాటి నిషేధంతో 'కూష్మాండబలి'... అంటే గుమ్మడి, సొరకాయలను సమర్పిస్తున్నారు). సోదరుడు పోతురాజును అమ్మవారు ఆవహిస్తారని, అమ్మవారు ఊరిలో పూజలు అందుకుంటుండగా సోదరుడు ఊరి రక్షణ బాధ్యత వహిస్తాడని భక్తుల విశ్వాసం. సోదరికి తీసుకువెళ్లే ఫలహారం బండ్ల ముందు వీరంగాలు వేస్తూ కదులుతారు.

బోనం మరునాడు పూనకం వచ్చిన మహిళలు ఆలయం ఎదుట భవిష్యవాణి (రంగం) చెబుతారు. దీనినే 'అమ్మమాట' అంటారు. మాతంగి దీక్షలో ఉన్న అవివాహిత అమ్మవారి ఎదుట పచ్చికుండపై నిలుచొని భవిష్యత్ పరిణామాలు, విశేషాలను జోస్యంలా చెబుతారు. ఆమె పలుకులు సాక్షాత్తు అమ్మవారివిగానే విశ్వసిస్తారు.

రంగం ముగిసిన తరువాత పోతురాజులు తాండవంతో ఆలయం చుట్టూ నాట్య విన్యాసాలతో ప్రదర్శన లిస్తారు. తర్వాత దైవసన్నిధిలోని దీపాలు, ప్రమిదలు, ప్రసాదం, పూలు తదితర పూజా సామగ్రిని గంప (బలిగంప)లోకి తీసుకునిఊరి పొలిమేరల్లో భూమిలో నిక్షిప్తం చేస్తారు. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్**
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

**కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -**
**సబ్ ఎడిటర్ : - 9959991304**

**డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ**

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి**


త్వరితగతిన న్యాయాన్ని అందించే విధంగా రూపొందించిన భారతీయ నేరశిక్షాస్మృతి అమలులోకి వచ్చి (జులై 1), దానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం మొదలెట్టినప్పటికీ, అప్పుడే మొదటి కేసు న్యూఢిల్లీలో నమోదైపోయిందంటే, ప్రజలకు కావలసిందేమిటో వేరే చెప్పనవసరం లేదు. వలసవాద కాలంనాటి ఐపిసి, సిఆర్‌పిసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినయమ్ కొత్త నేరాలు, కఠిన జరిమానాలు, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలకు, తీవ్రవాద కార్యకలాపాలకు శిక్షలను పొందుపరిచారు. బహుశ, ఇదే ప్రతిపక్షాలను ఇబ్బంది పెడుతున్నట్టుగా ఉంది. మైనార్టీల సంతుష్టీకరణ కోసం వారి తీవ్రవాద కార్యకలాపాలను ఉపేక్షించేందుకు, ఇటీవలే పశ్చిమ బెంగాల్లో చోటు చేసుకున్న తాలిబన్ తరహాలో మహిళలను శిక్షించేందుకు ఇకపై కుదరదు మరి. నేరం చేస్తే త్వరితగతిన విచారణ చేసి తగిన శిక్షను విధించే దిశగా ఈ చట్టాలు ఉన్నాయి. ఈ చట్టాల వల్ల ఎన్నో.. ఎన్నెన్నో కేసులు తమపై ఉన్నా ఇంతకు ముందులా తమ ధన, కుల,మత బలంతో పార్లమెంటులోకి ప్రవేశించడానికి ఇకపై అవకాశం ఉండక పోవచ్చు కూడా. ఇది ప్రతిపక్ష నాయ కులకు చాలా పెద్ద విషయమే.

వలసవాదకాలం నాటి చట్టాలను మార్చి, భారతీయ చట్టాలను తీసుకురావడం పట్ల ప్రతిపక్షాలకు అభ్యంతరం ఎందుకు ఉండాలో ప్రజలు కూడా ఆలోచిం చాలి. తరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, త్వరితగతిన న్యాయం ఇవ్వాలని చట్టాలు చెప్తున్నాయి. దానికి ప్రతిపక్షాలు ఇంత తీవ్రంగా అభ్యంతరం చెప్తున్నాయంటే, తమ కాళ్ల కిందకు నీళ్లు ఎప్పుడు వస్తాయోనన్న భయం వారిని దహించివేస్తున్నట్టు కనిపిస్తోంది. పైగా, మూడోసారి కూడా తమకు ఆశాభంగాన్ని కలిగిస్తూ, ప్రధాని మోదీ ఎన్నిక కావడంతో ప్రతిపక్షాలు ఆ ద్వేషాన్ని పట్టలేక అనుచితంగా వ్యవహరిస్తున్నాయి.

ఈ చట్టాలను ప్రవేశపెట్టే సమయంలో కావాలనే నానా గందరగోళం చేసి సస్పెన్షన్‌కు గురైన ప్రతిపక్ష ఎంపీలు నేడు, అబ్బెబ్బే మేం లేకుండానే ఈ చట్టాలను

**శాలివాహన 1946 శ్రీ క్రోధి ఆషాఢ శుద్ధ తదియ**

## లోపలి పేజీలలో...


6లో

ముఖపత్ర కథనం

**18వ లోక్‌సభ..**
**ధ్వని.. ప్రతిధ్వని**

ధారావాహిక నవల

**జన్మ**

- సంబరాజు లీల (లట్టుపల్లి)




20లో

ప్రత్యేక వ్యాసం

**మన ఆశయాదర్శాలకు ప్రతీకం - పరమ పవిత్ర భగవాధ్వజం**



26లో

# జాగృతి

## సంపాదకీయం

ఆమోదించేశారంటూ సోషల్ మీడియాలో ట్వీట్లు చేయడం హాస్యాస్పదం. అలాగే, ఈ చట్టాలు – పాత చట్టాల 'కట్ కాపీ పేస్ట్' అంటూ ఇప్పుడు మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్పుడే ఎందుకు అభ్యంతర పెట్టలేదో వివరించకుండా వ్యాఖ్యలు చేయడం అసమంజసం. ప్రజలకు సంబంధించిన ఏ చట్టంపైన అయినా తమకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే అవి ఏమిటో సభలో తెలిపి, దానిపై చర్చించి, ఆ చట్టాన్ని అడ్డగించినప్పుడు అది ప్రజాహితం కోసం చేస్తున్నామంటే ఎవరైనా నమ్ముతారు. కానీ, అటువంటివేమీ లేకుండా సభలో చర్చకు ఆస్కారం ఇవ్వకుండా, ప్రభుత్వం చెప్పేది వినిపించుకోకుండా నినాదాలు చేస్తూ,

## మన కోసం.. మన చట్టాలు

అల్లరి చేస్తే, స్పీకర్ మాటలను, ఉత్తర్వులను లెక్క చేయనప్పుడు, వారిని సస్పెండ్ చేసి, సభను నడిపించడం మినహా స్పీకర్‌కు మరొక ప్రత్యామ్నాయం ఉండదు. ఈ దిద్దుబాటు వ్యవహారానికి నాయకత్వం వహించిన హోం మంత్రి అమిత్ షా వీరి ఆరోపణలను తిప్పికొడుతూ, 'భారతీయుల చేత, భారతీయుల కోసం, భారతీయ పార్లమెంటు ద్వారా రూపుదిద్దుకోవడమంటే వలసవాద నేరశిక్షాస్మృతి చట్టాలకు ముగింపు పలకడమే. ఈ నూతన చట్టాల ఆత్మ, శరీరం, స్ఫూర్తి అన్నీ భారతీయమైనవే' అని స్పష్టం చేశారు.

భారతీయ న్యాయ సంహితలో పొందుపరిచిన సెక్షన్ 113 (1), 'భారత దేశంలో లేదా విదేశంలో అయినా భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, భద్రత లేక ఆర్థిక భద్రతకు ముప్పు వాటిల్లాలన్న ఉద్దేశంతో లేదా ప్రమాదాన్ని తెచ్చే ఉద్దేశంతో కుట్రలు పన్నినా లేదా ప్రజలను హననం చేసేందుకు, ఆస్తులు ధ్వంసం చేసేందుకు బాంబులు, డైనమేట్లు, పేలుడు పదార్థాలు, విష వాయువులు ప్రయోగించినా, లేదా కరెన్సీని ముద్రించినా, స్మగ్లింగ్ చేసినా అతడు తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్టే' అని నిర్వచిస్తోంది. తీవ్రవాద చర్యలకు మరణశిక్ష లేదా పెరోల్ లేకుండా జీవిత ఖైదు విధించాలని సంహిత చెప్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడం నేరంగా పరిగణించడమే కాక పలు తీవ్ర వాద నేరాలకు నిర్వచనాలను సంహితలో ప్రవేశపెట్టారు. అంతేకాదు, పోలీసు అధికారులు అమాయకులపై జులుం చేస్తే బాధితులు నేరుగా మేజిస్ట్రేటు వద్ద ఫిర్యాదు చేసేందుకు అవకాశాన్ని న్యాయసంహిత కల్పిస్తోంది. అలాగే, పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్ నమోదు, ఆన్‌లైన్ ద్వారా ఎఫ్ఐఆర్, సమన్లు పంపడం వంటి సౌలభ్యాలను కల్పిస్తోంది. 'పౌరుడు మొదట, ఆత్మగౌరవం మొదట, న్యాయం మొదట' అన్న స్ఫూర్తితో నూతన చట్టాలను రూపొందించారు. పోలీసులు ఇప్పుడు తమ దండం (లాఠీ)తో కాకుండా డేటాతో పని చేయవలసి ఉంటుంది,' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ పోలీసు అధికారులను జనవరిలోనే అప్రమత్తం చేశారు.

కింద పడ్డా పై చేయి మాదే అన్న తంతుగా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు మర్చిపోతున్న విషయం ఒకటుంది. ప్రతిపక్ష నాయకులు పార్లమెంటులో హద్దులు దాటి నిస్సిగ్గుగా వ్యవహరిస్తుంటే అదంతా తమకోసమే అనుకునేంత అమాయకత్వంలో ప్రజలు లేరు. కానీ, ప్రజలను తప్పు దోవపట్టించేందుకు ప్రతిపక్షాలు అప్పుడే సోషల్ మీడియాలో ఈ చట్టాలపై దుష్ప్రచారాన్ని మొదలెట్టేశాయి. వీటి పై అవగాహన కల్పించేందుకు హోం మంత్రిత్వశాఖ చేపట్టిన చొరవలు సరిపో వడంలేదు. సోషల్ మీడియాలో న్యాయనిపుణుల ద్వారా వీటి గురించి ప్రజలకు అర్థమయ్యేలా సరళమైన రీతిలో ప్రచారం చేయడానికి దేశ హితాన్ని కోరేవారు ముందుకు రావాలి. ★

**08 జూలై 2024, సోమవారం** | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**సమర్థ**

– రాయప్రోలు సుజాతాప్రసాద్





| | | |
|---|---|---|
| 'ఎమర్జెన్సీ విధించిన పార్టీ బతికి బట్టకట్టడమే ...' (ముఖాముఖీ) | – | 14 |
| పోలవరంపై శ్వేతపత్రం.. (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| అమెరికా అసలు రంగు బయటపెట్టిన... (అంతర్జాతీయం) | – | 23 |
| నలంద.. నిరంతర మేధోస్ఫూర్తి (పునర్నిర్మాణం) | – | 30 |
| మత స్వేచ్ఛలనడ్డం పెట్టుకొని అమెరికా విమర్శలు (వేదిక) | – | 33 |
| 'స్థానిక' ఎన్నికలపై అధికార పక్షం బెరుకు (తెలంగాణ) | – | 34 |
| దక్షిణాదిన పట్టు పెంచుకున్న బీజేపీ (జాతీయం) | – | 36 |
| భారత్ మెరిసింది...జాతి మురిసింది! (క్రీడ) | – | 43 |
| బాలజాగృతి | – | 46 |
| 'హను–మాన్' నుండి 'కల్కి' వరకు! (సినిమా) | – | 50 |





భారత రాజ్యాంగ ప్రతిని చేతబూని రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, కొందరు డీఎంకే సభ్యులు, ఇండీ కూటమి సభ్యులు 18వ లోక్‌సభలో సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. నిజం మాట్లాడుకోవాలంటే ఆ దృశ్యం అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారత్‌కే అవమానకరంగా కనిపించింది. రాహుల్‌తో సహా ఇండీ కూటమి ముఠా యావత్తు 'రాజ్యాంగాన్ని చేతులలోకి తీసుకున్నాం!' అన్నట్టే ఉంది. అంతేతప్ప ఆ హస్తభూషణ విన్యాసం రాజ్యాంగ విలువలను సమున్నతంగా నిలబెట్టడానికి అంటే నమ్మవలసిన అవసరం లేదన్నదే చాలామంది అభిప్రాయం. కాంగ్రెస్ పార్టీ, అఖిలేశ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆర్‌జేడీ ఇవన్నీ రాజ్యాంగం, అందులోని విలువల గురించి మాట్లాడడానికి కనీస అర్హత కలిగినవేనా? దేశాన్ని దాదాపు ఐదు దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ చరిత్ర చూస్తే వెంటనే

# 18వ లోక్‌సభ..

హిందువులం అంటూ ఎవరు తమను తాము చెప్పుకుంటున్నారో అలాంటి వారంతా హింస ద్వేషంతో నిరంతరం ఊగిపోతూ, అసహనంతో ఉంటారని దేశ అత్యున్నత చట్టసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడడం భారత భూమిలో ఘర్షణ వాతావరణం సృష్టించడానికే. జూలై 1న రాహుల్ ఈ దుస్సాహసానికి ఒడిగట్టాడు. బీజేపీని అడ్డం పెట్టుకుని మొత్తం హిందూజాతిని హింసావాదులుగా చిత్రించడం చాలా తీవ్రమైన వ్యాఖ్య అని అధికారంపక్షం, ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. ఎప్పుడూ నాలుక మడత వేసినట్టుగానే రాహుల్ వెంటనే తాను బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను ఉద్దేశించి మాత్రమే అన్నానని వెనక్కి తగ్గాడు. పార్లమెంటులోను, బయట హిందూ వ్యతిరేకతతో, అసహనంతో దేశంలో సెగ రేపాలని మొదటి నుంచి రాహుల్ ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

జూన్ 24, 2024న 18వ లోక్‌సభ తొలిసారిగా కొలువు తీరింది. తారీఖులకీ, దస్తావేజులకీ ఎవరి అభిప్రాయాలు అవసరం ఉండదు. ఎవరి అభ్యంతరాలతో, అభీష్టాలతో వాటికి నిమిత్తమే లేదు. చరిత్రలో ఏ రోజు ఏం జరిగిందో అవి ఎలాంటి శషభిషలు లేకుండా ప్రకటిస్తాయి. జూన్ 25న దేశంలో అత్యవసర పరిస్థితి విధింపు దుశ్చర్యకు 50 ఏళ్లు పూర్తయ్యాయి. చరిత్ర పట్ల గౌరవం ఉన్నవారే కాదు, అత్యవసర పరిస్థితి బాధితులు కూడా ఆ రోజును తప్పక స్మరించుకుంటారు. దేశ స్వాతంత్ర్యం మీద, ఆ క్రమంలో జరిగిన త్యాగాలు మీద గౌరవం ఉండబట్టే మనం ఆగస్ట్ 15ను సగౌరవంగా గుర్తు చేసుకుంటున్నాం. అత్యవసర పరిస్థితి (జూన్ 25, 1975) విధించిన తేదీని గుర్తు చేసుకోవడం అలాంటిదే. 18వ లోక్‌సభ ప్రారంభ ఘడియలలో ఆ సందర్భం వచ్చింది.

2024 ఎన్నికలలో రాజ్యాంగ ప్రతులతో ఇండీ కూటమి చేసిన ఊరేగింపులు, ప్రదర్శనలు లాభాన్నే తెచ్చిపెట్టాయి. అందుకు కృతజ్ఞతగానే కాబోలు సభలో కూడా ఆ ప్రతులను పట్టుకుని వచ్చారు. ఇది ముందే ఊహించారేమో అన్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఒంటి చేతి రాజ్యాంగ పరిరక్షకుల అసలు బండారం బయటపెట్టారు. అత్యవసర పరిస్థితి యాభయ్ ఏళ్లు పూర్తయ్యాయంటూ ఒక ప్రకటనతో పార్లమెంట్ ప్రాంగణంలోనే మీడియా ఎదుటే దివ్యాస్త్రం సంధించారు. మోదీని మూడోసారి ప్రధాని కాకుండా నిలువరించడానికి సర్వశక్తులూ ఒడ్డిన ఇండీ కూటమి దారుణ పరాజయం చవిచూసింది. ప్రజలు అప్పగించిన అధికారంతో ఎన్‌డీఏ ప్రభుత్వం తన పని తాను చేయకుండా ఆపాలన్న పరమ లక్ష్యమే ఇండీ కూటమిలో తొలి అడుగులోనే స్పష్టమైపోయింది. 16,17 లోక్‌సభలలో (2014, 2019)ఈ పార్టీలన్నీ చేసినది అదే. ఆ వికృత ధోరణికి మరింత పదును పెట్టి దుందుడుకుతనంతో వ్యవహరించాలన్నదే ఇండీ కూటమి ఆశయం.

రాజ్యాంగ ప్రదర్శన, ఉల్లంఘన ఏకకాలంలో చేయగల విద్య ఇండీ కూటమిలోని ప్రతి పార్టీకి క్షుణ్ణంగా తెలుసు. ఎన్నికలకు ముందు పెట్టుకున్న పొత్తుతో 293 స్థానాలు సాధించి ఎన్‌డీఏ పెద్ద కూటమిగా ఆవిర్భవించింది. అయినా 233 వచ్చిన ఇండీ కూటమి పెద్దలు మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్ అధ్యక్షుడు), రాహుల్ 'పాత మిత్రుల'తో మాట్లాడతామని నిస్సిగ్గుగా చెప్పారు. అంటే తెలుగు దేశంతోను, జనతాదళ్ (యు)లతోనే కదా! కాంగ్రెస్






ఆ వాస్తవం బోధపడుతుంది. ఆ కాలమంతా రాజ్యాంగ రక్షణ ఒక మిథ్యగానే కనిపించదా? అదొక నికార్సయిన కుటుంబ పార్టీ అంటే నిరాకరించగలిగేవారు ఇవాళ ఎవరూ లేరు. కాంగ్రెస్‌, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ పాల్పడిన చట్ట ఉల్లంఘనలు, ఎదుర్కొంటున్న అవినీతి కేసులు, వారి హయాములలో దేశంలో, ఆయా రాష్ట్రాలలో శాంతిభద్రతలు, వీరి కుటుంబికుల ఆగడాలు..ఒక్కటి ప్రస్తావించుకున్నా, వాటి ఫలితంగా దేశం అనుభవించిన క్షోభ ఎంతటిదో అంచనా వేసుకున్నా రాజ్యాంగ పరిరక్షకులు, ప్రజాస్వామ్యప్రియులు సిగ్గుతో చచ్చిపోవాలి. ఎన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్‌ రాష్ట్రపతి పాలన రుద్దింది? ఎన్ని ప్రజాతీర్పులను భగ్నం చేసింది? కోర్టు తీర్పులను ఎన్నిసార్లు వక్రీకరించింది? జాతి మరచిపోలేదు. వీటికి పరాకాష్ట జూలై 1న రాహుల్‌ లోక్‌సభలో హిందువులు హింసావాదులంటూ చేసిన వ్యాఖ్య.

# ధ్వని.. ప్రతిధ్వని

ప్రతి అడుగులోను రాజ్యాంగానికి ఎదురైనవి ఇలాంటి పరాభవాలే. అటు ఎన్నికల ఫలితాలన్నీ వెల్లడి కాకుండానే రాహుల్‌ ఏదో మూల నుంచి కాకుల లెక్క తెచ్చి షేర్ల అక్రమాలు అంటూ జాతీయ మీడియా ముందు వీరంగం వేశారు. అది కాస్తా తుస్సుమంది. ఇది ప్రజాతీర్పును అవమానించడమే. రాహుల్‌ గాంధీ పిల్ల జమిందారులా వ్యవహరిస్తారు. బాధ్యత లేకుండా, తీవ్రమైన చర్యలకు కేంద్ర బిందువు అవుతారు. ఆయన చర్యలన్నీ జాతీయ స్ఫూర్తికీ, జాతీయోద్యమ స్ఫూర్తికీ కూడా భంగకరమైనవేనంటే తొందరపాటు కాదు. ఆయన బీజేపీ మీద, ఆర్‌ఎస్‌ఎస్‌ మీద, మోదీ మీద ఎన్నో ఆరోపణలు చేశారు. అందుకు కోర్టులు మొట్టికాయలు వేశాయి. అయినా ఆయన కాస్త కూడా సిగ్గుపడడం లేదు. ఆధారాలు లేని ఆరోపణలను వరసపెట్టి సంధిస్తూనే ఉన్నారు. షేర్ల అక్రమాల వ్యవహారం బెడిసికొట్టిన తరువాత రాజకీయ గురువు దిగ్విజయ్‌సింగ్‌ మొదలు అనేక పార్టీల నేతలతో కలసి ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల మీద రాహుల్‌ మళ్లీ పాత ఆరోపణలు చేశారు. ఈ యంత్రాలను ఉపయోగించ వచ్చునని, ట్యాంపరింగ్‌కు అవకాశం లేదనే పోలింగ్‌కు కొద్ది ముందు కూడా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం గాలికి పోయింది. ఫలితాలు వచ్చి, స్వతంత్రంగా అధికారం చేపట్టడానికి బీజేపీకే మెజారిటీ తగ్గిపోయిన నేపథ్యంలో కూడా ఓటింగ్‌ యంత్రాల మీద రాహుల్‌ విమర్శలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు అయితే మాత్రమేం! కాంగ్రెస్‌ విమర్శిస్తుంది. రాహుల్‌ తప్పు పడతారు.

ప్రజాక్షేత్రంలో బ్యాలెట్‌ సమరంలో ఓడిపోయినా, పార్లమెంట్‌లో రచ్చచేయడం ద్వారా తాము అనుకున్నది సాధించాలన్న దురద ఇండీ కూటమిలో కనిపిస్తూనే ఉంది. దక్షిణ భారతం, ఉత్తర భారతం పేరిట వేర్పాటువాదం ఆలోచన కూడా అందులో ఉంది. ఆ నినాదంతోనే పార్లమెంట్‌లో ఇంకాస్త గట్టి రగడ చేసే యోచన కనిపిస్తున్నది. సెంగోల్‌ను తొలగించి తీరాలని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడి చేత మొరిగించడం అందుకే. ఎంత చిత్రమంటే– అత్యవసర పరిస్థితికి డీఎంకే, ఆర్‌జేడీ వ్యతిరేకంగా పోరాడాయి. ఇప్పుడు కాంగ్రెస్‌ వీటి మోచేతి నీళ్లు తాగుతోంది. కొన్నిచోట్ల నెయ్యం, కొన్నిచోట్ల కయ్యం విధానంతో కాంగ్రెస్‌తోనే కలసి ఉన్న సీపీఎం కూడా అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడినదే. ఈ పార్టీలన్నీ మోదీ ప్రకటనతో తేలు కుట్టిన దొంగల్లా ఉండిపోయి, వాటి పోరాట చరిత్రకు అవే సమాధి కట్టుకున్నాయి. ఆ కాలంలో ఆ పార్టీ కార్యకర్తలు చేసిన ప్రాణ త్యాగాలకీ, సాహసాలకీ, ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికీ నీళ్లు వదిలేశాయి. 'ఔను అత్యవసర పరిస్థితి కాలంలో భారత ప్రజాస్వామ్యం భంగపడింది' అని ఒప్పుకోవడం వీటి కనీస బాధ్యత. ఇంత నేరుగా కాకున్నా లాలూ యాదవ్‌ మాత్రం ఔను, మేం కూడా అరెస్టయ్యాం, అది ప్రజాస్వామ్యానికి మచ్చేనని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అత్యవసర పరిస్థితి స్వతంత్ర భారత చరిత్రలోని పెద్ద చారిత్రక పరిణామం, దాని ఫలితాల పట్ల వాటికి ఉన్న నిబద్ధత, నిజాయతీల నిరూపణకూ ఇలాంటి ఒప్పుకోలు అవసరం. ఆ సత్యాన్ని అంగీక రించడం అంటే చరిత్రను గౌరవించడం అవుతుంది. ఆ చారిత్రక వాస్తవాన్ని ప్రకటిస్తే కాంగ్రెస్‌ బలహీన పడి బీజేపీ నైతికంగా బలపడే చర్య కాగలదనీ, అది సెక్యులరిజానికి చేటనీ వీళ్లంతా భావించడం చరిత్ర

పట్ల చేస్తున్న పెద్ద ద్రోహం. ఆత్మవంచన కూడా. బీజేపీని ఇరుకున పెట్టడం కోసం కొన్ని విషయాలు రోడ్డు మీద తేల్చుకోవడం, దబాయించి పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిరోధించడమే ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండీ కూటమి విధానంగా కనిపిస్తున్నది. కానీ రాహుల్ హ్రస్వదృష్టి ఎంతటిదో ఈ వ్యూహంలోనే తెలుస్తున్నది. ఇవాళ చేతిలో రాజ్యాంగ ప్రతిని కదిలిస్తూ, ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు దంచితే కాంగ్రెస్ గతం గురించి ప్రజలను మభ్యపెట్టవచ్చునని ఆయన నమ్ముతున్నారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ వరకు రాజ్యాంగానికి పొడిచిన తూట్ల వివరాలు చరిత్రలో నమోదై ఉన్న సంగతిని గుర్తించలేనంత మౌఢ్యంలో రాహుల్ ఉన్నారు. ఇది స్వీయ హననం. పార్టీల పేర్లు వేరు. కానీ ఇప్పుడు విపక్ష శిబిరంలో ఉన్నవీ, లేదా ఇండీ కూటమిలో ఉన్నవీ అన్నీ ఒకే పంథాలో నడుస్తున్నాయి. జాతీయ భావంతో, మెజారిటీ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ సాగే పాలనను ఇవన్నీ అడ్డుకోవాలన్న ఏకైక లక్ష్యంతో ఉన్నాయి. బుజ్జగింపు బురద రాజకీయాలలో పొర్లుతూ, దేశ భద్రత సంగతి కూడా అవి విస్మరించాయి. దేశ రాజకీయ నాయకత్వంలో ఏకాభిప్రాయం లేదన్న అభిప్రాయానికి ఇరుగు పొరుగు వచ్చే తీరులోనే ఇవి ప్రవరిస్తున్నాయి. కాంగ్రెస్ ఇచ్చే కొన్ని ప్రకటనలు, అంటే రాహుల్ నోటి నుంచి వచ్చే మాటలు నేరుగా పాకిస్తాన్‌ను, చైనాను సమర్థిస్తూ, భారత్‌ను తప్పుపడుతున్నట్టే ఉంటాయి. 18వ లోక్‌సభలో వేస్తున్న ప్రతి అడుగు భారత సార్వభౌమత్వాన్ని బలహీనపరిచే విధంగా, భారత వ్యతిరేకులు దేశ వ్యవహారాలలో జోక్యం చేసుకునేందుకు ఆహ్వానించినట్టే ఉన్నాయి. ప్రోటెం స్పీకర్, స్పీకర్ ఎంపికలు, సెంగోల్, పాలస్తీనాకు జేజేలు, వెంటనే నీట్ మీద చర్చకు మంకుపట్టు ఇవన్నీ ఇరుగు పొరుగు చేత అంతర్యుద్ధం జరుగుతున్నదన్న అభిప్రాయానికి వచ్చేటట్టు చేస్తున్నాయి. ఐఐటీలలో బడుగులు పరీక్షపత్రాలు రూపొందించడం లేదంటూ వివాదం లేవనెత్తే ప్రయత్నం చేయడం, సైన్యంలో రిజర్వేషన్ గురించి మాట్లాడడం రాహుల్ చేస్తున్న ఘోర తప్పిదాలు. ఇంత మాట్లాడిన ఆ పదవీ లాలసుడు ప్రతిపక్ష హోదాను ఎందుకు ఒక దళితుడికి ఇవ్వలేదు? దీనిని దేశం ప్రశ్నించాలి.

**ప్రోటెం స్పీకర్ ఎంపిక వివాదం**

కాలు తొక్కిన రోజే కాపురం సంగతి తెలుస్తుందని సామెత. 18వ లోక్‌సభలో విపక్షాల వైఖరి ఎట్లా ఉండబోతున్నదో ప్రమాణ స్వీకారోత్సవం తోనే వెల్లడయింది. తొలి సమావేశాలలో కొత్త సభ్యుల ప్రమాణాలు, స్పీకర్ ఎంపిక ఉంటాయి. కొత్త ఎంపీల ప్రమాణానికి ప్రోటెమ్ స్పీకర్‌గా కేరళ నుంచి వచ్చిన కాంగ్రెస్ ఎంపీ కె. సురేశ్‌ను నియమించాలని కోరే



మెహతాబ్, సురేశ్

క్రమంలో కాంగ్రెస్ వృథా వివాదం రేపింది. ఎన్‌డీఏ కూటమి భర్తృహరి మెహతాబ్‌ను ఆ బాధ్యతకు ఎంచుకుంది. మెహతాబ్ కంటే సురేశ్ ఎక్కువ అనుభవజ్ఞుడని కాంగ్రెస్ దబాయించడానికి విశ్వప్రయత్నం చేసింది. ఈ వాదనను ఎన్‌డీఏ కొట్టిపారేసింది. రాష్ట్రపతి ముర్ము మెహతాబ్‌ను (జూన్ 20న) ప్రోటెం స్పీకర్‌గా నియమించారు. ఆయన కటక్ లోక్‌సభ స్థానం నుంచి ఏడుసార్లు వరసగా ఎన్నికయ్యారు. సురేశ్ ఎనిమిది పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికయ్యారని ఇండీ కూటమి వాదన. అయితే ఆయన వరసగా ఎన్నిక కాలేదనీ, 1998, 2004లలో గెలుపు సాధించలేదనీ ఎన్‌డీఏ వెల్లడించింది. ఈ వాస్తవాన్ని పక్కన పెట్టి సురేశ్ దళితుడు కాబట్టి ప్రోటెం స్పీకర్ అవకాశం నిరాకరించారని ఇండీ కూటమి వాదించడం దిగజారుడు రాజకీయం. తమ ప్రభుత్వం సభా సంప్రదాయాలను ఏ మాత్రం ఉల్లంఘించ లేదని, నెహ్రూ కాలం నుంచి వస్తున్న ఆచారాన్నే పాటించామని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా స్పష్టం చేశారు. నిజానికి దళితుడైన సురేశ్‌ను కాంగ్రెస్/ ఇండీ కూటమి రెండుసార్లు అవమానించాయి. ప్రోటెం స్పీకర్ పదవి రాదని తెలిసి ఆయనను ముందుకు తోయడం ఒకటి. స్పీకర్ పదవి ఏకగ్రీవం కావాలంటే, డిప్యూటీ స్పీకర్ పదవి ఇండీ కూటమికి ఇవ్వాలంటూ ఆచరణ సాధ్యం కాని బేరం పెట్టి ఓం బిర్లా చేతిలో ఓడించి రెండోసారి అవమానించారు. 293 స్థానాలు ఉన్న ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి గెలుస్తాడని తెలిసి కూడా 233 స్థానాలు ఉన్న ఇండీ/కాంగ్రెస్ ఈ పని చేసింది. ఈ సందర్భంలోనే ఢిల్లీ ఎంపీ భాసురి స్వరాజ్ చేసిన వ్యాఖ్య నిశితమైనది. దళితుల మీద అంత ప్రేమే ఉంటే, స్పీకర్ పదవి దక్కని సురేశ్‌కు ఇండీ కూటమి, రాహుల్ ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నించారామె. ఈ ఎన్నిక నేపథ్యంలోనే ఒక్కసారిగా వైరల్ అయిన సురేశ్ సంబంధిత వీడియోలో మాటలు వింటే బీజేపీ సభ్యులు ఆయనతో ప్రమాణం తీసుకోవాలని అనుకోరు. పీఎఫ్ఐని నిషేధించినప్పుడు, ఆర్ఎస్ఎస్‌ను కూడా నిషేధించాలని మీడియాతో అన్న నాయకుడు సురేశ్. ఎందుకంటే పీఎఫ్ఐ, ఆర్ఎస్ఎస్ ఒకటే అంటాడా పెద్దమనిషి. మైనారిటీల మీదనే కాదు, దళితుల మీద కాంగ్రెస్ ప్రేమ రాజకీయంలో భాగం. సమన్యాయం కోసం కాదు.

జూన్ 24న 18వ లోక్‌సభ తొలి సమావేశం జరిగింది. అంతకు ముందు రోజే ప్రోటెం స్పీకర్ వివాదాన్ని తెచ్చిన ఇండీ సభ్యులు ఎర్ర అట్ట ఉన్న రాజ్యాంగ ప్రతులతో వచ్చి హడావిడి సృష్టించారు. నరేంద్ర మోదీ, అమిత్ షాలు రాజ్యాంగం మీద దాడి చేయకుండా మేం కాపాడతామని పార్లమెంట్ మీడియా పాయింట్ దగ్గర బీరాలు పలికారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ, కె. సురేశ్, కేసీ వేణుగోపాల్, గౌరవ్ గొగొయ్, దీపేంద్ర హుడా, టీఆర్ బాలు (డీఎంకే), సుదీప్ బందోపాధ్యాయ (టీఎంసీ), సుప్రియా సూలే, డింపుల్ యాదవ్ మొదలైన యావన్మంది విపక్ష గణం అక్కడ చేరింది. తరువాత సభలోకి కూడా రాజ్యాంగ ప్రతులతోనే ప్రవేశించారు.

**మోదీ నోట అత్యవసర పరిస్థితి మాట**

రాజ్యాంగం పట్ల విపక్షం ప్రదర్శిస్తున్న ఈ దొంగ భక్తినీ, నయ వంచక వైఖరినీ చూశాక అధికార పక్షానికి జవాబు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు ప్రధాని మోదీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ అత్యవసర పరిస్థితి గురించి ప్రస్తావించడం దాని ఫలితమే. రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించడం కాంగ్రెస్ పాలనా కాలంలో సర్వసాధారణ విషయంగానే కనిపిస్తుంది. దీనికి పరాకాష్ట అత్యవసర పరిస్థితి విధింపు. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం మీద సమావేశాల మొదటి రోజే కాలు దువ్వుతున్న కాంగ్రెస్ ప్రేమ దుకాణానికి అదే సరైన సమాధానం. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉండగా దేశం మీద రుద్దిన అత్యవసర పరిస్థితి స్వతంత్ర భారత చరిత్ర మీద మాయని మచ్చ అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఇది కీలెరిగి పెట్టిన వాత. ప్రధాని చేసిన ప్రస్తావనకు మీడియా విశేష ప్రాధాన్యం ఇచ్చింది. ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రజలంతా తీర్మానం చేయాలని కూడా మోదీ పిలుపునిచ్చారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని కూడా ప్రధాని చెప్పడం విజ్ఞతతో కూడుకొని ఉన్న మాట. నిజమే, అత్యవసర పరిస్థితివేళ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ పెద్ద కారాగారంగా మార్చివేసింది. ఇప్పుడు రాజ్యాంగ రక్షణ అంటూ ఊరేగినంత మాత్రాన ఆ మచ్చ చెరిగిపోదు. అత్యవసర పరిస్థితి విధించి కావలసినంత అప్రతిష్ట మూట కట్టుకున్న పార్టీ నాయకుడిగా రాహుల్ దేశానికి ఇప్పటికైనా క్షమాపణ చెప్పి తీరాలి. ప్రజాస్వామ్యం అంటూ తాను చేస్తున్న గడబిడ పదవీదాహంతో కాదని నిరూపించుకోవాలి. అప్పుడు ఆయన నిజమైన ప్రజాస్వామ్య, రాజ్యాంగ

పరిరక్షకుడని కాస్తయినా జనానికి నమ్మకం ఏర్పడుతుంది. రాహుల్ ప్రజాస్వామ్యం పేరుతో విపక్ష నేతలు దేశంలో ఒక జుగుప్సాకరమైన ప్రహసనాన్ని ప్రదర్శిస్తున్నారు.

**ఒవైసీ 'జై పాలస్తీనా నినాదం**

ప్రమాణ స్వీకారం సందర్భంగా కొత్త ఎంపీలు రకరకాల నినాదాలు చేశారు. అవన్నీ భారత చరిత్రకో, రాజకీయ చరిత్రకో, సంస్కృతికో చెందినవే. కొందరు తమ రాష్ట్రం మీద, ప్రాంతం మీద భక్తి ప్రకటించుకున్నారు. కానీ సభలో ఏకైక ఎంఐఎం సభ్యుడు మాత్రం తన ఇతర నినాదాలతో పాటు 'జై పాలస్తీనా' అని పెద్ద రగడకు తెర తీశారు. భారత మాతకు జై అని పలకను అని నిస్సిగ్గుగా చెప్పినవాడు, భారత పార్లమెంటులో పాలస్తీనాకు జైకొట్టాడు. ప్రస్తుతం ఈ అంశం మీద చేసిన ఫిర్యాదు రాష్ట్రపతి వద్ద, న్యాయస్థానాలలోను ఉంది. ఒవైసీ వైఖరికి నిరసనగా ఢిల్లీలోని ఆయన నివాసం మీద జూన్ 27వ తేదీ రాత్రి దాడి జరిగింది. భారత్–ఇజ్రాయెల్ బంధాన్ని గుర్తు చేసే ఒక పోస్టర్‌ను కూడా ఇంటి గోడల మీద అతికించారు.

**స్పీకర్ ఎంపిక**

స్పీకర్ పదవిని ఏకగ్రీవం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్ చూపించిన చొరవకు కాంగ్రెస్ సరైన రీతిలో స్పందించలేదు. ప్రోటెం స్పీకర్ విషయంలో తన నిర్ణయాన్ని టీఎంసీ, ఎన్‌సీపీతో మాటమాత్రంగా కూడా చెప్పని పార్టీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనను గౌరవిస్తుందా? డిప్యూటీ స్పీకర్ పదవి విపక్షానికి ఇస్తామని మాట ఇస్తే స్పీకర్ పదవిని ఏకగ్రీవం చేస్తామని విపక్షం చెప్పడమే ఒక అనారోగ్యకర బేరమనిపిస్తుంది. అయినా ప్రోటెం స్పీకర్‌ను చేయదలిచిన కె. సురేశ్‌ను మళ్లీ బరిలోకి దింపారు. ఎన్‌డీఏ బలం మేరకు ఓం బిర్లా రెండోసారి స్పీకర్ అయ్యారు. ఆయన స్పీకర్ అయిన వెంటనే అత్యవసర పరిస్థితి బాధితులను స్మరిస్తూ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి కాంగ్రెస్ వ్యతిరేకించింది. నిజానికి రెండోసారి ఎంపికైన మరుక్షణం నుంచే ఓం బిర్లా తన సహజ శాంత స్వభావాన్ని వీడవలసిన పరిస్థితి కల్పించింది విపక్షం. నీట్ మీద చర్చకు పట్టుపట్టింది. జూన్ 25, 1975 తేదీ అర్ధరాత్రి ఎమర్జెన్సీని రుద్దినట్టే జూన్ 25, 2024వ తేదీ అర్ధరాత్రి రాహుల్‌గాంధీని విపక్ష శిబిరం మీద విపక్ష నేతగా రుద్దారు. రాహుల్‌గాంధీ తొలి ఉపన్యాసంతోనే ప్రభుత్వంమీద కాలు దువ్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నీట్ పరీక్ష లీకేజీ మీద తక్షణం చర్చ చేపట్టాలని పట్టుపట్టారు. రాజ్యసభలోను అదే తీరు.దీనితో సభలు వాయిదా పడ్డాయి. స్పీకర్‌ను మర్యాద పూర్వకంగా విపక్ష బృందం కలసినప్పుడు కూడా అత్యవసర పరిస్థితి గురించి ప్రస్తావించినందుకు రాహుల్ స్పీకర్‌కు



కొత్త స్పీకర్‌ను ఆయన స్థానం వద్దకు తోడ్కొని వెళ్లిన మోదీ, రాహుల్, కిరెన్ రిజిజు

నిరసన తెలియచేయడం వింతే. దీనిలో అధికార పక్ష భావప్రకటనా స్వేచ్ఛ కంటే, సభా సంప్రదాయాలకు విరుద్ధమైన రాజకీయ అంశంగా రాహుల్ చూడడం మరీ వికృతం. నిరంతరం రాజ్యాంగ రక్షణ బాధ్యతను స్వీకరిస్తున్నట్టు చెప్పుకున్న విపక్షం స్పీకర్ ఎంపిక వేళ తెలుగుదేశం, జేడీ (యు)లకు ఇచ్చిన సందేశాల గురించి ఇక్కడ గుర్తు చేసుకోవాలి. తాము బరిలోకి దింపిన కె. సురేశ్ దళితుడు కాబట్టి, సామాజిక న్యాయం కోసం ఆయనకు ఓటు వేసి గెలిపించాలని ఆ సందేశాల సారాంశం. మరి, రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళ ద్రౌపది ముర్మును నిలిపినప్పుడు ఆమె మీద యశ్వంత్ సిన్హాను పోటీకి దింపినప్పుడు ఈ సామాజిక న్యాయ పరిరక్షకుల బుద్ధి గాడిదలను కాయడానికి వెళ్లిందా?

**సెంగోల్ వివాదం**

తాము భారతీయ చరిత్ర మీద, దాని స్ఫూర్తి మీద, చారిత్రక చిహ్నాల మీద యథాప్రకారం దాడి సాగిస్తామని కూడా విపక్షం తొలి సమావేశాల వేళ ప్రకటించినట్టయింది. లోక్‌సభలో ఉంచిన సెంగోల్‌ను తొలగించి అక్కడ రాజ్యాంగ ప్రతిని (పెద్దది చేయించి) ప్రతిష్ఠించాలని సమాజ్‌వాదీ పార్టీ



సభ్యుడు ఆర్‌కే చౌదరి (ఉత్తరప్రదేశ్) స్పీకర్ ఓం బిర్లాను కోరడం విశేషం. సెంగోల్ రాచరికానికి ప్రతీక అని కనిపెట్టాడు ఆర్‌కేచౌదరి. కాబట్టి ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన రాజ్యాంగ ప్రతిని ప్రతిష్ఠించాలట. చిత్రం ఏమిటంటే తమిళ భాషను, సంస్కృతిని ఎవరు ఎంత చిన్న మాట అన్నా మండిపడిపోయే ద్రవిడ పార్టీలు హిందీ ప్రాంతీయుడు సెంగోల్‌ను తొలగించాలని పార్లమెంటులో చెప్పినా నోరెత్తలేదు. నిజానికి అది రాజదండం అని ఎవరూ అనడం లేదు. ఎందుకంటే అది ధర్మదండం. పైగా నెహ్రూ కూడా దాని ఘనతను ఆమోదించారు.

రాజ్యాంగ ప్రతిని చేతబూని విపక్షం లోక్‌సభ సాక్షిగా సాగించబోతున్న ఈ రాజ్యాంగ వ్యతిరేక యుద్ధం రోడ్ల మీదకు రావడానికి కూడా పెద్ద సమయం పట్టదు. మోదీ మళ్లీ ఎన్నికయితే రక్తపాతం తప్పదని రాహుల్ ఒక ప్రచార సభలో చేసిన వ్యాఖ్యకు రియాసీ (జమ్ము) బస్సు మీద కాల్పుల ద్వారా పాకిస్తాన్ కార్యరూపం ఇచ్చింది. నకిలీ రైతులు కూడా రోడ్లెక్క బోతున్నట్టు సంకేతాలు ఇచ్చేశారు.

జాతీయ రక్షణకు ఉద్దేశించిన అజెండాలో ఏ ఒక్క అంశాన్ని అమలు చేయాలని బీజేపీ చూసినా మతోన్మాదులు రోడ్ల మీద మహిళలను, పిల్లలను కూర్చో బెడతారు. షాహీన్‌బాగ్‌లు మళ్లీ కొలువైనా ఆశ్చర్యపోనక్కరలేదు. దేశ విచ్ఛిన్నం వీరి ఏకైక అజెండా. ప్రజాస్వామ్యం అంటే దొంగ వాగ్దానాలు కాదు. ప్రభుత్వాన్ని స్తంభింప చేయడం కాదు. దేశ ప్రజలు విపక్షం నుంచి ఆశిస్తున్నది ఇది కాదు. విపక్షం విధ్వంసపు ఆలోచన అధికారపక్షం వెంటనే గ్రహించింది. నిర్దేశించుకున్న అజెండా ప్రకారమే నడిచేందుకు సిద్ధపడినట్టు సంకేతాలు కూడా ఇచ్చింది. అధికారం దక్కకపోతే విపక్షంలో కూర్చోవాలి. విలువల విధ్వంసానికి తెగబడకూడదు. దేశమే ప్రధానం అనుకోలేనివారి పని అది.

– జాగృతి డెస్క్



# 39 రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చిన ఇందిర

అధికరణం-356 అమల్లోకి వచ్చిన దగ్గరినుంచి దీనిపై చర్చలు కొనసా గుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రాష్ట్రపతిపాలన విధింపు వల్ల దేశంలో సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటున్నదనేది ఈ చర్చల్లోని ముఖ్యాంశం. ఈ అధికరణం మూలం, భారత ప్రభుత్వ చట్టం-1935లో, 93వ సెక్షన్‌లో ఉంది. ఏదైనా ప్రావెన్స్ గవర్నర్ ఈ చట్టంలోని నిబంధనల మేరకు పనిచేయలేని పరిస్థితి తలెత్తినప్పుడు, ఆ ప్రావెన్స్‌లో అత్యవసర పరిస్థితి విధించవచ్చునని ఈ సెక్షన్ పేర్కొంటున్నది. భారత ప్రభుత్వ చట్టం-1935లో పేర్కొన్న ఈ నిబంధనను యథాతథంగా రాజ్యాంగంలో కి తీసుకున్నారు. అయితే అక్కడ ఉపయోగించిన 'గవర్నర్' స్థానంలో 'రాష్ట్రపతి' అనే పదాన్ని చేర్చారంతే. అంటే ఒక బ్రిటిష్ అవశేషంతో కాంగ్రెస్ ఎన్నో ప్రజాతీర్పులను వంచించింది. 134 పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వాలు రద్దయినాయి. ఇందులో ఎక్కువ వాటా కాంగ్రెస్ ప్రభుత్వానిదే. కొన్నింటి విషయంలో కోర్టులు మొట్టికాయలు వేశాయి.

ఆర్టికల్-356వల్ల రాష్ట్రాలపై కేంద్ర ఆధిపత్యం పెరుగుతుందనేది ప్రధానంగా వాదనల్లో వినిపిస్తున్న మాట. ముఖ్యంగా 'అదర్‌వైజ్' అనే పదం ఈ ఆధిపత్యానికి కారణమన్నది విమర్శకులు ప్రధానంగా లేవనెత్తుతున్న అంశం. నిజం చెప్పాలంటే రాజ్యాంగకర్తలు భావి భారత రాజకీయాలు ఏవిధంగా ఉండబోతున్నాయనే అంశాన్ని సరిగా అంచనా వేయలేదనే చెప్పాలి. అంతేకాదు ఒక రాజకీయ పార్టీ తన ప్రయోజనాలకోసం రాజ్యాంగ సవరణలను చేపట్టే అవకాశాన్ని వారు ఊహించి ఉండరు. 1984లో ఎన్‌టీఆర్ ప్రభుత్వాన్ని ఇందిరా గాంధీ కూలదోసిన తీరు ఇప్పటికీ ప్రజల మనోఃఫలకాలపై ఉంది.

రాజ్యాంగం అమల్లోకి వచ్చాక సరిగ్గా ఏడాదికి, 1951లో అప్పటి నెహ్రూ ప్రభుత్వం 356 అధికరణాన్ని దుర్వినియోగం చేస్తూ గోపీచంద్ బారువా నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వాన్ని రద్దుచేసింది. ముఖ్యమంత్రికి అసెంబ్లీలో మెజారిటీ ఉన్నప్పటికీ కేంద్రం ఈ చర్యకు పాల్పడింది. రాష్ట్రంలో భద్రతకు ఇబ్బంది కలిగించే సమస్యలు కూడా ఏమీలేవు. అంటే సరైన కారణాలు లేకుండానే ప్రభుత్వం రద్దు చేయడం వల్ల ఈ అధికరణం దుర్వినియోగం అవుతుందనేది స్పష్టమైంది. అదేవిధంగా 1954లో ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టులు అధికారాన్ని చేజిక్కించుకుంటారన్న అనుమానంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసింది. నాటి నుంచి నేటివరకు కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాలకోసం రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించిన సంఘటనలు అనేకం జరిగాయి. భారత రాష్ట్రపతి గవర్నర్‌ను నియమిస్తారు. రాష్ట్రపతి సంతృప్తి మేరకే గవర్నర్ పదవిలో కొనసాగుతారు. ఇక రాష్ట్రపతి కేంద్రమంత్రిమండలి సలహా ప్రకారం పాలన కొనసాగిస్తారు. రాజ్యాంగంలోని ఈ నిబంధన కలిగిన 356వ అధికరణాన్ని ఉపయోగించి, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టడానికి కేంద్రం ప్రభుత్వానికి ఒక ఆయుధంగా మారింది. అందువల్ల ఒక రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి విధించే రాష్ట్రపతి అధికారం విచక్షణ ఇక్కడ ప్రశ్నార్థకమవుతోంది.

### పరిస్థితి చేయిదాటినప్పుడు...

వివిధ దేశాల్లో అత్యవసర విధింపునకు అవసరమైన పరిస్థితుల విషయంలో భిన్నమైన నియమాలున్నాయి. కొన్ని దేశాల్లో ఈ నియమాలు విపులంగా ఉండగా మరికొన్ని దేశాల్లో అస్పష్టంగా ఉన్నాయి. ప్రభుత్వ పరిధినుంచి పరిస్థితులు చేయిదాటితే అత్యవసర పరిస్థితి విధించవచ్చునేది మొత్తంమీద సారాంశం. అత్యవసర పరిస్థితి విధించే విషయంలో జర్మనీలో చట్టాలు చాలా స్పష్టంగా విపులంగా ఉండటంతో వీటిని మన రాజ్యాంగంలోకి తీసుకున్నారు. జర్మనీ, భారత్‌లో మాదిరి అత్యవసర పరిస్థితి విధించే నిబంధనలు చాలా ప్రజాస్వామ్య దేశాల్లో లేవు. అమెరికాలో జాతీయ, ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించేందుకు వీలు కల్పించే చట్టాలు అమల్లో ఉన్నాయి. భారత్, జర్మనీల్లో కేంద్ర కార్యనిర్వాహక వ్యవస్థపై అత్యవసర పరిస్థితి విధింపు ఆధారపడి ఉంటుంది. అట్లాగని ఈ విధింపు న్యాయ సమీక్షకు అతీతం కాదు. "రాజ్యాంగ యంత్రాంగం వైఫల్యం చెందినప్పుడు" విధించే అత్యవసర అధికారంగా దీన్ని పరిగణించాల్సి ఉంటుంది.

ఈ 356వ అధికరణాన్ని ఇందిరాగాంధీ దుర్వినియోగం చేసిన స్థాయిలో మరే ఇతర ప్రధాని చేయలేదన్నది వాస్తవం. 1966-77 మధ్యకాలంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయిన వివిధ రాష్ట్రాల్లో 39సార్లు కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. 1975 తర్వాతి కాలంలో కూడా కేంద్రం అత్యవసర పరిస్థితిని వివిధ రాష్ట్రాల్లో చాలాసార్లు విధించింది. ఎమర్జెన్సీ తర్వాత జనతా పార్టీ ప్రభుత్వం, కాంగ్రెస్ అధికారంలో ఉన్న చాలా రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించింది. 1980లో తిరిగి అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ మళ్లీ, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్షాల ప్రభుత్వాల రద్దుకు పాల్పడింది. గమనార్హమైన విషయమేమంటే ఎమర్జెన్సీ విధింపు విషయంలో న్యాయవ్యవస్థ ఎప్పటికప్పుడు జోక్యం చేసుకుంటుండటంతో క్రమంగా రాష్ట్రపతి పాలన విధించడం తగ్గుతూ రావడం ఒక సానుకూల పరిణామం. రాష్ట్రపతి పాలన విధించిన రెండు నెలల్లోగా ఈ ఆర్డినెన్స్ పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందడం తప్పనిసరి. సభకు హాజరైన సభ్యుల్లో మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు చేస్తే సరిపోతుంది. దీన్ని 356(2) అధికరణం స్పష్టం చేస్తోంది. ఒకవేళ అత్యవసర పరిస్థితి విధించిన తర్వాత రెండు నెలల్లోగా పార్లమెంట్ రద్దయితే, కొత్త లోక్‌సభ కొలువుతీరిన తర్వాత 30 రోజుల వరకు ఈ రాష్ట్రపతిపాలన అమల్లో ఉండి తర్వాత రద్దవుతుంది. రాజ్యసభ శాశ్వతసభ కావడంవల్ల ఈ ఆర్డినెన్స్ బిల్లును సకాలంలో ఆమోదించాలి.

### రాజస్థాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా

ఏప్రిల్ 17,1977న జనతా ప్రభుత్వానికి చెందిన కేంద్ర హోంమంత్రి ఉత్తరప్రదేశ్, బీహార్, హరియాణా, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలకు

ఒక లేఖ పంపారు. 356వ అధికరణం కింద రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేస్తున్నామన్నది ఆ లేఖ సారాంశం. 1977 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ దారుణంగా ఓటమి పాలైన నేపథ్యంలో జనతా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యతో ఒక్కసారిగా ఈ పది రాష్ట్రాల్లో ప్రభుత్వాల రద్దు, వెంటనే ఎన్నికలు జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం సుప్రీంకోర్టు గడప తొక్కడంతో, ఈ ఆదేశం న్యాయసమ్మతంగా లేదన్న అంశాన్ని గుర్తించిన కోర్టు ఈ విషయాన్ని పరిశీలించింది. అయితే కోర్టు జోక్యాన్ని కార్యనిర్వాహక వ్యవస్థ కొట్టివేసింది. చాలా సందర్భాల్లో కోర్టులు ఈ అధికరణం విషయంలో కలుగజేసుకోలేదు. కొన్ని సందర్భాలో దీనికింద రాష్ట్రపతి పాలన విధింపులోని సామంజసత్వంపై న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య స్పర్థలు కొన సాగినప్పటికీ, చివరకు ఎగ్జిక్యూటివ్‌దే పైచేయిగా నిలుస్తూ వచ్చింది. ఈ కేసులో 'రాష్ట్రపతి సంతృప్తి' అనేది ప్రధానాంశం.కేంద్ర ప్రభుత్వాలు పేర్కొనే 'అసంతృప్తి' దురుద్దేశంతో కూడినదైనప్పుడు న్యాయ సమీక్ష చేయవచ్చునని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ముఖ్యంగా 356(1)వ అధికరణం రాష్ట్రపతి 'సంతృప్తి' అనే అంశాన్ని స్పష్టంగా పేర్కొంటున్నందున, ఆయన 'అసంతృప్తి' చెందనప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేయడం రాజ్యాంగ విరుద్ధమవుతుందని కూడా స్పష్టం చేసింది.

## 42, 44 రాజ్యాంగ సవరణలు

1975-77 మధ్యకాలంలో విధించిన అత్యవసరపరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణ (1976)ద్వారా, భారతీయ చట్టాల్లో అనేక మార్పులు చేశారు. ఈ రాజ్యాంగ సవరణ దేశంలో అమలవుతున్న సమాఖ్య వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపిందనే చెప్పాలి. ఫలితంగా ఈ సవరణకు జనసమ్మతి లభించలేదు. ముఖ్యంగా పౌర హక్కుల ఉల్లంఘన, పోలీసులు మానవ హక్కుల హననానికి పాల్పడటంతో దేశవ్యాప్తంగా ఈ చట్టంపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తింది. అనంతరం ఏర్పడిన వచ్చిన జనతా ప్రభుత్వం 44వ రాజ్యాంగ సవరణ ద్వారా, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంలో చేపట్టిన కొన్ని మార్పులను రద్దుచేసింది. ఆ విధంగా దేశంలో సమాఖ్య వ్యవస్థను పునరుద్ధ రించారు. 44వ రాజ్యాంగ సవరణ 356 అధికరణం పరిధిని కుదించింది. ఇందులో 'ఏడాది' అనే పదం స్థానంలో 'ఆర్నెల్లు' అనే పదాన్ని చేర్చారు. ఫలితంగా అత్యవసర పరిస్థితిని కేంద్రం ప్రకటించిన రోజు నుంచి ఆర్నెల్ల కాలంలోగా పార్లమెంట్ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఆర్నెల్ల కాలం ముగిసిన ప్రతిసారి పార్లమెంట్ అనుమతి తప్పనిసరి. 44వ రాజ్యాంగ సవరణద్వారా 356 అధికరణానికి 5వ క్లాజును జతచేశారు. దీని ప్రకారం ఒక రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ఏడాది కంటే ఎక్కువ కాలం ఈ క్రింది పరిస్థితుల్లో తప్ప విధించకూడదు.


1. పార్లమెంట్ సదరు తీర్మానాన్ని ఆమోదించే సమయానికి అత్యవసర పరిస్థితి కొనసాగుతున్నప్పుడు.

2. ఒక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం కష్టతరంగా ఉన్నందువల్ల 356వ అధికరణం కింద అత్యవసర పరిస్థితి ప్రకటించడం తప్పని సరి అని ఎన్నికల సంఘం ధ్రువీకరించినప్పుడు. అయితే అత్యవసర పరిస్థితి గరిష్టంగా మూడేళ్లకు మించి విధించకూడదని 44వ రాజ్యాంగ సవరణ స్పష్టం చేసింది.

ఒక రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్య పరిపాలన పునరుద్ధరణకు అవసరమైన కనీస కాలవ్యవధిని నిర్ణయించడం ఈ సవరణ ప్రధాన ఉద్దేశం. అంతేకాదు దేశంలో పాలనను మరింత ప్రజాస్వామ్యయుతం చేయడం కోసం 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రభుత్వం రాజ్యాంగంలో మరిన్ని మార్పులు చేసింది. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన పరిపాలనకు ఈ రాజ్యాంగ సవరణ మరింత విస్తృత నిర్వచనం ఇచ్చింది. తర్వాతి కాలంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలపై నియమించిన సర్కారియా కమిషన్ 356వ అధికరణాన్ని అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే ప్రయోగించాలని తన సిఫారసుల్లో స్పష్టం చేసింది. ఇక పూంచి కమిషన్ అత్యవసర పరిస్థితిని కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయాలని, అదికూడా మూడు నెలలకు మించి కొనసాగించరాదని సిఫారసు చేసింది. దీన్నే 'లోకలైజ్డ్ ఎమర్జెన్సీ' అని పేర్కొంది.

## యథేచ్ఛగా ప్రభుత్వాల రద్దు

రాజ్యాంగం అమల్లోకి వచ్చిననాటినుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం మొత్తం 134సార్లు ఇదే అధికరణాన్ని ప్రయోగించి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేసింది. జూన్ 20, 1951న ఈ అధికరణాన్ని మొట్టమొదటిసారి పంజాబ్ ప్రభుత్వంపై అప్పటి కేంద్రం ప్రయోగించింది. పాటియాలా ఈస్ట్ పంజాబ్ స్టేట్ యూనియన్ (ఇది భారత్‌లోని పూర్వపు రాష్ట్రం. పంజాబ్‌లోని వివిధ సంస్థానాలను కలిపేయడం ద్వారా జులై 15, 1948న ఇది ఏర్పాటైంది. 1950లో ఇది దేశంలో



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

అధికారిక రాష్ట్రమైంది. అప్పట్లో దీని రాజధాని పాటియాలా. దీని చివరి సంస్థానాధీశుడు యదువీర్ సింగ్‌ను ఈ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమిం చారు. నవంబర్ 1,1956న ఈ పీఈపీఎస్‌యూ, పంజాబ్‌లో అధికారికంగా కలిసిపోయింది) అసెంబ్లీకి 1952 సెప్టెంబర్‌లో తొలి ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 26, అకాలీదళ్ 19సీట్లు గెలుచుకున్నాయి. మొత్తం స్థానాలు 60. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో జ్ఞాన్‌సింగ్ రాణేవాలా కాంగ్రెసేతర ముఖ్యమంత్రి అయ్యారు. ఈ నేపథ్యంలో 1953లో నెహ్రూ ప్రభుత్వం ఈ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం విషయంలో కేంద్రం స్వార్థపూరితంగా వ్యవహరించింది. 1951-52 సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర అసెంబ్లీలోని 375 స్థానాల్లో, 152 సీట్లు గెలుచుకొని కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ (టంగుటూరు ప్రకాశం పంతులు దీని నాయకులు) నాయకత్వంలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ తమకు 166 సభ్యుల మద్దతున్నదని గవర్నర్‌కు నివేదించినా ఖాతరు చేయని గవర్నర్, కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వడంతో చక్రవర్తి రాజగోపాలాచారి ముఖ్యమంత్రి అయ్యారు. ఇక్కడ జవాహర్‌లాల్ నెహ్రూ నైతిక విలువల పేరుతో కలుగజేసుకోలేదు. ఇందుకు ప్రధాన కారణం కాంగ్రెస్ అధికారంలోకి రావడమే. ఇక కేరళలో ఎన్నికైన మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూడా 1959, జులై 31న ఇదే అధికరణాన్ని ప్రయోగించి నెహ్రూ ప్రభుత్వం కూల్చివేసింది. 1970-80 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేయడం ఒక అలవాటుగా మారిపోయింది. 1966-77 మధ్యకాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం 39సార్లు ఈ అధికరణాన్ని ప్రయోగిస్తే, 1977లో అత్యవసరపరిస్థితి తర్వాత అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ 9రాష్ట్ర ప్రభుత్వాలను ఈ అధికరణాన్ని ఉపయోగించి రద్దుచేసింది. 1992లో కేంద్ర ప్రభుత్వం మూడు బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేసింది. బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత ముఖ్యంగా 2000 సంవత్సరం తర్వాత ఈ అధికరణాన్ని విచ్చలవిడిగా ప్రయోగించడం బాగా తగ్గిపోయింది.

## ఏయే రాష్ట్రాల్లో ఎన్నెన్ని సార్లు...

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో విధించిన రాష్ట్రపతి పాలన వివరాలీవిధంగా ఉన్నాయి. ఎక్కువసార్లు రాష్ట్రపతి పాలన విధించిన రాష్ట్రం మణిపూర్. ఆంధ్ర రాష్ట్రం (1), ఆంధ్రప్రదేశ్(2), అరుణాచల్‌ప్రదేశ్(2), అస్సాం (4), బీహార్(8), ఢిల్లీ(1), గోవా(3), గోవా, డామన్ & దయ్యు (2), గుజరాత్(5), హరియాణా(3),


హిమాచల్‌ప్రదేశ్(2), జమ్ము& కశ్మీర్ రాష్ట్రం(8), జమ్ము& కశ్మీర్(కేంద్రపాలిత ప్రాంతం–1), జార్ఖండ్(3), కర్ణాటక(6), కేరళ(6), మధ్యప్రదేశ్ (3), మహారాష్ట్ర(3), మణిపూర్(10), మేఘాలయ(2), మిజోరం(3), నాగాలాండ్(4), ఒడిశా(6), పాటియాలా ఈస్ట్ పంజాబ్ స్టేట్ యూనియన్ (1), పుదుచ్చేరి(7), పంజాబ్(8), రాజస్థాన్(4), సిక్కిం(2), తమిళనాడు(3), ట్రావన్‌కూర్–కొచ్చిన్(1), త్రిపుర(3), ఉత్తరప్రదేశ్(9), ఉత్తరాఖండ్ (2), పశ్చిమబెంగాల్ (5)సార్లు రాష్ట్రపతిపాలన విధింపునకు గురయ్యాయి.

**పావులుగా మారిన గవర్నర్లు**

1967–72 మధ్యకాలంలో 16 రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలహీనపడటమే కాదు 8 రాష్ట్రాల్లో పట్టుకోల్పోయింది. ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఈ పరిస్థితుల్లోనే కేంద్ర ప్రభుత్వం గవర్నర్లను పావులుగా వాడుకొని, కాంగ్రెస్సేతర ప్రభుత్వాలను కూల్చివేయడం మొదలుపెట్టింది. 1971లో అప్రతిహత విజయాన్ని నమోదు చేసిన ఇందిరాగాంధీ, ఈ అధికరణాన్ని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేయడానికి ఎంతమాత్రం సంకోచించలేదు. ఆవిధంగా ఆమె ప్రారంభించిన 'కూల్చివేత ట్రెండ్' తర్వాత అధికారంలోకి వచ్చిన మొరార్జీదేశాయ్, రాజీవ్‌గాంధీ ఇతర ప్రధానులకు మార్గదర్శకంగా నిలిచింది.



ఎన్టీఆర్



రామ్ లాల్

ఈ విధంగా గవర్నర్లను పావులుగా వాడుకోవడాన్ని బొమ్మై కేసుకు ముందు, తర్వాత అనే రెండు భాగాలుగా విశ్లేషించవచ్చు. బొమ్మై కేసుకు ముందు గవర్నర్లను ఉపయోగించి 356 అధికరణాన్ని కేంద్రం యథేచ్ఛగా ప్రయోగించింది. బొమ్మై కేసు తర్వాత ఇది న్యాయ సమీక్షా పరిధిలోకి వెళ్లడంతో గవర్నర్లను మరోవిధంగా ఉపయోగించుకోవడం మొదలైంది. 1984లో జమ్ము–కశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా పార్టీలో చీలికలను ప్రోత్సహించి ప్రభుత్వాన్ని పడగొట్టడం, అదే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.ఆర్. ప్రభుత్వాన్ని కూల్చివేయడం వంటివి బొమ్మై కేసుకు ముందు ఉదాహరణలుగా చెప్పవచ్చు. 1989, ఏప్రిల్ 20న కర్ణాటక గవర్నర్ వెంకటసుబ్బయ్య, ఎస్.ఆర్.బొమ్మై ప్రభుత్వాన్ని రద్దుచేశారు.

బొమ్మై సుప్రీంకోర్టును ఆశ్రయించడం, కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించడం తర్వాతి పరిణామాలు. ఆ తర్వాత 1997 అక్టోబర్–నవంబర్ నెల ల్లో ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని గవర్నర్ సహాయంతో కేంద్రం ఏకపక్షంగా రద్దుచేసింది. 2004లో వచ్చిన యు.పి.ఎ ప్రభుత్వం అంతకుముందు ఎన్.డి.ఎ. ప్రభుత్వం నియమించిన గవర్నర్లు రాజీనామాలు చేయాలని కోరింది. గవర్నర్లుగా పనిచేసిన బూటాసింగ్ (బిహార్–2004), సయ్యద్ సిబ్టె హసన్ రిజ్వి (జార్ఖండ్–2004), హెచ్.ఆర్. భరద్వాజ్ (కర్ణాటక–2009), కమలా బేనీవాల్ (గుజరాత్–2009)లు గవర్నర్ పదవి ప్రతిష్టను పెంచేరీతిలో వ్యవహరించలేదు. కేవలం ఒక పార్టీ నాయకులుగానే ప్రవర్తించడంతో, గవర్నర్ వ్యవస్థపై ఒకరకమైన అప నమ్మకం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ★

**బీజేపీకి నాలుగు వందల స్థానాలు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, రిజర్వేషన్లు రద్దవుతాయని కాంగ్రెస్ విషప్రచారం సాగించింది. రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగ ప్రతిని ఉంచుకుని మరీ ఎన్నికల్లో విద్వేష ప్రచారం సాగించారు. రాజ్యాంగం పట్టుకుని తిరిగినంత మాత్రాన దానికి విలువ ఇస్తున్నట్టు, దాని ప్రాతిపదికగా రాజకీయాన్ని నడుపుతున్నట్టు కాదని అంతా గ్రహించాలి. అసలు కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవం ఉంది? ఆ పార్టీ తీసుకున్న నిర్ణయాలు ఏ తీరుగా నడిచాయి?**

స్వాతంత్ర్యానంతరం నిర్వహించిన 17 సార్వత్రిక ఎన్నికల్లో, కాంగ్రెస్ ఏడుసార్లు పూర్తి మెజార్టీ సాధించి అధికారం చేపట్టింది. మూడుసార్లు సంకీర్ణ ప్రభుత్వాలను నడిపింది. మొత్తం 54 సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉంది. ఈ ఐదు దశాబ్దాలలో 80 సార్లు రాజ్యాంగాన్ని సవరించింది. వివిధ సందర్భాల్లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయి. ప్రాథమిక హక్కులకు భంగం కలిగాయి. షాబోనా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టటం, ఎమర్జెన్సీ విధింపు, ఆర్టికల్ 356 దుర్వినియోగం వంటి అంశాలు ఇందుకు కొన్ని ఉదాహరణలు.

**షాబానో కేసు**

ముస్లిం మహిళల స్వేచ్ఛ, హక్కుల పోరాటంలో మైలురాయిగా షాబానో కేసును పేర్కొంటారు. షాబానో అనే ముస్లిం మహిళ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కి చెందిన న్యాయవాది మహ్మద్ అహ్మద్‌ఖాన్‌ను వివాహం చేసుకుంది. మొత్తం ఐదుగురు సంతానం. 14 సంవత్సరాల తర్వాత షాబానో భర్త మరో స్త్రీని వివాహం చేసుకున్నాడు. 1975లో, 62 ఏళ్ల షాబానోను పిల్లలతో సహా తరిమివేశాడు. దాంతో 1978లో ఆమె సెక్షన్ 125 సీఆర్పీసీ కింద ఇండోర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేటు కోర్టులో పిటీషన్ వేసింది. నవంబరు 1978లో మహమ్మద్‌ఖాన్ షాబానోకి తలాక్ చెప్పాడు. భరణం చెల్లించ నవసరంలేదని వాదించాడు.


స్థానిక కోర్టునెలకు రూ.25 వంతున మెయింటెనెన్స్‌గా చెల్లించమని ఆదేశించింది. ఈ మొత్తాన్ని రూ.179 పెంచాలని కోరుతూ షాబానో మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి విజయం సాధించారు. ఖాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు



# ఎనభయ్యే సార్లు రాజ్యాంగ సవరణ

కూడా ఖాన్ వాదనను సమర్థించింది. షాబానో కేసులో ఏప్రిల్ 23, 1985లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చింది. ఆమె తనకు విడాకులు ఇచ్చిన భర్త నుంచి నెలవారీగా 179.20పై నెలవారీ అలవెన్సుగా పొందవచ్చని పేర్కొంది. ముస్లిం మత గురువులు, ముస్లిం లా బోర్డు ఈ తీర్పును అంగీకరించలేదు.

తర్వాత జరిగిన పరిణామాలు అననుకూలంగా మారాయి. రాజీవ్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మహిళల (ప్రొటెక్షన్ ఆన్ డైవర్స్ యాక్ట్),1986 పేరుతో చట్టాన్ని చేసింది. ఈ చట్టం ద్వారా షాబానో కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పును అమలు చేయనవసరంలేనిదిగా మారింది. కేవలం ఇద్దత్ వ్యవధి వరకే మెయింటెనెన్స్ వర్తిస్తుందని ఈ చట్టం స్పష్టం చేస్తుంది. మహిళ తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు బాధిత మహిళకు ఆమెపైన ఆధారపడిన పిల్లలకు స్థిరత్వం




అందించటానికి వక్ఫ్‌బోర్డుకు మెజిస్ట్రేట్ తగిన సూచనలు చేయవచ్చని సూచించింది.

షాబానో కేసులో రాజీవ్ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రధాన పత్రికలు తప్పుపట్టాయి. అప్పటి వరకూ 'రాజీవ్‌ను కొత్త ఆశాకిరణం' అని కీర్తించే టైమ్స్ ఇండియా సంపాదకుడు గిరిలాల్ జైన్ తీవ్రంగా నిందిస్తూ వ్యాసం రాశాడు. మరో సంపాదకుడు అరుణ్‌శౌరి కూడా విమర్శలు గుప్పించాడు. షాబానో తీర్పును తారుమారు లేదా తల్లకిందులు చేయవద్దని హోం, న్యాయశాఖలు సలహా ఇచ్చినా ప్రధాని పెడచెవిన పెట్టారని విమర్శించారు. పార్లమెంటు హౌస్‌కు పిలిపించి మాట్లాడినప్పుడు అరుణ్‌శౌరి తన అభిప్రాయాన్ని రాజీవ్ కి సూటిగా చెప్పారు. 73 ఏళ్ల బాధిత మహిళకు నెలవారీ రూ.179.20పై చెల్లించటం ఇస్లాం మతానికి ఏ రకంగా భంగకరం అని ప్రశ్నించారు. ప్రభుత్వం తీవ్రవాదులకు తలొగ్గుతుందనే భావనలో ఉన్నారు.సుప్రీం తీర్పుపైన పార్లమెంటులో మాట్లాడి అందరి ప్రశంసలు పొందిన హోంశాఖ సహాయమంత్రి అరిఫ్ మహ్మద్‌ఖాన్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తన పదవికి రాజీనామా చేయటం ఇందులో కొసమెరుపు. షాబానో కేసులో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల హిందువులకు ఆగ్రహం కలిగిందన్న వార్తలు ప్రధాని రాజీవ్‌గాంధీని కలిచివేశాయి.

**ఎమర్జెన్సీ నిర్ణయం**

1975జూన్ 25వ తేదీ అర్ధరాత్రి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించటం ప్రజాస్వామ్యంలో చీకటిరోజుగా చరిత్రలో నమోదయ్యింది. అది రాజ్యాంగపీఠిక మీద జరిగిన దాడి. ఎమర్జెన్సీ దుష్పరిణామాలు ఏమిటో అవి ప్రజాస్వామ్యాన్ని ఎలా దెబ్బతీశాయో ఇన్ని సంవత్సరాలుగా విస్తృతమైన చర్చే సాగుతోంది. ఈ సందర్భంగా ఎన్నో అకృత్యాలు చోటుచేసుకున్నాయి. తన రెండో కుమారుడు సంజయ్‌గాంధీ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించటానికి అవకాశం ఇవ్వటం ఇందిరాగాంధీ చేసిన అతి పెద్ద పొరపాటు. తర్కుమాన్ గేట్ వద్ద సామాన్యుల ఇళ్లను కూల్చివేయటం, సంఖ్యాపరంగా లక్ష్యాలు నిర్దేశించి బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించటం, మూకుమ్మడిగా ప్రతిపక్ష నేతలను నెలల్లో తరబడి జైళ్లలో మగ్గపెట్టటం వంటి దురాగతాలు ఎన్నో అప్పుడు చోటుచేసుకున్నాయి.

ఎమర్జెన్సీ విధించినందుకు ఇందిరకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మరిచిపోయిందేమో గానీ ఇతరులు ఎవరూ మరిచిపోలేదు.



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్

**సీబీఐ పెంపుడు చిలక**


దాదాపు 11 ఏళ్ల క్రితం జస్టిస్ ఆర్.ఎం.లోథా అప్పటి ప్రయివేటు వ్యక్తులకు బొగ్గు గనుల లైసెన్సులు ఇచ్చే విషయంలో అప్పటి అటర్నీ జనరల్‌కు చివాట్లు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేసినవే. "చూడబోతే సీబీఐ పంజరంలా చిలకలా తయారయింది.

తన యజమాని చెప్పినట్టే నడుస్తోంది" అని వ్యాఖ్యా నించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం తమను అణచివేయటానికి సీబీఐని ఆయుధంగా వాడుకుంటోందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు అప్పుడు అధికారికంగా స్వరం వచ్చినట్టయ్యింది. అయితే తర్వాత రోజుల్లో మోదీ ప్రభుత్వం పైన ఇదే అంశంపైన కాంగ్రెస్ ఇతర ఇండీకూటమి నేతలు వ్యాఖ్యలు చేస్తూండటం గమనార్హం.

**పార్టీ ప్రతిష్ఠ దిగజారుతూ..**

అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, వారసత్వ రాజకీయాలకు పర్యాయపదంగా మారి ఒకప్పటి ప్రాభవాన్ని కాంగ్రెస్ కోల్పోవటం చరిత్ర. 2004లో 26 శాతం ఓట్లతో 145 సీట్లు, 2009లో 28 శాతం సీట్లతో 206 సీట్లు సాధించిన కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 2014లో 19శాతం ఓట్లతో 44 స్థానాలకు, 2019లో 19శాతం ఓట్లతో 52 స్థానాలకు పరిమితం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలు వచ్చే నాటికి అది 99 స్థానాలకు చేరినా, విద్వేష రాజకీయాలకు దూరం కాలేదు.

కాంగ్రెస్ విష ప్రచారాన్ని ప్రధాని మోదీ తిప్పి కొట్టారు."మేం రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నాం. ప్రత్యేక ప్రతిపత్తిని అందించే 370వ అధికరణను రద్దు చేసి జమ్ముకశ్మీర్‌లో రాజ్యాంగం అమలుకు సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేశాం. దళితులకు, గిరిజనులకు, ఓబీసీలకు రిజర్వేషన్ హక్కులు కల్పించాం. ఓటు బ్యాంకు రాజకీయాల వల్లే ట్రిపుల్ తలాక్ ని కాంగ్రెస్ నిషేధించలేదు. ఇన్ని సంవత్సరాల పాటు పాలించినా స్టాట్యూట్ బుక్‌ను రూపొందించలేకపోయిందని ధ్వజమెత్తారు. ★



# ‘ఎమర్జెన్సీ విధించిన పార్టీ బతికి బట్టకట్టడమే వింత!’

జూన్ 25, 2024 సాయంత్రం ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌గారితో కూర్చున్నాను. కొత్త లోక్‌సభ కొలువు తీరడం, మూడోసారి ప్రధాని అయిన నరేంద్ర మోదీ ఆ ముందురోజు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిని గురించి ప్రస్తావించడం ఇవన్నీ చర్చకు వచ్చాయి. జూన్ 25, 1975 నాటి అత్యవసర విధింపు ఉదంతాన్ని భారతీయులు ఏటా స్మరించుకోవడం అవసరమేనని డాక్టర్ శివప్రసాద్ వెంటనే అన్నారు. ఎందుకంటే 1977 తరువాతి భారత రాజకీయాల మీద ఆ ఉదంతం ప్రభావం విశేషంగా ఉంది. అవీ ఇవీ చెబుతూనే ఆయన నాటి జ్ఞాపకాలలోకి తీసుకువెళ్లారు. ఈ ముఖాముఖీ వనరు అదే.

**చరిత్రలో జూన్ 25వ తేదీకి ప్రాధాన్యం ఉందంటారు. ఏమిటది?**

సరిగ్గా యాభై సంవత్సరాల నాటి కథ. జూన్ 25, 1975న నాటి ప్రధాని ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని విధించింది. ఆ మరుక్షణం భారత రాజ్యాంగం పక్కకి పోయింది.

**ఎందుకు అలా చేసింది ఇందిర?**

రాయబరేలీ నియోజకవర్గం నుంచి ఇందిర ఎన్నిక చెల్లదని అలహాబాదు హైకోర్టు తీర్పు నిచ్చింది. రాజీనామా చేయవలసిందిగా ప్రతిపక్ష నాయకులు కోరారు. ఐతే ఆమె మొరార్జీ దేశాయ్, జయప్రకాశ్ నారాయణ్, ఎ.బి. వాజపేయి, ఎల్‌కే అద్వాణి, జార్జి ఫెర్నాండెజ్ వంటి ప్రముఖ నాయకులందరినీ జైల్లో పెట్టింది. ఆర్‌ఎస్ఎస్, వీహెచ్‌పీ, ఆనందమార్గ్ వంటి పాతిక సంస్థలను నిషేధించింది. ప్రాథమిక హక్కులకు పాతరేసింది. రాజ్యాంగంలో నూతన అధికరణలు ప్రవేశపెట్టింది. నవంబరు 14, 1975న నేను హైదరాబాదులో సెక్రటేరియట్‌కు నడిచి వెళ్తుంటే పోలీసులు అరెస్టు చేశారు. ‘ఇతడు భారతమాతాకీ జై అన్నాడు. దేశభక్తుడు’ అని నా మీద కేసు. ముషీరాబాదు సెంట్రల్‌జైలులో పడేశారు. ‘నేను దేశభక్తుడినేమిటి? సావర్కర్ లాంటి మహాపురుషులనే అలా అంటారు’ అని చెప్పినా కోర్టు పట్టించుకోలేదు. కేసు రెండేండ్లు నడిచింది. హైదరాబాదులోనే నల్లకుంట ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉండేవాణ్ణి. ఒక టెర్రరిస్టును పట్టుకోవడానికి వచ్చినట్లు పోలీసులు ఆ ఇంటి మీద దాడి చేశారు. దానితో ఇంటి ఓనర్ మా సామాన్లు బయట పడేశాడు. అప్పుడు నా కుటుంబం గతి ఏమిటి? ఇలాగే ఇంకొన్ని కుటుంబాలు. వారు ఇంట్లో ఫర్నీచర్, ఒంటి మీది బంగారం, మంగళసూత్రాలు అమ్ముకొని భోజన సామాగ్రిని కొనుక్కున్నారు. కొందరి పిల్లలు దొంగతనాలు చేసి బ్రతికారు. ఇవన్నీ కఠోర సత్యాలు. ఇప్పుడు చెప్పండి! ఈ నెహ్రూ కుటుంబాన్ని గౌరవించాలా? ప్రజాస్వామ్యానికి కేరాఫ్ అని చెప్పే నెహ్రూ కుమార్తె చేసినదే ఇదంతా. ఆమె పదవిని కాపాడుకునేందుకే.

**అప్పుడు మీకు మద్దతుగా ఎవరు నిలిచారు?**

ఒక్కరు కూడా అయ్యో పాపం అనలేదు. అంతటా భయమే. సరికదా సాటి కవులు సినారె, జె. బాపురెడ్డి, బోయి భీమన్న, శేషేంద్ర, శ్రీశ్రీ వంటివారు ఇందిరాగాంధీని ప్రశంసిస్తూ కవి సమ్మేళనాలు నిర్వహించారు. ది హిందూ, ది టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి ఆంగ్ల పత్రికలు ఇందిరనే బలపరిచాయి. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, స్టేట్స్‌మన్, సెమినార్, మెయిన్‌స్ట్రీమ్ వంటి పత్రికలు ప్రతిఘటించాయి. జాగృతి వంటి పత్రికలు సెన్సార్‌షిప్‌తో మూతపడ్డాయి. ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు నోరు మూసుకున్నారు. ఒక్క పెజావర్ స్వామి బహిరంగంగా ఇందిరమ్మను ఎదిరించాడు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి వంటి పత్రికలన్నీ 26.6.1975 నుంచి రెండురోజులు సంపాదకీయం ప్రచురించే స్థలాలను ఖాళీగా విడిచిపెట్టి నిరసన ప్రకటించాయి. పదవిని కాపాడుకునేందుకు ఇందిర దేశాన్ని జైలుగా మార్చింది. అది స్వతంత్ర భారత చరిత్రలోనే చీకటిరోజు. అందుకే 26.6.2024 నాడు లోకసభకు రెండోసారి స్పీకర్ ఓం బిర్లాగారు ఈ అంశం ప్రస్తావించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అది సముచితం.

**ఎమర్జెన్సీలో నిర్బంధం ఎలా ఉండేది?**

చిన్న చిన్న సంఘటనలు కూడా గుర్తున్నాయి. ముళ్లపూడి సూర్యనారాయణమూర్తి గారింట్లో 25.6.1975 రాత్రే పెళ్లి. ఆర్‌ఎస్ఎస్ పెద్దలు వచ్చారు. మెరుపు లేని ఉరుములా ఎమర్జెన్సీ విధింపు వార్త అందింది. వారంతా అక్షింతలు వేయకుండా, భోజనాలు చేయకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోవలసి

వచ్చింది. ఒకసారి ప్రాంత ప్రచారక్ సోంపల్లి సోమయ్య గారు మా ఇంటికి భోజనానికి వచ్చారు. ఇంతలోనే మా కాలనీలోనే ఉండే సత్యం అనే సీఐడీ గుమ్మం దగ్గరకొచ్చి నిలబడ్డాడు. అంతే, సోమయ్య గారు విస్తరి ముందు నుంచి లేచి వెనుక ద్వారం నుండి పారిపోవలసి వచ్చింది. ఇవి చాలా చిన్నవి. అప్పుడు జరిగిన అత్యాచారాలకి అంతేలేదు. సీపీఐతో కలసి ఇందిర మొత్తం జాతిని హింసించింది. అత్యవసర పరిస్థితిని సీపీఐ ఘనంగా సమర్థించింది.

**ఇంత జరుగుతున్నా ప్రజలు నోరు మూసుకొని ఊరుకున్నారా?**

అలహాబాద్ హైకోర్టు తీర్పు, దరిమిలా సుప్రీంకోర్టు షరతులతో కూడిన స్టే ఇవ్వడానికి ముందే దేశంలో ఆమె అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం ఆరంభమైంది. అదే సంపూర్ణ విప్లవం. అత్యవసర పరిస్థితి విధింపు తరువాత జనసంఘర్షణ సమితి పేరుతో ఆ ఉద్యమం కొనసాగింది. ప్రముఖ నేతలంతా అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకి జరిగిన ఉద్యమం చరిత్ర ప్రసిద్ధమైనదే. అందుకు రహస్య కరపత్రాలు బాగా ఉపకరించాయి.

**ఈ చీకటిరోజులపై ఏమైనా గ్రంథాలు వచ్చాయా? అత్యవసర పరిస్థితి తరువాతి కాలంలో దాని ప్రభావం ఏమిటి? ఎంత?**

తెలుగులో తక్కువే. కానీ ఆంగ్లంలో వందలలో ఉన్నాయి. 'ఎండ్ ఆఫ్ యాన్ ఈరా', 'ఏ సాగా ఆఫ్ స్ట్రగుల్', 'ది జడ్జిమెంట్' వంటివి ఎన్నో వచ్చాయి.

ఒకసారి ప్రాంత ప్రచారక్ సోంపల్లి సోమయ్య గారు మా ఇంటికి భోజనానికి వచ్చారు. ఇంతలోనే మా కాలనీలోనే ఉండే సత్యం అనే సిఐడి గుమ్మం దగ్గరకొచ్చి నిలబడ్డాడు. అంతే, సోమయ్య గారు విస్తరి ముందు నుంచి లేచి వెనుక ద్వారం నుండి పారిపోవలసి వచ్చింది.



తెలుగులో భండారు సదాశివరావు రాసిన 'జనవిజయం' ఈ అంశాన్నే అక్షరబద్ధం చేసింది. నేను 'అత్యాచారపర్వం' అనే గ్రంథం రాశాను. 1977 ఎన్నికలలో ఇందిర ఓడిపోయింది. మొరార్జీ నాయకత్వంలో జనతా ప్రభుత్వం ఏర్పడింది. చౌదరి చరణ్‌సింగ్ మద్దతుతో ఆ ప్రభుత్వాన్ని ఇందిరే కూల్చివేసింది. కానీ అత్యవసర పరిస్థితి ప్రభావం ఇప్పటికీ రాజకీయాలను శాసిస్తూనే ఉంది.

**నేటి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు చూస్తే ఒక ప్రశ్న అనివార్యంగా వేసుకోవాలనే అనిపిస్తుంది. అదే భారత్ భవితవ్యం ఏమిటి? అలాగే మోదీ కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపు సాధ్యమేనా?**

చైనా, పాకిస్తాన్‌లు ఇండియాను ఆక్రమించుకోవాలని చూస్తున్నాయి. అందుకు కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు మద్దత్తునిస్తున్నాయి. నేతాజీ, తిలక్, ప్రకాశం, మహాత్మా గాంధీ యుగం ముగిసి పోయింది. ఉత్తర దక్షిణ భారతాలను వేరు చేయాలనే డీకే సురేశ్ వంటి వేర్పాటువాదులు, అసలు ఈ దేశాన్ని ముక్కలు చేయాలన్న కన్హయ్య కుమార్ వంటి అర్బన్ నక్సలైట్లు ఉన్నారు దాంట్లో. అందుకే మోదీ ఇచ్చిన పిలుపు వాస్తవరూపం దాలిస్తేనే మేలని నా నిశ్చితాభిప్రాయం. అత్యవసర విధింపు వంటి చర్యలకు పాల్పడిన పార్టీ ప్రజాస్వామిక వ్యవస్థలో ఇంకా మనుగడ సాగించడమే ఈ దేశంలో వింత. నా దృష్టిలో వేర్పాటువాదాన్ని ప్రబోధించే ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిష్టుల కన్నా నాడు ఇందిర కాళ్లు కడిగిన, నేడు సోనియా కాళ్లు కడిగి నెత్తిన చల్లుకుంటున్న హిందువులే ఎక్కువ ద్రోహులు.

**జొన్నాభట్ల నరసింహప్రసాద్**
**కథారచయిత, 25-6-2024**



# 'మేమూ అరెస్టయ్యాం.. బాధలు పడ్డాం!'

అత్యవసర పరిస్థితి (1975) సమయంలో తాము కూడా బాధలు పడ్డామని ఎట్టకేలకు ఆర్‌జేడీ నాయకుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ అంగీకరించారు. జూన్ 29వ తేదీన ఆయన ప్రముఖ ఆంగ్ల దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియాకు రాసిన వ్యాసంలో కొన్ని విషయాలు బయటపెట్టారు. తమను ఇందిరాగాంధీ నిర్బంధించినప్పటికి వ్యక్తిగత దూషణలకు దిగలేదని లాలూ ఒక మెలిక పెట్టారు. ఎంతయినా ఇంకా కాంగ్రెస్‌తో పని ఉంది కదా! కాంగ్రెస్‌తో ఎంత సాన్నిహిత్యం ఉన్నా, కొన్ని వాస్తవాలను దాచిపెట్టడం సాధ్యం కాదు. అందుకే అత్యవసర పరిస్థితి భారత ప్రజాస్వామ్యం మీద మచ్చేనని ఆ వ్యాసంలో లాలూ ప్రసాద్ అంగీకరించక తప్పలేదు. జర్నలిస్ట్ నళిన్ వర్మతో కలసి ఆయన ఆ వ్యాసం రాశారు. అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో జరిగిన అత్యాచారాలపై జయప్రకాశ్ నారాయణ్ నియమించిన సంఘానికి తాను కన్వీనర్‌నని, తాను కూడా మెయింటినెన్స్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్ కింద అరెస్టయి, 15 మాసాలు జైలులో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇవాళ స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్న నరేంద్రమోదీ, ఆయన మంత్రివర్గ సభ్యులు నడ్డా, ఇతర నాయకుల పేర్లు ఏవీ ఆనాడు తాము వినలేదని కూడా ఆయన అన్నారు. ఇందిర తమను మీసా కింద జైలులో పడేసినా ఏనాడూ వ్యక్తిగత విమర్శలు చేయలేదని ఆయన వెల్లడించారు. నిజానికి అప్పటికి లాలూ కూడా పేరున్న నాయకుడేమీ కాదు. బిహార్ ముఖ్యమంత్రి కావడం, అద్వానీ రథయాత్రను బిహార్‌లో నిరోధించడం ఆయనకు ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఇటీవల నరేంద్ర మోదీ అత్యవసర పరిస్థితిని గుర్తు చేస్తూ ప్రసంగించిన నేపథ్యంలో లాలూ ఈ వివరాలు వెల్లడించారు.

అత్యవసర పరిస్థితి విధిస్తున్న సంగతి నాటి హోంమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డికి కూడా తెలియదు. పత్రికల మీద సెన్సార్‌షిప్ విధించారు. 20 అంశాల ఆర్థిక కార్యక్రమం పేరుతో ఆదరాబాదరా కొన్ని సంస్కరణలు చేయడం వల్ల పరిస్థితి మరింత దిగజారింది. జేపీ, మొరార్జీ, వాజపేయి, అద్వాణి, విజయరాజే సింధియా, ములాయం, జేబీ కృపలానీ, చరణ్‌సింగ్, రాజ్‌నారాయణ్, అరుణ్ జైట్లీ వంటి వారంతా అరెస్టయ్యారు. వీఎస్ అచ్యుతానందన్, జ్యోతిర్మయి బసు (సీపీఎం) అరెస్టయ్యారు. బలవంతపు కుటుంబ నియంత్రణ అత్యవసర పరిస్థితిలో ఎక్కువ క్రూరమైనదిగా పేర్గాంచింది. ఎమర్జెన్సీ బాధలతోనే బెంగళూరులో కన్ను మూసిన నటి స్నేహలతా రెడ్డి వంటి ఉదంతం ఇప్పటికీ కన్నీళ్లు తెప్పిస్తుంది. కేరళలో రాజన్ కేసు కూడా అలాంటిదే. ఎంతమందిని అక్రమంగా నిర్బంధించారో లెక్కలేదు. ★

ఆంధ్రప్రదేశ్‌లో గత వారం రోజుల్లో మూడు ముఖ్యమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత ప్రభుత్వ పాలనా విధానాలపై సమీక్షలు, పథకాలపై తనిఖీలు, ఎన్నికల అజెండాపై కార్యాచరణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అత్యంత ప్రభావం చూపిన, అవినీతికి లోనైన పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం (ల్యాండ్, శాండ్, మైన్స్, జియాలజీ), మద్యం, ఎక్సైజ్, శాంతిభద్రతలు, ఆర్థికశాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించి, అమలుచేస్తోంది కూడా. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సంతకాలు చేసిన అయిదు పథకాల్లో ఒకటైన సామాజిక పింఛన్లను రూ.వెయ్యి పెంచి జూలై ఒకటిన పంపిణీ చేశారు.



# పోలవరంపై రాజధానిపై

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తదితర మంత్రులు తమ శాఖలపై సమీక్షలు నిర్వహిస్తూ అయిదేళ్లలో జరిగిన విషయాలు తెలుసు కుంటూనే క్షేత్ర స్థాయిలో పరిశీలన ప్రారంభించారు. రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారు. పోలవరం వెళ్లి అక్కడ వాస్తవ పరిస్థితులు పరిశీలించి నిపుణులతో చర్చించి శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. అలాగే పోలవరం నిర్మాణంపై పరిశీలన, పరీక్ష, సూచన, సలహాలకు అమెరికా, కెనడాలకు చెందిన నీటి పారుదల నిపుణులను పిలిపించారు. ఇక ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ తన శాఖలు.. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల అధికారు లతో వరుస సమీక్షలు నిర్వహిస్తూ, వాస్తవ పరిస్థితులు తెలుసు కుంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. డయేరియా నివారణకు వైద్యశిబిరాలు నిర్వహించి, ఆసుపత్రుల్లో మౌలికసదుపాయాలను తెలుసుకునేందుకు పర్యటి స్తున్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రజాపంపిణీ వ్యవస్థ కింద పంపిణీ జరిగే బియ్యం కొన్ని ప్రైవేటు గోదాముల్లో అక్రమ నిల్వలున్నట్లు గుర్తించి సీజ్ చేయించారు.

**పోలవరంపై శ్వేతపత్రం**

గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వం శ్వేతపత్రంలో వివరించింది. విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం కంటే గత వైసీపీ ప్రభుత్వం చేసిన నష్టమే ఎక్కువని పేర్కొంది. పోలవరానికి సంబంధించిన రూ.3,385 కోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించినట్లు ఆరోపించింది. శ్వేతపత్రంలో పేర్కొన్న అంశాలిలా ఉన్నాయి. 2014 నుండి 2019 వరకూ రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై రూ.11,762 కోట్లు ఖర్చు చేసింది. అందులో కేంద్రం వాటాగా రూ.6764.16 కోట్లు ఉన్నాయి. మిగతా నిధుల చెల్లింపులో జాప్యం చేసింది. '2019లో ప్రభుత్వం మారిన తరువాత నుండి కేంద్రం రూ.8,382.11 కోట్లు రాష్ట్రానికి ఇవ్వగా, అందులో రూ.4996.53 కోట్లు ప్రాజెక్టు పనులకు ఖర్చు చేసి, మిగిలిన నిధుల్లో రూ.3,385.58 కోట్లను వేరే అవసరాలకు మళ్లించారు. దీంతో ప్రాజెక్టు పనులకు నిధుల కొరత ఏర్పడింది. 2024 మే 31 నాటికి రూ.2,697 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణం పనులపై ప్రభావం చూపింది' అని శ్వేతపత్రం వివరించింది. బిల్లులు ఇవ్వకపోవడంతో ఏజెన్సీలన్నీ పనులు నిలిపేసినట్లు తెలిపింది. మరోవైపు ఎగువ కాఫర్ డ్యామ్‌లో గ్యాప్‌లను పూడ్చకపోవడంతో 2020లో వచ్చిన వరదల ఉధృతికి దిగువన ఉన్న డయాఫ్రం వాల్ దెబ్బతింది. వాల్ ఎదురు భాగంలో 50 అడుగులకు పైగా గుంటలు పడటంతో డయాఫ్రం వాల్ ఎంత దెబ్బతిందనే దానిపై ఎగువ కాఫర్ డ్యామ్‌లో గ్యాప్‌లను పూడ్చకపోవడంతో రెండున్నర సంవత్సరాల తరువాత అంచనా వేసింది. 'దీనిపై పరిశీలనకు నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్(ఎన్ హెచ్పీసి)ని నియమించారు. ప్రస్తుతం దెబ్బతిన్న ప్రాంతాల్లో రింగ్ బండ్ పద్ధతిలో నిర్మాణం చేపట్టా లని, లేదా మొత్తం గోడ నిర్మించాలని నిపుణులు సూచించారు. గత ఏడాది మార్చి ఐదో తేదీన జరిగిన డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్ దీనిని అంగీకరించింది. అందుకు అప్పటి ఏజెన్సీ మేఘా, బావర్ కంపెనీలూ అంగీకరించాయి. అయితే మరమ్మతులు చేసిన తరువాత అది పటిష్టంగా ఉంటుందా?లేదా? అనే అంశంపై ఎన్‌హెచ్‌పీసీ ఎటువంటి హామీని ఇవ్వలేదు. దీంతో ప్రస్తుతం డయాఫ్రం వాల్ తోపాటు నది పొడవున మరొక వాల్ నిర్మించాలని బావర్ కంపెనీ సూచించింది. దీన్ని సీడబ్ల్యూసీకి పంపించగా ,దానిని పరిశీలించిన సీడబ్ల్యూసీ నిపుణులు కొత్త వాల్ నిర్మాణం లేదా మరమ్మతులకు అనుమతించారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. అక్కడ పెండింగ్‌లో ఉంది' అని వివరించింది. కొత్త వాల్ నిర్మాణానికి రూ.970 కోట్ల వరకూ వ్యయమవు తుందని అంచనా వేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

**రేషన్ బియ్యం మాఫియా అడ్డాగా కాకినాడ**

రేషన్ బియ్యం మాఫియాకు కాకినాడ అడ్డాగా మారింది. కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు ఈ బియ్యాన్ని ఎగుమతి చేస్తూ కోట్లు గడిస్తున్న వైనంపై పౌర సరఫరాల శాఖ కొరడా ఝుళి పించింది. ఈ కేసును సీఐడీ విచారణకు అప్పగిస్తా మని పేర్కొంది. ఆహార భద్రత పథకం కింద పేదలకు రూపాయికి కిలో బియ్యం అందిస్తోంది. అందుకు కిలోకు రూ.39 ఖర్చుచేస్తోంది. ఇదే అదనుగా రేషన్ మాఫియా ఈ చౌకబియ్యాన్ని కొల్లగొడుతోంది. సొంతనౌకల్లో సరకు తరలిస్తూ.. విదేశాల్లోనూ గోదాములు కట్టుకుని అక్రమాల సామ్రాజ్యాన్ని విస్తరించారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ సాగిన ఈ అక్రమాల తంతుకు కీలక శాఖలు ఊతమందిం చాయి. కూటమి సర్కారు ఏర్పాటయ్యాక పాపాల పుట్ట కదిలింది. కాకినాడ రేషన్ మాఫియా అక్రమాలు బయట పడ్డాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు సంస్థల్లో సోదాలు చేశారు. వేల టన్నుల అక్రమ నిల్వలు సీజ్ చేయించారు. ఈ అక్రమాల్లో కాకినాడ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబం, ఆయన అనుచరులదే కీలక పాత్రని బాహాటంగా వెల్లడిం చారు. సీఐడీ విచారణ చేయిస్తామని వెల్లడించడంతో కాక రేగింది.

వైసీపీ ప్రభుత్వంలో అప్పటి కాకినాడ నగర

టీఎస్. భూషణ్



# శ్వేతపత్రం.. ముందడుగు..

ఎమ్మెల్యే ద్వారంపూడి రేషన్ వ్యవహారంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆయన తండ్రి భాస్కరరెడ్డి పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా, సోదరుడు వీరభద్రా రెడ్డి రాష్ట్ర మిల్లర్ల సంఘం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా, షిప్పింగ్ సంస్థ సంఘం అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. కొందరు మిల్లర్లను, ఎగుమతిదారులను గుప్పెట్లో పెట్టుకుని ఈ వ్యవహారం సాగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు యాంకరేజి పోర్టుతోపాటు పలు గోదాముల్లో 12,915 టన్నుల బియ్యం సీజ్‌చేయడం ఈ సంస్థలు అనుయాయులవే కావడంతో అన్ని వేళ్లూ ద్వారం పూడి వైపే చూపిస్తున్నాయి.

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో నెలకు 2.12 లక్షల టన్నుల బియ్యం పంపిణీ చేస్తుంటే.. ఇందులో సగం మాఫియా పక్కదారి పట్టిస్తోంది. అర్హత లేనివారికి కార్డులు ఉండడం, వారికి ఈ బియ్యం తినే అవసరం లేకపోవడం మాఫియాకు కలిసొస్తోంది. ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ వేయించుకుని సరకు పక్కన పెడుతున్నారు. ఊరూరా దళారులు సేకరించిన ఈ నిల్వలన్నిటిని ఓ చోటుకు చేరవేసి పోర్టుల ద్వారా విదేశాలకు తరలించి సొమ్ము చేసు కుంటున్నారు. పోలీసు, రవాణా, పౌర సరఫరాలు, తూనికలు – కొలతలు, వాణిజ్యపన్నుల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోర్టు ఇలా అన్ని శాఖల అధికారులూ అక్రమాల్లో సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. పోర్టు అధీనంలోని గోదాము ల్లోనూ చౌకబియ్యం గుర్తించడం.. పోర్టు అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరించడంపై చర్చ నడుస్తోంది. పోర్టులకు వెళ్లే సరకుల తనిఖీకి వ్యవస్థ లేకపోవడం, అక్కడి పర్యవేక్షక యంత్రాంగం దాసోహమవ్వడం అక్రమాలకు ఊతమిచ్చింది.

**కాకినాడ నుంచి ఆఫ్రికా దేశాలకు**

రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు నుంచి అడ్డదారిన సేకరిస్తున్న పేదల బియ్యాన్ని కాకినాడ, మచిలీపట్నం రేవుల ద్వారా విదేశాలకు తరలిస్తు న్నారు. రేవుల్లో బియ్యం లోడింగ్, అన్ లోడింగ్‌కు బిహార్, ఒడిశా కూలీలను వినియోగి స్తున్నారు. గతంలో కాకినాడ యాంకరేజి పోర్టు ద్వారానే బియ్యం ఎగుమతులు ఉండేవి. ఇప్పుడు ప్రైవేటు పోర్టు ద్వారా ఎగుమతుల సామర్థ్యం పెంచి, అదనపు బెర్తుల నిర్మాణానికి అవకాశం ఇచ్చి స్వలాభానికి వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో 400 రైస్ మిల్లులు ఉన్నాయి ఆసియాలో అతిపెద్ద సామర్థ్యం ఉన్న మిల్లులు ఇక్కడ ఉండడం, పౌరసరఫరాల వ్యవస్థ ఒక కుటుంబం చేతిలో ఉండడం కలిసొచ్చిన అంశం. ఐదేళ్లూ వేలకోట్ల అక్రమార్జనకు ఇదే ఊతమిచ్చింది. బాస్మతియేతర బియ్యం ఎగుమతు లపై కేంద్రం నిషేధం విధించినా అక్రమ సేకరణ ఆగలేదు. ఎక్కడి కక్కడ భారీగా నిల్వలు ఉంచారు. నూకలుగా చేసి తరలించే ప్రక్రియ కొనసాగించారు.

**రాజధాని నిర్మాణంలో మరో ముందడుగు**


రాజధాని అమరావతి నిర్మాణంలో మరో ముందడుగు పడింది. ఈ ప్రాంతంలో చేపట్టనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్ భవనాలకు 1575 ఎకరాలను ప్రభుత్వం గుర్తించి, ఆ ప్రాంతాన్ని సీఆర్‌డీఏ నోటిఫై చేసింది. ఈ మేరకు సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ గెజిట్ విడుదల చేశారు. సీఆర్‌డీఏ చట్టం సెక్షన్ 39 ప్రకారం బహిరంగ ప్రకటన కూడా జారీ చేశారు. రాయపూడి, నేలపాడు, లింగాయపాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం సరిహద్దుల్లోని ప్రాంతాన్ని నోటిఫై చేస్తున్నట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని నగరంలోని 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో మొత్తం ప్లానుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్లాను పరిధిలో ఎక్కడ ఏమి నిర్మించాలన్నా దానికి గుర్తిస్తూ సీఆర్‌డీఏ విడివిడిగా నోటిఫికేషన్‌లు ఇవ్వాల్సి ఉంది. 2019కు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం గవర్నమెంటు కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. దీనిలో శాశ్వత సచివా లయం, హైకోర్టు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండ నున్నాయి. సచివాలయ భవనాల నిర్మాణానికి అడుగు భాగంలో ర్యాఫ్ట్ కూడా వేశారు. మొత్తం 1575 ఎకరాల పరిధిలో వేసిన ఈ ప్లానును అప్పట్లో నోటిఫై చేయలేదు. ఆలోపు ఎన్నికలు రావడంతో ఇతర ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. ఇప్పుడు మరలా కూటమి ప్రభుత్వం రావడంతో అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్(ఏజీసీ) నిర్మించబోయే ప్రాంతం మొత్తాన్ని నోటిఫై చేసింది.

**ఎన్నికల హామీ అమలు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 65 లక్షల మందికి పైగా సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు వెయ్యి రూపాయలు పెంచి అందిం చింది. తాము అధికారంలోకి వస్తే ఇప్పుడిస్తున్న రూ. 3వేల పెన్షన్‌ను రూ. 4వేలకు పెంచుతామని.. దివ్యాంగుల పెన్షన్ రూ. 6వేలకు పెంచుతామని కూటమి ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ప్రచారం ప్రారంభించిన మార్చి నెల నుంచి జూలై వరకు మూడు నెలల కాలాన్ని కూడా పరిగణించి అదనంగా నెలకు రూ. వెయ్యి చొప్పున మూడు నెలల బకాయి రూ3 వేలు కలిపి మొత్తం రూ. 7 వేలు అబ్ధిదారులకు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. వివిధ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటు న్నారు. ప్రభుత్వం సామాజిక పెన్షన్ల కోసం ఈ నెల రూ. 4,400 కోట్లు వెచ్చించింది.



వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




30

# "రావణుడి మొండి వైఖరి" ఒక నియంత అంతం

ఆంజనేయుడు లంకాదహనం చేసి వెళ్లాక, రావణుడు కొద్దిగా కలవరపడతాడు తాత్కాలికంగా. కానీ, అతడి కళ్లకు పొరలు కమ్మిన "కామం" సీతాదేవి పెట్టిన సంవత్సర కాలంగడువు, తాను సీతకిచ్చిన "మాసం" గడువు ఏ ఆపద లేకుండా గడిచి పోతాయనీ, ఆ తర్వాత సీత తనంత తానుగ తనని వరిస్తుందనీ ఆశలో పడవేస్తుంది. "ఒక కోతి వచ్చింది. ఏదో అల్లరి చేసిపోయింది. మావంటి యోధానుయోధులుండగా ఈ లంకానగరానికిగానీ, నీకు గానీ భయమేమీ లేదు!" అని ఇచ్చకాలు పలికే కొందరు మూర్ఖులైన మంత్రులు, బంధువులు, ఆశ్రితులూ ఉండగా కామమే ప్రధాన లక్షణంగా, లక్ష్యంగా కలిగిన రావణుడు తనకు మృత్యువు త్వరలో రాబోతోందని తెలుసుకోలేక నిశ్చింతగా ఉంటాడు. వానర సైన్యంతో శ్రీరాముడు సముద్రపు ఆవలిగట్టున విడిది చేసినపుడు, విభీషణుడు రాముని శరణు వేడినపుడుగానీ, ఆ మూర్ఖపు నియంతకు పరిస్థితి పీకల మీదకు వస్తోందని అర్థంగాదు.

'శుకుడు' అనే గూఢచారిని పంపగా, వానరవీరుల చేతులలో ప్రాణావశిష్ఠుడై తిరిగివచ్చి రామపరాక్రమం, వానరుల పరాక్రమం గురించి రావణుడికి చెబు తాడు. మరల సేతువు బంధించి రాముడు లంకాద్వీపం వెలవల సైన్యాన్ని మోహరించగా, 'శుకసారణులు' అనే గూఢచారులను పంపుతాడు. వారూ వానరుల చేతిలో చావుదెబ్బలు తినివచ్చి రావణుడికి రామ పరాక్రమమూ, వానరవీరుల బలమూ చెప్పి, భయంతో గజగజవణకిపోతారు. రావణుడు కపటోపాయంతో సీతాదేవిని తన పట్ల ఆకర్షితురాలిని చేసుకోవాలనే తలంపుతో 'విద్యుజ్జిహ్వుడు' అనే రాక్షసుడితో రాముని శిరస్సును పోలిన శిరస్సు, ధనస్సు చేయించి, అశోకవనంలో సీతాదేవి వద్దకు నెత్తు రోడుతున్న శిరస్సు, ధనస్సు తెచ్చి, రాముడు లంకా నగరపు పొలిమేరలు ప్రవేశించటంతోనే హతు దయ్యాడని అబద్ధాలు చెబుతాడు. ఆమె దుఃఖిస్తూ ఉండగా, అత్యవసరంగా అమాత్యులు తనని సభకు ఆహ్వానిస్తున్నారని తెలుసుకొని వెళ్లిపోతాడు. శిరస్సు, ధనస్సు మాయమైపోతాయి. సీత నిజం తెలుసు కుంటుంది.

ఆ సభలో కుంభకర్ణుడు హితవు చెబుతాడు. రావణుడి తల్లీ, 'అవిద్ధుడు' అనే వయోవృద్ధ, జ్ఞాన వృద్ధ అయిన మంత్రి శతవిధాలా, రామునితో యుద్ధం పద్దనీ, ఖరదూషణాది పద్నాలుగు వేల మంది యోధానుయోధులైన రాక్షసులను ఒకటిన్నర ముహూర్తంలో వధించిన రాముని పరాక్రమాన్ని తక్కువగా అంచనావేయవద్దని, సముద్ర లంఘనంతో లంకాదహనం చేసిన హనుమంతుడు సాధారణ కోతి కాదనీ, సీతను సగౌరవంగా రామునికిచ్చి, అతనితో సంధి చేసుకోవటం శ్రేయస్కరమనీ చెబుతాడు. కానీ రావణుడి మూర్ఖత్వం, అహంకారం, అన్నిటినీ మించిన "కామం" ఆ హితవులు విననీయవు.

ఇక రణరంగంలో మూడుమార్లు రామునిచేత పరాజితుడౌతాడు రావణుడు. "ఇతడు సాక్షాత్తూ విష్ణువా! నన్ను వధించటానికిలా మానుష రూపం ధరించాడా? ఆహో! ఏంబలం? ఏం శౌర్యం?" అని ఆలోచనలో పడతాడు. కానీ ఆ ఆలోచన తాత్కాలికం! సీతమీద గల కామం, ఆ జ్ఞానలేశాన్ని చీకటిలో ఆవరించేస్తుంది.

యుద్ధరంగంలో వరుసగా సోదరులు, కొడుకులు, యోధానుయోధులు మరణిస్తున్నారన్న వార్తలే తప్ప, జయం సాధిస్తున్నారన్న వార్తలే లేవు. కలతపడిపోతాడు. వ్యాకులపడతాడు. అయినా మొండి వైఖరి వదలడు. మహోదరుడు చనిపోయాక, కుంభకర్ణుడు చనిపోతాడు. అప్పుడు దిగులుతో, "విభీషణుడి మాట విన్నాను కాను! కుంభకర్ణుని మాట విన్నాను కాను!" అనుకుని ఏడుస్తాడు. ఆ ఏడుపూ తాత్కాలికమే! మరల తన ప్రియపుత్రుడు ఇంద్రజిత్తుని పిలిపించి, యుద్ధరంగంలోకి శలభంలా తరుముతాడు.

**పవని నిర్మల ప్రభావతి**
**జాగృతి 15.09.1986 సంచిక నుంచి**

ఆధ్యాత్మికం

మన రుషులు

# కరుణాత్ముడు కణ్వమహర్షి



కణ్వుడు అంటే మేధావి, పురోహితుడు అని అర్థం. కరుణామయుడు. ఆయన సోదరుడు ప్రగాథుడితో కలసి అనేక వేద మంత్రాలను దర్శించాడు. ఆయన రాసిన ధర్మశాస్త్రం 'కణ్వస్మృతి'గా ప్రసిద్ధం. గోమాతను స్తుతించే మంత్రాలూ అందులో ఉన్నాయి. అమృతానికి మూలమైన గోవును హింసించరాదంటూ గోమహిమను తెలియచేస్తాయి. ఆయనను మునికుల 'చూడామణి'(మునులలో గొప్పవాడు) అంటారు.

స్తోత్ర పఠనం ద్వారా దేవతలను యజ్ఞ యాగాదులకు ఆహ్వానించడం ఆయన విధి అని సాయన భాష్యం పేర్కొంటోంది. హరిద్వార్ సమీపంలోని మాలినీ నదీ తీరంలో కణ్వాశ్రమంలో నిత్యం వేదఘోష వినిపించేది. అగ్నిహోత్రాలు వెలుగుతూ ఉండేవి. తపస్సంపన్నులతో దివ్యాశ్రమంలా శాస్త్ర ప్రవచనాలు, వేదార్థ మీమాంస గోష్ఠులతో వెలుగొందేది. ఆ ప్రాంతాన్ని సందర్శించిన రాజులే కాదు.

పలువురు రుషులు ఆయనను దర్శించి, ఆశీస్సులు పొందకుండా ఉండేవారు కాదు. ఆయనతో పాటు ఆయన వంశీయులను కాణ్వాయనులు/కాణ్వులు అని వ్యవహరిస్తారు.

# కలిమి లేముల నడుమ కృష్ణ-కుచేల సంబంధం

30




చెలికాడు కుచేలుడిని ఆసనంమీద కూర్చో పెట్టిన శ్రీకృష్ణుడు,"దేవీ మన కుచేలుడు చాలా దూరం నుంచి వచ్చాడు" అని రుక్మిణిని సంబోధిస్తూ అన్నాడు. "అలసిపోయి ఉన్నాడు కాస్త వేడివేడి నీళ్లు స్నానానికి, తుడుచుకొనేందుకు మంచి ఉత్తరీయం ఒళ్లు తోముకొనేందుకు..."

కృష్ణుడు ఒక పెద్ద ఖాళీ పళ్లెం కుచేలుడి కాళ్ల కింద పెట్టాడు. రుక్మిణివైపు చూసి "నీళ్లు...." అన్నాడు రుక్మిణిదేవి దాసీచేతిలో నుండి స్వయంగా నీటి పాత్రను తీసుకొంది. ధారగా నీళ్లు కుచేలుని పాదాలపై పోసింది. కృష్ణుడు కుచేలుని పాదాలను కడిగేందుకు చేతులు జాపాడు. కుచేలుడు వెంటనే పాదాలను పైకి తీసుకున్నాడు. "కృష్ణా!"

"అతిథేయ ధర్మాన్ని కూడా నిర్వహించనీయవా? యుధిష్ఠిరుని రాజసూయ యజ్ఞంలో కూడా అతిథుల కాళ్లు కడిగే బాధ్యతను నిర్వహించాను నేను తెలుసా?" కృష్ణుడు చిరునవ్వుతో "మీరంతా వెళ్లండి" అని దాసీ జనులను పంపివేశాడు.

కుచేలుడు ఇక కాదని ఎలా అనగలడు? సంకోచిస్తూ అలాగే కూర్చున్నాడు. కాళ్లు, ముఖము, చేతులు కడుక్కోవటం అయింది. "బడలిక కాస్త తగ్గిందనుకొంటా" అని అన్నాడు కృష్ణుడు. "స్నానం చేస్తేగాని..." కుచేలుడు అన్నాడు.

"స్నానం కూడా చేద్దువుగాని," కృష్ణుడు లేచాడు. వాడు నీ సామానులు యింకా తేనేలేదు."

"సామానులు పక్కగదిలో పెట్టించాను" రుక్మిణీ దేవి చెప్పింది.

"ఇక్కడికి తెప్పించు దేవి, ఇక్కడికి..." కృష్ణుడే స్వయంగా వెళ్లి పక్క గదిలో నుంచి కుచేలుడి చేతికర్ర, రాగిచెంబు, చిన్నమూట వగైరాలు తీసుకొని వచ్చాడు. "ఇవ్వు, నాకివ్వు అని, నీవు..." కుచేలుడు చేతులు జాపాడు.

"ఇస్తానయ్యా" కృష్ణుడు చిరునవ్వుతో ఆ వస్తువులు చేత్తో పైకి ఎత్తి పట్టుకొన్నాడు. అందకుండా. "ఎందుకంత కంగారు? నీ వస్తువులు ఎవరూ ఎత్తుకుపోరు లేవయ్యా"

కృష్ణుడు ఒక్కొక్క వస్తువునే కుచేలుడికి ఇస్తున్నాడు. "ఇదిగో, ఇది చేతికర్ర, ఇదిగో రాగి చెంబు, ఇవి ఇప్పుడు నీకెందుకు? ఇవిగో గుడ్డలు. ఇవి కూడా స్నానం చేసిన తరువాతనే అవసరం. ఇకపోతే ఇదిగో, ఇది ఏమిటి, ఈ మూట?"

కుచేలుడు చూశాడు. అటుకుల మూట అది. తన భార్య కట్టి ఇచ్చింది కృష్ణుని కోసం. కాని ఇక్కడి ఈ రాజభోగాల నడుమ ఈ ముక్కిన అటుకులతో ఏం పని? ఆ మూటను తీసుకొని గుట్టుగా గుడ్డలమూటలో దాచిపెడదామని కుచేలుని కోరిక. "ఏమీ లేదు. ఏమీ లేదు. ఇటుతే," కుచేలుడు పొట్లాన్ని పట్టుకుందామని చూశాడు.

కృష్ణుడు కళ్లు తిప్పుతూ, "వహ్వా మిత్రమా! నా దగ్గరే దాపరికమా? వదిన గారు పంపిన కానుక నాకు తెలుసు! ఇయ్యవేం మరి?" అంటూనే కృష్ణుడు మూటను విప్పాడు. అటుకుల్ని చూసి ఆనందంతో "అటుకులు పంపించింది మా వదినగారు" అన్నాడు.

కృష్ణుడు గుప్పిట నిండా అటుకులు తీసుకొని, నోట్లో పోసుకొని తినసాగాడు "ఇలాగే నోట్లో వెన్న కుక్కుకొని తినేవాడివి నీవు" అని కుచేలుడు నవ్వాడు.

"ఇలాగేనా" అటుకులు నోటి నిండా ఉండగా కష్టం మీద కృష్ణుడు అన్నాడు. రెండవ గుప్పెడు కూడా తీసుకొని నోట్లో పోసుకున్నాడు.

రుక్మిణిదేవి వయ్యారంగా ముందుకు వచ్చి కృష్ణుని చేతిని పట్టుకుంది. మూటను లాక్కుంది. "బాగుంది వరుస! ఇంత స్వార్థమా? మా అక్కగారు అంతా నీ కోసమే పంపిందా?'' "ఏమండీ బావగారూ?" కుచేలుడికి ఒళ్లు జలదరించింది. రుక్మిణి వైపు చూడలేకపోయాడు కూడా.

''ఏమిలేదు, అటుకులమ్మా'' కుచేలుడు చెప్పకుండా ఉండలేకపోయినాడు. మీకు అవి బాగుండవేమో"

"ఎందుకు బాగుండవు?" రుక్మిణి అన్నది. "ఈ కృష్ణస్వామి వారి నాటకాన్ని చూసి వారికొక్కరకే ఆప్యాయత తెలుసు అని అనుకుంటారు అంతా. నాకు ఈ మాయలు, మర్మాలూ తెలియవు. ప్రేమతో పంపిన కానుక విలువ ఏమిటో నాకూ తెలుసు." పొట్లం చేత బుచ్చుకొని రుక్మిణి వెళ్లడానికి వెనక్కి తిరిగింది. "నేను తక్కిన చెల్లెళ్లకు కూడా ఇవి పంచి పెట్టి తింటాను"

–వైశంపాయన

'జాగృతి' 18–09–1982 సంచిక నుంచి

---

ఆయన వంశంలో అనేకులు రుషులుగా ప్రసిద్ధులు.

ఈ రుషి ప్రస్తావన మహాభారతంలో ప్రముఖంగా కనిపిస్తుంది. మేనక, విశ్వామిత్రులు తమకు జన్మించిన శిశువును అడవిలో మాలినీ నదీతీరంలో వదలి వెళ్లగా అక్కడి పక్షులు ఆమెను సాకాయి. అది చూసిన కణ్వుడు ఆమెను అక్కున చేర్చుకున్నాడు. అదే సమయంలో 'మేనకా విశ్వామిత్రుల ఈ తనయను పెంచు. ఆమెకు కలిగే కుమారుడు గొప్ప చక్రవర్తి అవుతాడు' అని అశరీరవాణి పలికిందట. ఆయన చిన్నారికి 'శకుంతల' అని పేరుపెట్టి పాలక తండ్రిగా వ్యవహరించారు. శకుంతల యుక్తవయస్కు రాలైంది. ఒకనాడు కణ్వుడు ఆశ్రమంలో లేని సమయంలో వచ్చిన దుష్యంత మహారాజు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకున్నాడు. జరిగిన దానిని దివ్యదృష్టితో వీక్షించిన ఆయన ఆమెకు ధైర్యం చెప్పాడు. ఆమెకు భరతుడనే బాలుడు కలిగాడు. కాలం గడిచినా దుష్యంతుని జాడలేక పోవడంతో, వివాహితలు ఎక్కువ కాలం పుట్టినింట ఉండడం తగదని భావించిన కణ్వుడు, శిష్యులతో శకుంతలను దుష్యంతుని వద్దకు సాగనంపాడు. ఆ సందర్భంలో ఆయన చేసిన హితబోధ జగత్ప్రసిద్ధం.

మహాభారతంలో శకుంతలోపాఖ్యానంలో ఈ విషయాలు వివరంగా కనిపిస్తాయి. నేటి తల్లిదండ్రులు తమ కుమార్తెలను అత్తవారింటికి పంపేటప్పుడు చెప్పే హితువుకు ఆయన మాటలే స్ఫూర్తి అనడంలో సందేహంలేదు.


–రామచంద్ర రామానుజ

---

## వివేకానంద సూక్తిశతి

When the man is under the control of his sences, he is of the world. When he has controlled the senses, the world is of him.

ఇంద్రియములపైన ఇలను జయమునొంద
అమితమైన శక్తి ఆశ్రయించు
ఇతరులెవరు నీకు ఇల సాటిరారయా
వినుడి స్వామి సద్వివేక వాణి॥





బండిరాజుల శంకర్




అమెరికాలోని అత్యంత ఖరీదైన ఆసుపత్రిలో శాస్త్రవేత్త డాక్టర్ వ్యాస్‌కు అన్ని రకాల పరీక్షలు జరుగుతున్నాయి. అతడు ఏసీ గదిలో అత్యంత ఖరీదైన 'సూట్' లో మంచం మీద పడుకుని ఉన్నాడు. అది తొలిసారి. అతడు తన పనులు మానుకుని మంచం మీద పడుకుని ఉండటం. అతనికి కొన్ని హార్మోన్ ఇంజక్షన్లనిచ్చి మాత్రలు ఇచ్చారు.



వాటి పని తీరు చదివి నవ్వుకున్నాడు వ్యాస్.

కోరికలు పెరిగి అత్యంత సహజంగా సహధర్మచారిణితో సుఖించే విషయమది. నిజానికి తనలో ఎలాంటి లోపం లేదు. ఆ విషయం తనకు తెలుసు! కానీ, ఇప్పుడు ప్రపంచ ప్రభుత్వమైన యు.ఎన్.ఓ. చేతుల్లోకి తన జీవితం వెళ్లిపోయింది. భారత ప్రభుత్వ అనుమతితో ప్రపంచ దేశాల కోసం తనీ ట్రీట్‌మెంట్‌కు ఒప్పుకున్నాడు.

వరుసగా వారం రోజులు తను 'స్పెర్మ్ డొనేట్' చేశాడు. అందుకే ఈ చికిత్స ముందు తన వయసు, శరీరధారుఢ్యం, మెంటల్ కండిషన్, స్పెర్ములో శుక్రకణాల శాతం, వాటి పని తీరు లాంటివి పరిశీలించటానికే ఈ తతంగం.

అన్నీ అనుకూలంగా ఉన్నాయి.

అతనికీ విషయం చెప్పి సెమన్ తీసి ఉంచమని, వెంటనే తనకు ఇన్ఫాం చేయమని చెప్పి వెళ్లాడు మేల్‌నర్స్.

అక్కడికి ఏడుసార్లు అయిపోయింది.

ఈ రోజు చివరి రోజు. దాన్ని ఎక్కడ, ఏ ప్రభుత్వం రిజర్వు చేస్తుందో, దాన్ని ఎవరికి ఉపయోగిస్తారో ఏ విషయం తెలియదతనికి.


కానీ అతడితో చేసుకున్న ఒప్పందం ప్రకారం మొదటి డొనేషన్ భారత ప్రభుత్వానికే పంపిస్తారు. మిగిలింది ప్రపంచ ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రపంచ దేశాల కోసం యు.ఎన్.ఓ తన మెడికల్ కౌన్సిల్ ద్వారా భద్రపరిచి అవసరమైన వారికి ఇస్తుంది.

నవ్వుదున్నాడు వ్యాస్.

"నిజానికి నా వ్యక్తిత్వాన్ని, ఆదర్శాలను, పని విధానాల్ని ప్రక్కకుపెట్టి, నా స్వంత జీవితంలోకి వెళ్లిపోతే సంసారిక జీవితంతో రోజువారి కార్యక్రమం ఇది" అనుకుంటున్నాడు.

* * *

ఉషా, అనిరుద్ డాక్టర్ వరదను కలిశారు. ఆమె విశ్రాంతిగానే ఉండటంతో వెంటనే



**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

కలిసింది. కూర్చున్నాక మంచినీళ్లు, టీ ఆఫర్ చేసింది. "మిసెస్ ఉషా! మీకు ఎగ్ డొనేట్ చేసేవాళ్లు దొరికారు. ఇక మీ భర్త అనిరుద్ సమయమిస్తే ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు" చెప్పింది వరద.

"అందుకు మేమూ సిద్ధమే! అనిరుద్ ఉనికితోనే నేను అమ్మననిపించుకోవాలి. అందుకు నాకు మాతృదానం చేస్తున్న ఆ దేవతనోసారి చూడొచ్చా?" ఆసక్తిగా ప్రశ్నించింది.

"నో...అలాంటి ఆలోచన ఎప్పుడూ కుదరదు. పైగా ఆమెకు 'దేవత' అనేంత గొప్ప పేరు పెట్టనవసరంలేదు. ఆమె కేవలం డబ్బు కోసమే మీ దగ్గర లేని దాన్ని మీకిచ్చి తన అవసరం తీర్చుకుంటున్నది.

"విజ్ఞానశాస్త్రం బాగా ఎదగటంతో అది సాధ్యమవుతుందంతే!" అతి తేలికగా చెప్పింది వరద.

"ఎంత ఆర్థిక లావాదేవీలయినా, ఎవరి బిడ్డనో తన గర్భాన తొమ్మిది నెలలు మోసే ఆమె నిజంగా దేవతే!" కృతజ్ఞతగా అంది ఉష.

"నాకూ ఆమెను చూడాలనే ఉంది. నా సంతానాన్ని భరిస్తూ పూర్ణగర్భంతో తిరగబోయే ఆ స్త్రీమూర్తి రూపం ఒకసారి, ఒక్కసారే చూస్తాను" అన్నాడు అనిరుద్ ఉద్వేగంగా.

"నో... దానికెంత మాత్రం ఒప్పుకోను. ఇది ఒక కాంట్రాక్టు మాత్రమే. అయితే, మానవ సంబంధాలతో కూడుకున్నది కావటాన రహస్యంగా ఉంచటం తప్పనిసరి. మీ కోరిక సహజమే కావచ్చు. కానీ ఇక్కడ మీ సంతానాన్ని మోసేది మీ భార్య కాదు, మరో స్త్రీ. ఆమెకు పర్సనల్ లైఫ్ ఉంటుంది. ఆమె భావి జీవితం దెబ్బతినకూడదు కదా? ఆమె మీ బిడ్డను మీకిచ్చి, మీరిచ్చిన డబ్బు తీసుకుని వెళ్లిపోవటమే సహజం కదా?

"దానికిలా కలుసుకోవటం, ఆశలు పెంచుకోవటం, వాటిని నిరాశ చేసుకోవటం, అనుబంధాలు పెంచుకోవటమెందుకు?"



సంబరాజు లీల (లట్టుపల్లి)

నిర్మొహమాటంగా చెప్పింది వరద.

"నిజమే! కొంతవరకూ అది కరెక్టే! కానీ, మాతృత్వమంటే ఎన్నో ఒడిదుడుకులతో కూడుకున్నది. ప్రసవమంటే స్త్రీకి పునర్జన్మంటారు. అలాంటి కష్టాల కోర్చి ఏ తల్లయినా తన బిడ్డను తనే కన్నదంటే అది ప్రకృతి ధర్మం. వింతేమీ కాదు. కానీ మా బిడ్డను తనదిగా మోస్తూ, ప్రాణాన్ని పణంగా పెట్టి మోయబోయే ఆ స్త్రీ మూర్తి ఎవరో ఆమెకు నా నమోవాకాలు.

"డబ్బు మాట పక్కన పెడితే, ఇది ఎంత గొప్ప దాతృత్వమో, మరెంత గొప్ప త్యాగమో కదా?" అన్నాడు.

"ఒప్పుకుంటాను. కాని ఇది మన మధ్య ఒప్పందం. ఆమె లాంటి తల్లులను పర్సనల్‌గా కలవకూడదని 'మెడికల్ కౌన్సిల్' చట్టం చేసింది. అందుకు మీరంగీకరించే అగ్రిమెంట్ పేపర్స్‌పై సంతకాలు చేశారుగా" వివరించింది డాక్టర్ వరద.

ఎంత తీవ్రంగా చెప్పినా ఆమె గొంతు సౌమ్యతనే తప్ప నిప్పులు కురిపించదు.

"రేపు మేము వస్తాం. ఉష అవసరం లేదు కదా?" అడిగాడు.

"అవసరంలేదు. మీరు వస్తే చాలు. లేదా ఇంటి నుంచి కూడా సెమన్ తేవచ్చు. కాని అది నిర్వీర్యం కాకుండా మైనస్ డిగ్రీల్లో నిలువచేయాల్సి ఉంటుంది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత మన దగ్గర ఉండదు కాబట్టి మీరిక్కడి రావాలి. మధ్యాహ్నం వచ్చేయండి. నేనప్పుడు ఫ్రీగా ఉంటాను" చెప్పింది.

ఉషా, అనిరుద్ నమస్కారం పెట్టి లేచారు.

* * *

కుంతలా, దుష్యంత్‌ల అనుమతితో గీరా వారికి 'అండం' దానం చేసింది. గీరా అండం, దుష్యంత్ శుక్రకణంతో లాబరేటరీలో ఫలదీకరణ జరిపింది. ప్రస్తుతం ఆ అండంలో సెల్స్ డివిజన్ జరుగుతున్నట్లుగా మార్పులు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం దాని వయసు మూడురోజులు.

అయినా డాక్టర్‌కు, కుంతలకు అనుమానమే! అది అబ్బాయేనా అని. డాక్టర్‌కు హండ్రెడ్

పర్సెంట్ తెలుసు! అది అబ్బాయి రూపేనని! కారణం తను ఎక్స్, వై క్రోమోజోములతోనే ఫలదీకరణ జరిపింది. అది ఎంత విజయమౌతుందనేది సందేహమే!

మరోసారి మార్పుల్ని గమనించింది. ఏదో తేడా….! హమ్మయ్యా! అబ్బాయే అనుకుంది. అయినా అనుమానంతో మరో రెండు వేరు వేరు అండాలతో పరీక్షించింది.

ప్రతి క్షణం వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నది. నిజానికి అది చెప్పినంత తేలిక కాదు. అవి జన్యుపరమైన చిక్కులతో ఉంటాయి. వాటి నుంచి ఎన్నో సమస్యలుంటాయి.

ఒక్కోసారి శిశువు చనిపోవచ్చు కూడ. అలాంటి సమయంలో డాక్టర్ వరద ఒక మనిషిగా క్షణంసేపు బాధపడుతుంది. అయితే అది ఎంతోసేపు ఉండదు. వెంటనే దాన్ని మనసులోంచి తీసేస్తుంది.

తనెవరు? ఒక డాక్టర్! అవసరమయిన వారికి, అన్ని రోగాలకు మందులిచ్చినట్లు ఇలాంటి సమస్యలూ తీర్చాలి. తనీ రంగాన్ని ఎంచుకుంది. ఈ మార్గంలోనూ ఎన్నో ఒడిదుడుకులు, ఆటంకాల్ని ఎదుర్కోవాలి.

తన ప్రయోగం విజయవంతమయినప్పుడు ఆ శిశువును చేతుల్లోకి తీసుకున్నా ఆ తల్లి కళ్లలోని ఆనందాన్ని తను చూస్తూ, దాన్ని తనూ పంచుకుంటుంది.

మరి అలాంటి సమయంలో ఆనందించినట్లుగానే ఇలాంటి సమయాల్లో తను డాక్టర్‌గా కాక ఒక మనిషిగా దుఃఖపడుతుంది. అయితే తనా దుఃఖపు వలయం దాటి మరో విజయసూచిక కోసం పరిగెత్తాలి. జయాన్ని సాధించాలి.

**డాక్టర్ వరద, గీరా నుంచిన స్ట్రేచర్‌ను లాబరేటరీలోకి తెచ్చింది. వెనక ఒక సిస్టర్, డాక్టర్ అసిస్టు చెయ్యటానికొచ్చారు. అయితే అందులో గీరా నిజమైన తల్లా, సరోగేటా? ఆ జీవకణం ఏ పురుషుడిదో, అండం ఎవరిది? అన్న విషయాలు ఒక్క డాక్టర్ వరదకు తప్ప ఎవరికి తెలియవు.**

అప్పుడే తను డాక్టర్‌గా నిలబడుతుంది అనుకుంది. లాబరేటరీలోని శిశువును పరిశీలిస్తూ అతి చిన్న ఆ పసిప్రాణం, ఒక చిన్న గాలి తెరలా, వెంట్రుక కదిలినట్లుగా కృత్రిమంగా తయారైన ఉమ్మనీటిలో ఉనికిని తెలుపుకుంటున్నాయి.

ఇంక కొద్దిరోజుల్లో గీరా గర్భంలో ప్రవేశపెట్టాలి. మగ శిశువు కాబట్టి కుంతల గర్భంలోనే ప్రవేశపెట్టొచ్చు– కానీ కృత్రిమంగా, బలవంతంగా జరిపిన గర్భస్రావాలతోఉన్న కుంతల గర్భాశయం మూడు విభిన్నమైన జన్యుపరమైన మార్పుల్ని తట్టుకుంటుందో లేదో…? ఆ విషయం చెబితే కుంతలనే నిరాకరించింది. గీరా మరో చోట రహస్యంగా ఉన్నట్టు ఉండే గదిలో విశ్రాంతి తీసుకుంటున్నది. సరిగ్గా ఆమెకు రుతుక్రమం మొదలయిన పన్నెండు, పదమూడు రోజుల్లో మాత్రమే ఆ ప్రయోగం జరుగుతుంది.

ఆ రోజుల్లో మాత్రమే ఆమెకు పిండాన్ని ప్రవేశపెట్టాలి. లేకుంటే సహజమైన అండాశయపు పొరలు పెరుగుదల్లో మార్పు రావచ్చు.

వీలయినంతవరకూ సహజ వాతావరణమే



బిడ్డ ఎదుగుదలకు అవసరం అనుకుంటుంది. ఆ పుత్రకామేష్టి యజ్ఞంలో గీరా మాతృదానంతో అగ్నిపురుషుడిగా మారి వారికి పుత్రోదయాన్ని కలిగించటానికి గీరా చాల ధైర్యాన్ని, రిస్కును ఎదుర్కొంటుంది.

గీరా వివాహితయిన అవివాహిత.

భర్త లేదు, అమ్మ కావాలని కోరుకుంది. ఆమెకు ఆ అవకాశం లేక దీనికి ఒప్పుకుంది.

డాక్టర్ వరద, గీరా నుంచిన స్ట్రేచర్‌ను లాబరేటరీలోకి తెచ్చింది. వెనక ఒక సిస్టర్, డాక్టర్ అసిస్టు చెయ్యటానికొచ్చారు.

అయితే అందులో గీరా నిజమైన తల్లా, సరోగేటా? ఆ జీవకణం ఏ పురుషుడిదో, అండం ఎవరిది? అన్న విషయాలు ఒక్క డాక్టర్ వరదకు తప్ప ఎవరికి తెలియవు.

గీరా మంచి నిద్రలో ఉంది. ఆ నిద్రలోనే తన పని పూర్తి చేసింది వరద. ఆమె కళ్లు తెరిచేసరికి, ఆమె గదిలోనే ఉంది.

* * *

గీరా నీరసంగా పడుకుని ఉంది. ఆమెకు గర్భం నిలిచి ఎనిమిది వారాలయింది. నాలుకకు 'రుచి' తగ్గింది. ముఖ్యంగా అన్నీ తినాలని ఉంది. కానీ, ఏమీ తినలేకపోతున్నది.

డాక్టర్ వరద అక్కడికి వచ్చింది.


"హలో హౌ ఆర్‌యూ!" అంటూ పలకరిస్తూ, స్కానింగ్ మానీటర్ రెడీ చేయమంది సిస్టర్‌ని.

"ఫైన్! కానీ, ఎలాగో ఉంది. ఏమి తినలేకపోతున్నాను. ఆకలిగా ఉంటుంది. తింటే కాస్త 'వాంతి' లా అనిపిస్తుంది" చెప్పింది.

"గుడ్ జీవరసాయనాల మార్పులు సూచిస్తున్నాయి. దటీజ్ గుడ్. నీకేం తినాలనిపిస్తే అదే తిను. ఎలాంటి అభ్యంతరాలు లేవు. నేనీలోపల ఫైవ్ మినిట్స్ రిలాక్స్ అవుతాను" అంటు ఇంకో బెడ్‌రూమ్‌లోకి వెళ్లింది వరద. మెత్తటి పరుపు… అలసిన శరీరం అయినా విశ్రాంతి తీసుకుంటున్నా గీరా గురించే ఆలోచిస్తున్నది.

గీరాతో మొదటి అగ్రిమెంట్ గుర్తొచ్చింది.

(సశేషం)



డి. అరుణ

పత్రికా స్వేచ్ఛ గురించి, జర్నలిస్టుల భద్రత గురించి ప్రపంచ దేశాలకు ఉపన్యాసాలు ఇవ్వడమే కాదు, పత్రికా స్వేచ్ఛ సూచీని, ర్యాంకింగ్‌లను ఇచ్చి కించ పరిచే అమెరికా, వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అస్సాంజే విషయంలో మాత్రం అవేవీ తనకు వర్తించవన్నట్టుగా ప్రవర్తించడం దాని కాపట్యం తెలిసిన వారెవరినీ ఆశ్చర్యపరచదు. అహంకారంతో విర్రవీగిపోతున్న అమెరికాకు ఎంత పెద్ద గుమ్మడికాయ అయినా కత్తిపీటకు లోకువే అన్న విషయాన్ని ఈ శతాబ్దపు తొలి దశకంలో రుజువు చేస్తూ 'వికీలీక్స్' పేరుతో అమెరికా రహస్య రక్షణ పత్రాలను, ఇరాక్, అఫ్ఘాన్ యుద్ధంలో వారి అత్యాచారాలను వెలుగులోకి తెచ్చిన వ్యక్తి జూలియన్ అస్సాంజే. నాటినుంచే అతడిని పట్టుకొని, శిక్షించేందుకు వేట మొదలైనా, అతడు లొంగకపోవడం, జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తల ఒత్తిడితో పాటుగా గత కొద్ది కాలంలో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథొనీ ఆల్బనీస్ జోక్యం చేసుకొన్న కారణంగా అంతిమంగా రాజీకి వచ్చి అతడిని వదిలివేసేందుకు అమెరికా అంగీకరించడంతో అతడు యుకె జైలు నుంచి స్వదేశం చేరుకున్నాడు.



# అమెరికా అసలు రంగు బయటపెట్టిన అస్సాంజేకు స్వేచ్ఛ

అస్సాంజేను ఇక విడుదల చేయాలని ఆస్ట్రేలియా పార్లమెంటు సభ్యులందరూ పార్టీల కతీతంగా డిమాండ్ చేయడంతో పాటుగా అమెరికా లోని ఎంపీలతో లాబీయింగ్ చేయడంతో అస్సాంజేకు పెద్ద శిక్ష వేయకపోయినా, కనీసం అతడు తన తప్పు ఒక్కటైనా ఒప్పుకోవాలనే షరతు అమెరికా పెట్టింది. తమ దేశ పౌరుడు కాకపోయినా, తమ దేశ రహస్యాలను బయటపెట్టినందుకు అస్సాంజేపై అమెరికాకు కక్ష ఉండడం సహజమే అయినప్పటికీ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ సహా అన్ని రకాల స్వేచ్ఛలలో ఉదారవాదులమని చెప్పుకునే అమెరికా, తన విషయానికి వచ్చేసరికి నీతులన్నీ ఎదుటివారికి చెప్పేందుకే కానీ తమకు కాదు అన్నట్టు వ్యవహరించింది. అస్సాంజే జైల్లో ఉన్నప్పటికీ వికీలీక్స్ క్రియాశీలకంగానే ఉంది.

**వికీలీక్స్**

'వికీలీక్స్' పేరు విననివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కానీ, అదేం హఠాత్తుగా పుట్టింది కాదు. ఆస్ట్రేలియాకు చెందిన అస్సాంజేకు చిన్న వయసులోనే హ్యాకింగ్ విద్య అబ్బడం, తనకు కంప్యూటింగ్ చేయడంలోగల సహజ ఆసక్తిని గుర్తించడంతో సరిపెట్టుకోకుండా, పెంటగాన్, నాసాలలో సురక్షిత వ్యవస్థలను కూడా తెరవడం వంటివి చేసేవాడు. 'మెండాక్స్' అన్న హ్యాకింగ్ అలియాస్‌తో అతడు చేస్తున్న కార్యకలాపాలతో అధికారులు అప్రమత్తమై, అతడిపై అప్పుడే నిఘావేశారు. 1991లోనే, అంటే సరిగ్గా ఇరవై ఏళ్ల వయస్సులోనే ఆస్ట్రేలియా అధికారులు 31 ఆరోపణలతో అతడిపై సైబర్ క్రైమ్‌కు సంబంధించిన కేసు పెట్టినప్పటికీ, అతడు అనేక ఆరోపణలలో తన తప్పును ఒప్పుకోవడంతో చిన్న జరిమానాతో బయట పడ్డాడు. కానీ సత్యాన్ని వెలికితీయాలన్న తపనను నియంత్రించుకోలేక మరొక దశాబ్దన్నర తర్వాత అంటే 2006లో విజిల్ బ్లోయర్ వెబ్‌సైట్‌గా వికీలీక్స్‌ను ప్రారంభించాడు. కొంతకాలం గ్వాంటెనామో బే జైలుకు సంబంధించిన అమెరికా మిలటరీ ఆపరేషన్ మాన్యువల్ నుంచి, చర్చ్ ఆఫ్ సైంటాలజీ (మానవాతీత శక్తులపై పరిశోధన చేసే సంస్థ) అంతర్గత పత్రాలవరకు రహస్యంగా ప్రచురిస్తూ వచ్చాడు. వికీలీక్స్ ప్రారంభించిన రెండు మూడేళ్లకే అమెరికా రక్షణ విభాగం, విదేశాంగ విభాగానికి సంబంధించిన రహస్య పత్రాలను గుట్టలుగుట్టలుగా అస్సాంజే బయటపెట్టడంతో నాటి ప్రపంచ పెద్దన్న అమెరికా ఉలిక్కిపడింది.

**గ్వాంటెనామో ఫైల్స్**

అయితే, 2010 నుంచి వికీలీక్స్ సాగించిన సమాచార విస్ఫోటనంతో అమెరికా పునాదులు కదిలిపోయాయి. ఇందులో 2007–2011 కాలానికి సంబంధించి 'గ్వాంటెనామో ఫైల్స్' పేరిట వెలుగులోకి వచ్చిన సమాచారం అక్కడ జరుగుతున్న అత్యాచారాలను బయటపెట్టింది. జెనీవా కన్వెన్షన్లను ఉల్లం ఘిస్తూ గ్వాంటెనామోబే జైలులో దాదాపు 800మందికి పైగా 14 ఏళ్లలోపు పిల్లల నుంచి 89 ఏళ్ల వృద్ధులపై జరిగిన అత్యాచారాలను వెల్లడించింది. చిత్రహింసలు పెట్టి మరీ సమాచారాన్ని సేకరించడంలో నైపుణ్యం సాధించిన చైనా, ఉజ్బెకిస్తాన్, లిబియా సహా పలు ప్రాంతాలకు చెందిన వారిని అక్కడ జైలులో ఉన్నవారిని ప్రశ్నించేందుకు ఆహ్వానించేవారట! అంతేకాదు, తీవ్రవాదులు తమ దాడులలో ఉపయోగించారని చెప్పే 1980ల నాటి కాసియో వాచ్‌ను కలిగి ఉన్నారన్న సాకుతో అనేకమంది అమాయకులను అమెరికా అరెస్టు చేసింది. హింసను తట్టుకోలేక నిర్బంధంలో ఉన్నవారు ఇచ్చే సమాచారంపై అమెరికా అతిగా ఆధారపడేదని, నిరాహార దీక్ష చేస్తే దానిని స్వచ్ఛందంగా పూర్తి ఉపవాసమని, ఆత్మహత్యా

యత్నాన్ని స్వీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నారని అభివర్ణించే పరిభాషను వాడాలనే నిబంధన ఉందనే విషయాలు విన్నవారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

**ఇరాక్, అఫ్ఘాన్ యుద్ధ సత్యాలు**

ఇక ప్రపంచాన్ని 2007 నుంచి 2011వరకు కుదిపేసిన సమాచారం మాత్రం ఇరాక్ యుద్ధ వివరణలే. వికీలీక్స్ 2010లో, అక్టోబర్ 22న ఇరాక్‌పై జరుగుతున్న యుద్ధానికి సంబంధించిన అనేక సత్యాలను బహిర్గతం చేస్తూ దాదాపు నాలుగు లక్షల యుఎస్ సైనిక పత్రాలను బయటపెట్టింది. ముఖ్యంగా, అక్కడ మరణించిన 109,000మందిలో 66,081మంది సాధారణ పౌరులే ఉన్నారు. సాధారణ పౌరులపై అనుమానం వచ్చినప్పుడు వారిని హింసించేందుకు కాంట్రాక్టర్లను ఎలా నియమించుకుందో బయటపెట్టింది.

ఇరాక్ పోలీసులు పౌరులపై హింస, అత్యాచారం, హత్యలకు పాల్పడు తుంటే మిత్రదేశాల సైన్యాలు వాటిని చూసీ చూడనట్టు వదిలేయడాన్ని మించి నేరం ఉండదు కదా? ఈ పత్రాలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఇరాక్ నుంచి అమెరికా తన సైనిక దళాలను వెనక్కి పిలిపించుకోవలసి వచ్చింది. ముఖ్యంగా 2007లో బాగ్దాద్ శివారు ప్రాంతంలో ఇద్దరు రాయిటర్స్ జర్నలిస్టులతో సహ లెక్కలేనంతమంది పౌరులపై అమెరికా మిలటరీ నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరుపు తున్న వీడియో అమెరికాను కూడా కుదిపివేసింది.

ఇక అఫ్ఘాన్‌లో జరుగుతున్న యుద్ధపు గుట్టును కూడా వికీలీక్స్ బయటపెట్టింది. అఫ్ఘానిస్తాన్–అమెరికా యుద్ధానికి సంబంధించి యుఎస్ సైన్యపు అంతర్గత నివేదికలు మొత్తం 91,000ని బయటపెట్టింది. అందులో వెలుగులోకి వచ్చిన విషయాలలో మరణించిన అమాయక పౌరుల సంఖ్యను తక్కువచేసి చూపడంతో పాటు, యుఎస్ కాంట్రాక్టర్లు అఫ్ఘానిస్తాన్‌లో వేశ్యవృత్తిలో ఉన్న మగపిల్లలను రహస్య కార్యకలాపాలకు ఎలా ఉపయోగించుకున్నారో ఉన్నాయి. అమెరికా ఎంత కృషి చేసినా తాలిబాన్ల బలం పెరిగిపోతోందన్న వాస్తవాన్ని వికీలీక్స్ పత్రాలు ధృవీకరించాయి.

**కేబుల్‌గేట్**

అమెరికాలోనూ, ప్రపంచ దేశాలలోనూ భూకంపాన్ని సృష్టించినది మాత్రం 'డిప్లొమాటిక్ కేబుల్స్' పేరుతో 1979 నుంచి మొదలై 2010 దాటేవరకూ విడుదలైన 250,000 పత్రాలు బయటపెట్టిన సమాచారం. ఇప్పటికీ, స్నోడెన్ వంటివారు కొంత సమాచారాన్ని బయటపెడుతున్నారు. వీటి ద్వారా, విదేశీ ప్రభుత్వాల వ్యవహారాల్లోనూ, ప్రపంచ సంస్థల్లోనూ అమెరికా జోక్యం వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా నాటి విదేశాంగ మంత్రిగా ఉన్న హిల్లరీ క్లింటన్ మిత్ర దేశాలు, ఐక్యరాజ్య సమితిపై గూఢచర్యం చేయవలసిందిగా జారీచేసిన రహస్య ఉత్తర్వులు, ఐక్యరాజ్యసమితి నిర్ణయాలను, చర్యలను ప్రభావితం చేయడంలో భాగంగా అక్కడి అధికారులపై గూఢచర్యం, టునీసియా, ఈజిప్టు, యెమెన్, సౌదీ అరేబియా, పాకిస్తాన్‌లలో నాటి నియంతలకు మద్దతు ఇచ్చిందనే విషయాలు ప్రపంచానికి తెలిశాయి. ఇందులో భాగంగానే, ఈ ప్రభుత్వాలకు ఆర్థిక, సైనిక సహాయాన్ని అమెరికా ఇచ్చింది. ముఖ్యంగా, 'ఐఎస్ఐఎస్‌ను సృష్టించింది సిఐఏ'నే విషయాన్ని వెలుగులోకి తెస్తూ 5000 కేబుళ్లను వికీలీక్స్ విడుదల చేసింది.

**ఇతర దేశాల ఎన్నికలలో జోక్యం యూఎస్‌కు కొత్తకాదు**

పలు దేశాలలో ఎన్నికలను యూఎస్ ఎలా ప్రభావితం చేసిందన్న విషయాలు, తన ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్న విధానాలను అనుసరించమని విదేశీ ప్రభుత్వాలపై ఒత్తిడి, అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ (ఐఎఇఎ) సహా పలు అంతర్జాతీయ సంస్థలను తన ప్రయోజనాలను సాధించుకునేందుకు ఎలా ప్రభావితం చేసిందో వికీలీక్స్ బయటపెట్టింది. 'అరబ్ స్ప్రింగ్' తిరుగుబాటు వచ్చేందుకు ఎలా చిచ్చుపెట్టిందో బయటపడిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా అమెరికా దౌత్య సంబంధాలలో సంక్షోభం ఏర్పడింది.

**బోనులో సిఐఎను ..**

అనంతరకాలంలో వికీలీక్స్ సిఐఏ వాడుతున్న హ్యాకింగ్ పరికరాలు, పద్ధతులపై సమాచారాన్ని ప్రచురించింది. దీనిద్వారా యూఎస్, ఐరోపా కంపెనీల ఆపిల్ ఐఫోన్, గూగల్ ఆండ్రాయిడ్, మైక్రోసాఫ్ట్ విండోస్ సహా అనేక ఉత్పత్తులను సిఐఏ

## భారత్

భారత ప్రభుత్వానికి చెందిన అనేకమంది అధికారులు క్రియాశీలంగా, పరోక్షంగా 1984 సిక్కుల హననానికి ప్రోత్సాహాన్నిచ్చినట్టు కేబుళ్లు బయటపెట్టాయి. ఇందుకు కేవలం అవకాశవాదం, ద్వేషమే కారణమని అందులో రాబర్ట్ ఓ బ్లేక్ పేర్కొన్నారు.

దక్షిణ భారతదేశంలో ఓటుకు నోటు సంస్కృతి గురించి, ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఆనాడే న్యూస్‌పేపర్‌లో డబ్బులు పెట్టిన కవర్లు ఉంచి మరీ పంచిన విషయాన్ని కేబుళ్లు బయటపెట్టాయి. ఈ పద్ధతి కారణంగా అనేక ఎన్నికలలో డబ్బు ఎక్కువ ఖర్చు చేసినవారి పక్షానే సానుకూల ఫలితం వచ్చిందని తెలిపాయి.

2007లో అమెరికా రాయబారులు, రాహుల్ గాంధీ రాజకీయ అనుభవం లేనివాడని, పదే పదే తప్పులు చేశాడని పేర్కొన్నారు. కాగా, క్రమంగా యుఎస్‌తో అతడి సంబంధాలు మెరుగుపడ్డాయి. 2010లో పంపిన ఒక కేబుల్ అతడు నిర్ణయాత్మకంగా స్థిరపడుతున్నట్టు వర్ణించింది.

2008 ముంబై ఉగ్రదాడుల విషయంలో కాంగ్రెస్‌పార్టీ అసలు నేరస్థులను వదిలేసి, 2009 సార్వత్రిక ఎన్నికలలో భారతీయ ముస్లిం సమాజాన్ని సంతృప్తిపరిచేందుకు తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి భారతీయ జనతాపార్టీని లక్ష్యంగా చేసుకొని కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేసిందనే విషయాన్ని కేబుళ్లు పేర్కొన్నాయి. కాంగ్రెస్‌పార్టీ తనకు లాభం లేదా ప్రయోజనం కలుగుతుందనుకుంటే తన పాత కుల/మత ఆధార రాజకీయాలు చేసేందుకు వెంటనే దిగజారేందుకు సిద్ధంగా ఉంటుందని ఈ ఘటన రుజువు చేస్తుందని ఒక కేబుల్ పేర్కొంది.

అలాగే, ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ నాటి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అప్పటి భారత్‌కు అమెరికా అప్పటి రాయబారిగా ఉన్న టిమోతీ.జె రోమర్‌తో మాట్లాడుతూ,ముస్లిం తీవ్రవాదం కన్నా హిందూ అతివాదులు దేశానికి ప్రమాదకరమని చెప్పడాన్ని పట్టి చూపింది. అలాగే, పాక్‌కు చెందిన



# ...గురించి..

లష్కర్–ఎ– తొయబా (ఎల్ఇటి) గురించి రాయబారి రాహుల్‌ను అడిగినప్పుడు భారతీయ ముస్లిం జనాభాలో కొందరి మద్దతు దానికి ఉందనేందుకు రుజువులున్నాయని చెప్పినట్టుగా కూడా పేర్కొంది.

ముంబై దాడుల ఏడునెలల అనంతరం ఎల్ఇటి గుజరాత్ అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీని హత్య చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్టు తెలిపింది.

అంతేకాదు, నరేంద్రమోదీపై అంచనాలను ఇస్తూ, మోదీ తననుతాను అవినీతిరహిత, ప్రభావవంతమైన పాలకుడిగా, వాణిజ్య సంస్కృతి పాతుకుపోయిన రాష్ట్రంలో వ్యాపారం చేయడాన్ని సులభతరం చేయడమే కాదు, శాంతిభద్రతలను ఎటువంటి గడబిడలు లేకుండా నిర్వహిస్తూ, హిందూ మెజారిటీ ప్రయోజనాలను కాపాడే రాజకీయ నాయకుడిగా స్థిరపరచుకున్నట్టు ముంబైలోని యుఎస్



రాహుల్



మోదీ

కాన్సుల్ జనరల్ మైకెల్ ఓవెన్ 2 నవంబర్ 2006లో అమెరికాకు తెలియబరచడాన్ని బయటపెట్టింది. మోదీకి అమెరికా 2005లో వీసా ఇచ్చేందుకు నిరాకరించిన అనంతరం తాను ఆయనను కలవాలనుకుంటున్నట్టు కూడా ఆయన ఈ సందర్భంలో పేర్కొన్నారు. ఆ కాలంలో సౌదీ అరేబియా భారత్‌లో వాహబిజాన్ని ప్రోత్సహించేందుకు మిలియన్ల డాలర్లను కుమ్మరించడాన్నే కాదు, బాలీవుడ్‌కు అండర్‌వరల్డ్‌తో ఉన్న లింకులను వికీలీక్స్ బయటపెట్టింది.

అలాగే, అమెరికా కాన్సుల్ జనరల్‌కు తాము మరో రెండు ఆటంబాంబులను తయారు చేస్తున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు కమల్‌నాథ్ బయటపెట్టడాన్ని కూడా పట్టి చూపింది. ★

ఆయుధీకరించగలదని కూడా బయటపెట్టింది. అలాగే, స్మార్ట్ టీవీలు వంటి వాటిని కూడా హ్యాక్ చేసి, నియంత్రించేందుకు సీఐఏ పరికరాలను అభివృద్ధి చేసింది. కార్లు, ట్రక్కులు సహా రిమోట్ కంట్రోల్ ద్వారా వాహనాలను నియంత్రించగలిగే ప్రమాదకర సాంకేతికతలను సీఐఏ అభివృద్ధి చేసిందనే సమాచారాన్ని తెలిపింది. అలాగే, ఎన్నికలలో సిఎన్ఎన్, వాషింగ్టన్ పోస్ట్ వంటి పత్రికలతో యుఎస్ డెమొక్రాటిక్ నేషనల్ కమిటీ ఎలా కుమ్మక్కైందో తెలిపింది.

**వికీలీక్స్ అనంతర పరిణామాలు**

కాగా, 2010లో తనపై వచ్చిన లైంగిక అత్యాచార ఆరోపణలను అస్సాంజే నిరాకరించినప్పటికీ, స్వీడన్ దర్యాప్తు ప్రారంభించింది. తర్వాత రెండేళ్లకు అస్సాంజే రాజకీయ ఆశ్రయం కోసం లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయం తలుపుతట్టడం, వారు అంగీకరించడం జరిగిపోయాయి. ఏడేళ్ల తర్వాత 2019లో బ్రిటిష్ పోలీసులు అమెరికా తరపున అస్సాంజేను అరెస్టు చేసి ఈక్వెడార్ ఆశ్రయాన్ని ఉపసంహరించుకున్న తర్వాత తమ నిర్బంధంలోకి తీసుకోవాలని యూఎస్‌ను కోరారు.

2022లో యూకే హోంమంత్రి అప్పగింత ఉత్తర్వులపై అస్సాంజే అప్పీల్‌కు వెళ్లారు. మరొక రెండేళ్ల తర్వాత జూన్ 2024లో అతడు యుకె జైలు నుంచి ఆస్ట్రేలియాకు తిరిగి వెళ్లేందుకు అనుమతిస్తూ అమెరికా అస్సాంజేతో ప్లీ డీల్ చేసుకోవడంతో, అతడు స్వేచ్ఛావాయువులు పీల్చుకునే అవకాశం లభించింది.

**పత్రికా స్వేచ్ఛపై చర్చ**

అమెరికా చేస్తున్న అన్యాయాలను తన కర్తవ్యానికి కట్టుబడి నిజాయతీగా వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టుగా జూలియన్ అస్సాంజే సామాన్యులలో మంచి పేరు అయితే తెచ్చుకున్నాడు కానీ, అందుకు భారీగా వ్యక్తిగత మూల్యాన్ని చెల్లించుకున్నాడు. తన కుటుంబం నుంచి పూర్తిగా దశాబ్దానికిపైగా దూరంగా ఉండటమే కాదు, జైలులో ఏకాంతవాస శిక్షను అనుభవించాడు. ఒకవేళ అతడిని అమెరికాకు పంపించి ఉంటే, వారి చర్య ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛపై, ఆ భావనపై విస్తృత ప్రభావాలు




లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో అస్సాంజే

చూపి ఉండేదని పలువురు సీనియర్ జర్నలిస్టుల భావన. రహస్య విషయాలను, దౌత్యపరమైన కేబుళ్లను బయటకు తెచ్చి ప్రచురించడాన్ని అమెరికా ప్రభుత్వం దానిని దేశద్రోహంగా పరిగణిస్తూ అతడిపై 18 నేరపూరిత ఆరోపణలను చేసింది. దీనిని విచారించి శిక్షవేస్తే ఇందుకు 175 సంవత్సరాల జైలుశిక్ష పడే అవకాశం ఉంది.

కాగా, గతంలో అస్సాంజేకు సహకరించిన ఐదు అంతర్జాతీయ మీడియా సంస్థలు, రహస్య పత్రాలను ప్రచురించినందుకు ఉన్న కేసును ఎత్తివేయవలసిందిగా యూఎస్ ప్రభుత్వాన్ని కోరాయి. రెండేళ్ల కింద 'ది న్యూయార్క్‌టైమ్స్, ది గార్డియన్, లీ మాండే, ఎల్ పయస్, దేర్ స్పీగెల్' ప్రతినిధులు రాసిన లేఖలో వాటిని ప్రచురించడం నేరం కాదంటూ వాదించారు.

'ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని సున్నితమైన సమాచారాన్ని సేకరించడం, బయటపెట్టడం అన్నది జర్నలిస్టుల రోజువారీ పనిలో కీలక భాగం, ఒకవేళ ఆ పనిని నేరపూరితం చేస్తే, ప్రజల వ్యక్తీకరణ, ప్రజాస్వామ్యాలు గణనీయంగా బలహీనపడతాయి' అని ఆ లేఖ హెచ్చరించింది.

అనేకమంది ప్రముఖులు కూడా పత్రికా స్వేచ్ఛకు దుర్దినాన్ని ఈ ప్లీడీల్ తప్పించిందని అభిప్రాయపడినప్పటికీ, అందులోని షరతుల పట్ల అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అతడు అనుభవించిన జైలు శిక్షను అతడు చేసిన ఈ నేరానికి శిక్షగా పరిగణించడమంటే, ఒక జర్నలిస్టు నిజం బయటపెట్టినందుకు శిక్షించడమే కదా అని ప్రశ్నిస్తున్నారు. ★



భారతీయ సంస్కృతిలో త్యాగవైరాగ్యాలకూ, జ్ఞాన బలోపాసనలకూ సమ ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భావాలకు ప్రతీకప్రాయులుగా, నిలయాలుగా, ప్రచారకులుగా వెలుగొందిన సన్యాసులను, విరాగులను పూజించి తమ జన్మ తరించిందని భావించేవారు. ఆ సముద్ర పర్యంతం భూమిని ఏకచ్ఛత్రంగా పరిపాలించిన చక్రవర్తులు; సమ్రాట్టులు కూడా కేవలం ఈ భావానికి ప్రత్యక్ష రూపులైన వీతరాగ సన్యాసులను పూజించడమేగాక, గృహస్థ, వానప్రస్థానాలనంతరం తాము కూడా సన్యసించి ఈ త్యాగవైరాగ్యాది భారతీయ ధర్మదర్శాలను ప్రచారించి ముక్తిని పొందేవారు.

# మన ఆశయాదర్శాలకు ప్రతీకం – భగవాధ్వజం

ఈ నాటికీ మన జాతిలో ఆ భావం నశించిపోలేదు. ఆ భావమే సజీవంగా నిలిపింది. గత వేయేండ్లలో బాధలెదిరించినపుడు మాత్రమే కష్టపడి, సుఖశాంతుల సమయంలో జాతి రక్షణకు తిరిగి విస్మరించినా ఈ త్యాగ వైరాగ్య భావాలను నేల నాలుగు చెరగుల నిర్మించిన సన్యాసులు, విరాగులు, వీరులే ఈ దేశాన్ని కాపాడారు. ఎక్కడివాడైనా, ఎవరైనా – ఎటువంటివాడైనా మరో ప్రశ్న లేకుండా కాషాయాంబరధారిని పూజిస్తారు ప్రజలు. ఆనాడు అలాంటి వ్యక్తులు తమ తపస్సువల్ల, తీవ్ర ప్రయత్నం వల్ల దేశమంతటా ఈ సంస్కృతీ ప్రవాహాన్ని నింపారు. ఎటు చూచినా రెండు వేల మైళ్ల పొడవు, రెండువేల మైళ్ల వెడల్పు కలిగిన ఈ విశాల భూమిలో, 20వేల సంవత్సరాల అతి ప్రాచీన చరిత్రలో ఈ మహానుభావులు దేశాన్ని, ప్రజలను, ఏకీకృతం చేసి, రాష్ట్రాన్ని పటిష్ఠం చేయడానికి చేసిన తపస్సు వల్లనే నేటికీ కాషాయాంబరధారులైన మహాపురుషులంటే గౌరవం ఉన్నది. 'కరతలభిక్షా – తరుతలశయ్యా' అరచేత రెండు ముద్దలన్నం తినడం – ఏ చెట్టునీడనో పడుకోడం– ఇదీ వారి జీవనం.

ఇలాంటి కఠోర వ్రతధారులైన సన్యాసులే ఈ దేశంలో సనాతనమైన, శాశ్వతమైన మన ఏకాత్మ జీవనాన్ని నిర్మించారు. తమ ప్రతి రక్త బిందువును పిండి దేశానికీ, ధర్మానికి సేవచేసేందుకు ఏ ఉదాత్త ఆదర్శం ఈ మహాపురుషులకు స్ఫూర్తి వచ్చింది? ఆ త్యాగవైరాగ్య భావమే! ఆ భావానికి ప్రతీకయే కాషాయం. అందుకే కాషాయం అంటే రాష్ట్రాత్మకు చిహ్నంగా రూపొందింది. ఆ కాషాయ ధ్వజం భగవాధ్వజంగా రూపొందింది.

*"ఈశాంవో వేద రాజ్యం,*
*త్రిషన్దే! అరుణైః కేతుభిః సహ*
*యే అంతరిక్షే, యేదివి,*
*పృథివ్యాం యే చ మానవః"*

**(అధర్వణవేదం)**

(ఓ నిర్మోహి ప్రాణులైన వీరులారా! మీ మీ అరుణ ధ్వజాలను తీసుకొని శత్రువులను తురుమాడదానికి ఒక్కుమ్మడిగా ఆక్రమణ చేయండి.) అని హెచ్చరించుకున్నారు. దేశరక్షణకు మీరర్పించే రక్తాన్ని, ఆ త్యాగాన్ని గుర్తుకు తెచ్చే పతాక నారాధించనున్నారు. (కేతుః ఆరుషం రుజద్భ్యైః)

ఈ అభేదభావం – సమన్వయభావం వేదకాలం నుండి నేటివరకు మన సంస్కృతిలో కన్పిస్తూనే ఉన్నది. మానవ జీవన లక్ష్యాన్ని వివరించేటప్పుడు అన్నిచోట్లా ఇదే భావం కనిపిస్తుంది.

ఈశోపనిషత్తులో ఈ విషయాన్ని వివరిస్తూ ఐహికమైనా, ఆధ్యాత్మికమైనా– ఏదో ఒక మార్గాన్ని మాత్రమే అనుసరించడం గుడ్డితనం అని ప్రబోధించారు. ఇదే భారత రామాయణాదుల్లో, సమస్త సాహిత్యంలో కన్పిస్తుంది. ఇందరు వీరులకు తమ రుధిరధారలను కురిపించే పాఠం నేర్పింది ఈ త్యాగవైరాగ్య భావాల ప్రతీకమైన కాషాయమే, ఈ భగవాధ్వజమే.

ఇలా కర్మయోగంతో ఆత్మవికాసం చేసుకొంటూ, గుణసాధనతో, పరిశ్రమతో, అధ్యవసాయంతో ఈ పాంచభౌతిక సుఖాల కామాన్ని వదలి ఆత్మకూ, మేధస్సుకూ, శరీరానికీ సమాన ప్రాముఖ్యాన్నిచ్చే పాఠాన్ని కేవలం మన సంస్కృతి మాత్రమే నేర్పు తుంది.

అలాంటి మహత్తరమైనదీ ధ్వజం. వేదకాలం నుంచి భారతకాలంవరకిదే మనకేకైక చిహ్నం. మన సంస్కృతి మధ్యవర్తితత్వాన్ని, సమన్వయ తత్వాన్ని, ప్రకటించేది ఈ ధ్వజమే. విరాగులీధ్వజాన్ని ధరించి సాంస్కృతిక ప్రవాహాన్ని ప్రవహింపజేశారు. వీరులు దీనిని కాపాడారు. ధనాఢ్యులు దీనిని అభ్యున్నత పథాల నడిపించారు. నేడు ఇన్ని భేదాలున్నా ఆ పునీత ఆదర్శాల అడుగు జాడలలో సమాజాన్ని సంఘటించడానికి అనుకూల పరిస్థితులు లేకపోయినా, కాలగతివలన చైతన్యం డీలాపడినా మన ఈ సంస్కృతీ సంరక్షణకై ప్రజలు చూపిన తత్పరత అనూహ్యమైనది.

మహమ్మదీయ యుగంలో, ఆంగ్లేయ యుగంలో ఎన్నిసార్లు ఎన్ని రూపాల్లో మన సమాజాన్ని సర్వనాశనం చేయడానికి ప్రయత్నాలు జరిగినా, ఎన్ని దురాక్రమణలు జరిగినా ఈనాటికీ అన్ని విధాల దురాక్రమణల నెదిరించి కోటానుకోట్ల ప్రజలు ఈ ఆదర్శాన్ని పాటించేవారున్నారంటే కారణమీ పునీత ఆదర్శమే. ఈ ఆదర్శాన్ని స్వీకరించి ప్రజలలో చైతన్యాన్ని నిలపడానికి శంకరాదులు, సమర్థ గురుజ్ఞాన దేవాదులు జ్ఞాన ప్రవాహాన్ని ప్రవహింపచేశారు. సూరదాస్, తులసీదాస్, తుకారాం, త్యాగరాయాదులు భక్తి సాగరాన్ని మథించి జాతి రక్షణకు అమృత పయస్సుల నిచ్చారు. ఎందరో మహాపండితులు, కవులు ఎన్నో దివ్యగ్రంథాలు విరచించారు.

అహర్నిశలు ఉత్తమోత్తమమైన కావ్యసాధన చేసినా చివరకు తమ పేరు కూడా పెట్టుకోని మహానుభావులెందరో ఉన్నారు. వారి రచన లీనాటికి జాతికి కోటి రక్షలై వెలుగొందుతున్నాయి. అష్టాదశ పురాణాలు, అనేక స్తోత్రాలు, అనేక కావ్యాలు. ఎవరో రచయిత? ఎంత త్యాగమది?

# భగవద్ధ్వజహే॥

నమో నమస్తే నమో నమో
భగవద్ధ్వజహే నమోస్తుతే।
అరుణారుణ కాంతి విరాజిత హే।
అధికాధిక కీర్తివిరాజిత హే।
ఉష్ణశీతభానూద్గిర జయహే
దుర్నిరీక్ష తేజఃప్రభ జయహే।
మలయానిల ధూత నిజాంచలసం
ప్రభవామల శబ్ద విబోధిత హే
దీప్త హిందు వీరోన్నత జయహే
తృప్త హిందు భావోన్నత జయహే।
గత వైభవ సాధనపరమతి సంఘటి
తాఖిల హిందు శుభోజ్జ్వల జయహే
పూర్వ పుణ్యమూర్తి ప్రభ జయహే।
పుష్పదామ సంభూషిత జయ హే।

జాగృతి,
10.7.1949

భారతీయ జీవితానికి గురుస్థానంలో అలంకరింపదగిన ధర్మాచార్యులు, తను మనోధనాల ధర్మస్థాపనకై, సమాజసేవకై, అఖిల మానవోద్ధరణకై పాటుపడిన గురుమూర్తులు ఎందరో ఉన్నారు. కానీ వ్యక్తిని గురుస్థానంలో సమాజమంతటికీ భారతజాతి ఇంతవరకు స్వీకరించలేదు. దోషరహితమై, త్యాగమయ జీవితానికి ఏకైక చిహ్నమై, భారతీయ సంస్కృతికి పవిత్ర ప్రతీకమై వెలుగొందిన భగవద్ధ్వజాన్ని భారతజాతి తన గురుస్థానంలో నిలుపుకున్నది.

# భారతీయ సంస్కృతిని రక్షిస్తున్నది కాషాయ జెండా

వ్యక్తి జీవితం అపరిపూర్ణంగావచ్చు, దోషరహితం కాకపోవచ్చు, కానీ సమస్త భారత జాతి జీవితానికి యుగాల నుంచి దుఃఖంలో, సుఖంలో, సుషుప్తిలో జాగ్రదావస్థలో పవిత్ర స్ఫూర్తిని ప్రసాదించిన పరమ పవిత్ర భగవాధ్వజాన్ని స్వీకరించి భారతజాతి తన తపస్సాధనకు ఫలితాన్ని పొందింది.

ఆ ధ్వజం మ్రోల మోకరిల్లి మహర్షులు వేదగానామృతంతో దశదిశలను అమృతమయమొనరించారు. ఆ ధ్వజ సాన్నిధ్యంలో సగరాది షట్చక్రవర్తులు 'త్యాగేనైకే అమృతత్వ మానశుః' అన్న పాఠాన్ని నేర్చుకొని మానవునికీ, స్వర్గానికీ నిచ్చెనల కట్టారు. వీర శిరోమణులు ఈ ధ్వజచ్ఛాయలలో, దేశ స్వాతంత్ర్యాన్ని హరించవచ్చిన దుష్టశక్తులను తరిమి తరిమి భారతిని స్వతంత్ర దేవిగా ప్రపంచానికి జ్ఞానదాయినిగా చేశారు. ఈనాటికీ హిందూజాతికి ధర్మచిహ్నంగా, భారతీయ సంస్కృతికి పరమపవిత్ర ప్రతీకగా వెలుగొందుతోంది.

సర్వ మానవ సమానత్వాన్నీ, సర్వ మానవ సౌభాతృత్వాన్ని ప్రపంచంలో నెలకొల్పిన భారతజాతి ఆత్మవిస్మృతివల్ల పరాధీనమైంది. పరప్రభుత్వంతో పరధర్మం, పరసంస్కృతి మన నెత్తికెక్కాయి. స్వరూపంలో వినా మరెందునా భారతీయత కాన్పించని దుస్థితి ఏర్పడింది. అప్పుడే శివాజీ, మహారాణాలాంటి త్యాగధనులు మరల ఈ ధ్వజాన్ని ఆకాశాన ఎగిరించారు. ఈ ధ్వజచ్ఛాయలో మొగలు సామ్రాజ్యాన్ని తుత్తునియలు చేసి సమాజాన్ని, ధర్మాన్ని రక్షించారు. కష్టాల నెదుర్కొనవచ్చు, సుఖాల ననుభవించవచ్చు. కానీ అన్ని పరిస్థితిలోనూ జాతి జీవితం కుంటుపడ్డప్పుడల్లా ఉత్సాహాన్నిచ్చి, నరనరాలలో కవోష్ణరక్తాన్ని ఉప్పొంగచేసి, సమరభూమికి నడిపించిన స్ఫూర్తిదాత ఐన ధ్వజాన్ని విస్మరించిన నాటి నుండే మన స్వత్వ విస్మృతి కూడా సంభవించింది. తత్పరిణామమే ఈనాటి సర్వ విస్మృతి.

గురుపూజ పర్వదినాన మళ్లీ మన పవిత్ర గురుమూర్తి మ్రోల మోకరిల్లి ఇన్నాళ్ల విస్మృతిలో చేసిన మహాపచారాలను క్షాళితం చేయాలి. మన తను, మన ధనాలనర్పించి భారతీయ సాంస్కృతిక వికాసానికి కటిబద్ధులమవ్వాలి.

జాగృతి, 10.7.1949

పేరాశించకుండా జీవితాన్ని ధారవోసి మన జీవిత ధారను ప్రవహింపచేసిన పుణ్యమూర్తులు.

ఇందరికీ స్ఫూర్తినిచ్చింది, సమాజసేవకై సర్వమర్పింపనేర్పింది, మన త్యాగ వైరాగ్యయుక్తమైన జ్ఞానంలో పాసనాయుక్తమైన ఆదర్శమే. ఆ ఆదర్శరూపమైన మన కాషాయ ధ్వజమే! ఇది అనాదియైనది! దీని శీతలచ్ఛాయలో నిరాశకు తావు లేదు. బాధలడ్డవు. ఆకలి దప్పులీ సంస్కృతీ ప్రవాహాన్ని అడ్డగించలేవు.

మొన్నమొన్నటి విప్లవయుగం దాకా మనకీ ప్రవాహం కన్పిస్తుంది. 'వాసాంసి జీర్ణాని యధావిహాయ' అనే తత్వంతో శరీరమోహం వదలి ఒకచేత పునీత భగవద్గీతనూ, మరొకచేత పిస్తోలునూ ధరించి విజాతీయ ప్రభుత నెదిరించిన ఆ యువక వీరులకు స్ఫూర్తినిచ్చింది ఈ పవిత్ర ధ్వజరూపంలో వెలుగొందిన త్యాగవైరాగ్య, జ్ఞాన బలోపాసనల దివ్య ఆదర్శమే.

నేటికీ ఈ భావాన్ని ఈ వెలుగును ఇచ్చి దేశమంతటా లక్షల కొలదిగా హైందవ సంఘటనకై ప్రయత్నిస్తున్న తరుణ వీరులకు స్ఫూర్తికేంద్రమిదే!


అలా నాటి నుంచి నేటివరకూ మన రాష్ట్రానికీ, మన సంస్కృతికీ, మన సమస్త జీవితానికి మూలధారగా ప్రవహించిన త్యాగవైరాగ్య, జ్ఞాన బలోపాసనలకు ప్రత్యక్ష రూపమైన భగవాధ్వజమే మన జాతికి ప్రాణంగా, చిహ్నంగా నిలిచింది. దీని నీడలో నిర్మించిన శిల్పం జాతీయ శిల్పం! దీని ఛాయలో రచించిన సాహిత్యం జాతీయ సాహిత్యం! దీని నీడన జరిగిన ప్రతిక్రియా కలాపం రాష్ట్రీయ కర్తవ్యం!

దీన్ని ఆరాధించి జీవితంలో రూపొందించుకున్న నాడే ఈ భారత రాష్ట్రం ప్రబల రాష్ట్రంగా నిలువగలుగుతుంది. దీన్ని మహోత్తుంగంగా ఎగురవేయడానికి త్యాగవైరాగ్య, జ్ఞాన బలాలను ఉపాసించినపుడే మన రాష్ట్రం గౌరవశాలిగా అభ్యుదయ శిఖరాలను ఆరోహించగలుగుతుంది.

(బాబాసాహెబ్ ఆప్టే ఉపన్యాసం ఆధారంగా 'పరశు' రాసిన వ్యాసం. జాగృతి/ 8.7.1955)

భారతదేశంలో హిందువులు ఇప్పుడైనా నిద్ర లేవకపోతే, మైనార్టీలుగా మారే అవకాశం ఉంది. ఈ హెచ్చరిక చేసింది వేరెవరో కాదు సాక్షాత్తు అలహాబాదు హైకోర్టు. దానితో పాటుగా, మతసమ్మేళనాలు, సభల సమయంలో జరుగుతున్న మతాంతరీకరణల విషయంలో ఎవరూ జోక్యమూ చేసుకోకపోతే భారత్‌లోని మెజారిటీ జనాభా మైనార్టీకి దిగజారే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. ఒక మతాంతరీ కరణ కేసులో కైలాస్ అనే వ్యక్తికి బెయిల్ నిరాకరిస్తూ న్యాయమూర్తి రోహిత్ రంజన్ అగర్వాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలలో సత్యాన్ని కాదనలేం. దేశాన్ని ముక్కలు ముక్కలు చేయాలని, హిందువులను కులాల వారీగా విభజించి పాలించాలన్నది ఎ.ఒ. హ్యూమ్

# 'మెజారిటీలు నిద్రలేవకపోతే మైనార్టీలుగా మారుతారు'




## బలవంతపు మతాంతరీకరణలపై అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్య

స్థాపించిన కాంగ్రెస్‌పార్టీ లక్ష్యం. ఈ కుట్రలను అర్థం చేసుకోకుండా చిన్నచిన్న తాయిలాలకే మురిసిపోయో లేక మెకాలే లాంటి మేధావుల మాటలతో ప్రభావితమయ్యో హిందువులు కాంగ్రెస్, దాని తోక పార్టీల బుట్టలో పడిపోయి సెక్యులరిజం పేరుతో మతాన్ని మంటకలుపుతున్నారు.

దక్షిణాదిలోనే కాదు ఉత్తరాదిలో కూడా మతాంతరీకరణ అత్యంత వేగంగా చోటు చేసుకుంటోందనడానికి అలహాబాదు హైకోర్టులో దాఖలైన వ్యాజ్యమే ఒక ఉదాహరణ. ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ గ్రామానికి చెందినవారిని కైలాస్ అనే వ్యక్తి వారికి వైద్య చికిత్స ఉచితంగా చేయిస్తామనే హామీతో ఒక మత సమ్మేళనానికి తీసుకువెళ్లి, క్రైస్తవంలోకి మతాంతరీకరించాడు. భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 365, యుపి చట్టవిరుద్ధ మతమార్పిడి నిషేధ చట్టం, 2021లోని 3/5(1) కింద కైలాస్‌పై అభియోగాలపై కోర్టు విచారణ సందర్భంగా ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి అగర్వాల్ దేశాన్ని అప్రమత్తం చేసే యత్నం చేశారు.

**నిందితుడిపై బాధితుడి సోదరి ఆరోపణలు**

కోర్టు పత్రాల ప్రకారం, ఫిర్యాదుదారు రామ్‌కలీ ప్రజాపతి సోదరుడు రామ్‌ఫల్‌ను కైలాస్ అనే వ్యక్తి ఢిల్లీలో జరుగుతున్న ఒక సామాజిక, సంక్షేమ సభకి హమీర్‌పూర్ నుంచి తీసుకువెళ్లాడు. అతడితో పాటుగా గ్రామం నుంచి పలువురిని ఈ కార్యక్రమానికి తీసుకువెళ్లి వారందరినీ క్రైస్తవంలోకి మార్చాడు. మానసిక సమస్యతో బాధపడుతున్న తన సోదరుడికి, చికిత్స చేయిస్తానని, ఒక వారంలో తిరిగి రావచ్చని కైలాస్ హామీ ఇచ్చాడని రామ్‌కలీ తన ఫిర్యాదులో పేర్కొంది. ఒకవారం తర్వాత కూడా రామ్‌ఫల్ తిరిగి రాకపోవడంతో, ఆమె కైలాస్‌ను దాని గురించి ప్రశ్నించింది. అతడి నుంచి సంతృప్తికరమైన జవాబు రాకపోవడంతో కైలాస్ ఫిర్యాదు చేసింది. కాగా, రామ్‌ఫల్‌ను క్రైస్తవంలోకి ఎప్పుడూ మార్చలేదని, కైలాస్ అసలు ఆ కార్యక్రమానికే వెళ్లలేదని నిందితుడి తరుపు న్యాయవాది వాదిస్తున్నాడు. బెయిల్‌పై ఉన్న సోనూ పాస్టర్ ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తున్నాడని కూడా ఆరోపించాడు. కాగా, నిందితుడిపై ఆరోపణలు తీవ్రమైనవి కావడంతో కోర్టు బెయిలు నిరాకరించింది. పైగా అతడు ప్రజలను మత మార్పిడికోసం ఇటువంటి సమావేశాలకు తీసుకువెడుతున్నాడని పలువురు వ్యక్తులు చేసిన ప్రకటనలు సూచించాయి.

**'మతమార్పిడులు ఇలాగే కొనసాగితే మెజారిటీ ప్రజలు మైనార్టీలుగా మారుతారు'**

మతమార్పిడులు జరిగే మతపరమైన సభలను తక్షణమే నిలిపివేయాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం ఉద్ఘాటించింది. "ఈ ప్రక్రియను ఇలాగే కొనసాగనిస్తే, దేశంలోని మెజారిటీ జనాభా ఏదో ఒకనాడు మైనార్టీగా మారుతుంది. మతమార్పిడులు జరుపుతూ, భారత పౌరుల మతాన్ని మారుస్తున్న ఇటువంటి మత సభలను తక్షణమే నిలిపివేయాలి" అని జస్టిస్ అగర్వాల్ వ్యాఖ్యానించారు.

**మత ప్రచారం వేరు, మత మార్పిడి వేరన్న కోర్టు**


రాజ్యాంగ ఆదేశాలను పట్టి చూపుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ఆత్మప్రబోధ స్వేచ్ఛకు, ఏ మతాన్నైనా అవలంబించి, ఆచరించి, ప్రచారం చేసుకునే హక్కుకు హామీ ఇస్తుంది. అయితే, అది ఒక మతం నుంచి మరొక మతానికి వ్యక్తులను మార్చడానికి అది విస్తరించదు. 'ప్రచారం' అనే పదానికి అర్థం తన మతాన్ని ప్రోత్సహించడమనే తప్ప ఇతరులను తమ మతంలోకి మార్పిడి చేయడం కాదనే విషయాన్ని జస్టిస్ అగర్వాల్ పట్టి చూపారు.

**యుపిలో ప్రబలంగా మతమార్పిడులు సాగుతున్నాయన్న కోర్టు**

ఉత్తర్‌ప్రదేశ్ వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా జరుగుతున్న మతమార్పిడుల పట్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, ఆర్థికంగా వెనుకపడిన నేపథ్యం నుంచి వచ్చినవారిని లక్ష్యంగా చేసుకుని ఇవి చోటు చేసుకుంటున్నాయని ఉద్ఘాటించింది. "ఎస్‌సి/ఎస్‌టి కులాలు, ఆర్థికంగా పేదవర్గాలు సహా ఇతర కులాలను లక్ష్యంగా చేసుకొని చట్టవిరుద్ధంగా క్రైస్తవంలోకి మతాంతరీకరిస్తున్న విషయం పలు కేసుల సందర్భంగా ఈ కోర్టు దృష్టికి వచ్చింది, యుపి వ్యాప్తంగా ఇది జరుగుతోంది," అని కోర్టు వ్యాఖ్యానించింది. మత ప్రచారాన్ని అనుమతించినా, భారత రాజ్యాంగమిచ్చిన స్వేచ్ఛను బలవంతపు మతమార్పిడులు బలహీన పరుస్తాయని కోర్టు ఉద్ఘాటించింది.

– జాగృతి డెస్క్

# భారత అమ్ములపొదిలో ఘాతుకమైన సెబెక్స్-2



అత్యంత ఘాతుకమైన పేలుడు పదార్థాన్ని, బాంబును అభివృద్ధి చేయడం ద్వారా రక్షణ రంగంలో ఆత్మనిర్భరత దిశగా భారత్ మరొక అంగవేసింది. దేశీయంగా ఉత్పత్తి చేసిన సెబెక్స్-2 (SEBEX 2) అన్న పేలుడు పదార్థం ట్రినిట్రోటోల్యూన్ (టిఎన్‌టి) కన్నా రెండింతలు ఘాతుకమైంది.

భారత ప్రభుత్వం 'మేకిన్ ఇండియా' కింద గత కొన్నేళ్లుగా పలు విధానపరమైన చొరవలను తీసుకుంటూ, రక్షణ పరికరాలను దేశీయంగా రూపకల్పన, అభివృద్ధి, ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహిం చేందుకు పలు సంస్కరణలను కూడా చేపట్టింది. ప్రస్తుతం భారత్ ఆయుధాలను దేశీయంగా తయారు చేయడమే కాదు దాదాపు 85 దేశాలకు ఎగుమతి కూడా చేస్తున్నది. దాదాపు 100 సంస్థలు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాయి. దీనిద్వారా భారతీయ పరిశ్రమ తమ రూపకల్పన, అభివృద్ధి చేయగల సామర్థ్యాలను ప్రపంచానికి చాటుకుంది.

**ఏమిటీ సెబెక్స్...**

నాగపూర్‌కు చెందిన సోలార్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ ఎకనమిక్ ఎక్స్‌ప్లోజి వ్స్ లిమిటెడ్, కేవలం విధ్వంసక శక్తిని, పేలుడు ప్రభావాన్ని పెంచి నూతనంగా మూడు సూత్రీకరణలను అభివృద్ధి చేసింది. ఈ సూత్రీకరణలే మన సాయుధ దళాల కార్యాచరణను గణనీయంగా మార్చనున్నాయి.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఘన పేలుడు పదార్థాలకన్నా శక్తిమంతమైన పేలుడు ప్రభావాన్ని సెబెక్స్-2 కలిగి ఉంది. ఏ పేలుడు శక్తిని అయినా టిఎన్‌టిని కొలమానంగా పెట్టుకొని కొలుస్తారు. అధిక టిఎన్‌టి తుల్యత కలిగిన పేలుడు పదార్థాలకు ఎక్కువ ఘాతుక, విధ్వంసకశక్తి ఉంటుంది. సంప్రదాయ అస్త్ర ముఖంలో, ఆకాశం నుంచి విసిరే బాంబులు, అనేకానేక ఇతర ఆయుధాలలో ఉపయో గించే డెంటెక్స్/ టోర్పెక్స్ (DENTEX/TORPEX)ల టిఎన్‌టి తుల్యత 1.25-1.30 మాత్రమే అని నిపుణులు చెబుతున్నారు.

బ్రహ్మోస్ క్షిపణి సహా పలు ఆయుధముఖాలలో ఉపయో గించే టిఎన్‌టికన్నా రెండింతలు ఘాతుక మని చెప్తున్న సెబెక్స్-2 ను భారతీయ నావికాదళం సర్టిఫై చేసింది.

అణుయేతర పేలుడు పదార్థాలలో అత్యంత శక్తిమంతమైనదని పేర్కొంటున్న సెబెక్స్-2, అదనంగా బరువు పెంచకుండా వాటి విధ్వంసక శక్తిని పెంచడం ద్వారా ఫిరంగి గుండ్లు, అస్త్రముఖా లని విప్లవీకరించ నుందని వార్తలు చెబుతున్నాయి. కాగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పేలుడు పదార్థాలకన్నా శక్తిమంతమైన పేలుడు ప్రభావం సెబెక్స్-2కి ఉన్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు.

నావికాదళ రక్షణ ఎగుమతి ప్రోత్సాహక పథకం కింద సెబెక్స్-2 సూత్రీక రణను కఠినంగా పరీక్షించి నట్టు వార్తాపత్రికలు పేర్కొన్నాయి. ఈ వర్గంలో మొత్తం మూడు నూతన సూత్రీకరణలను రూపొందిం చారు.

మేకిన్ ఇండియా చొరవ కింద అభివృద్ధి చేసిన సెబెక్స్-2 అధిక ద్రవీభవన పేలుడు పదార్థం (హెచ్‌ఎంఎక్స్) ఆధారిత మిశ్రమాన్ని వినియో గిస్తుంది. కంపెనీ మరింత అధిక ఘాతుక శక్తి కలిగిన మరొక వేరియంట్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలుస్తోంది.

సెబెక్స్-2 కు అదనంగా భారతీయ నావికాదళం సిట్‌బెక్స్ 1 కూడా సర్టిఫై చేసింది. పేలుడు వ్యవధికి, తీవ్రమైన వేడిని ఉత్పత్తి చేసేదిగా పేరుగాంచిన థెర్మోబారిక్ ( పేలినప్పుడు అగ్నిగోళంలా కనిపిస్తూ ఆ ప్రాంతంలోని ఆక్సిజన్‌ను పీల్చుకొని శక్తిమంత మైన ఒత్తిడిని కలిగిస్తుంది) పేలుడు పదార్థం సిట్‌బెక్స్ 1. ఇది శత్రువుల బంకర్లను, సొరంగాలను, ఇతర ఆస్తులను విధ్వంసం చేసేందుకు భారత్‌కు తోడ్పడు తుంది.

భారతీయ నావికాదళం సైమెక్స్ 4 అనే మరొక నూతన సూత్రీకరణను కూడా సర్టిఫై చేసింది. నిల్వ చేయడానికి, రవాణా చేయడానికి ప్రామాణిక పేలుడు పదార్థాలకన్నా ఈ మందుగుండు సామాగ్రి సురక్షితమైంది. కనుక, భద్రతకు సంబంధించిన ఆయుధ వ్యవస్థలకు ఇది తగినది.

**ప్రాముఖ్యత**

సిట్‌బెక్స్ 1, సైమెక్స్4తో కలిసి సెబెక్స్-2 భారతదేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడమే కాదు, సైనిక సాంకేతికతలో దేశ స్థాయిని పెంచు తుంది. ఈ పురోగతి మన సాయుధ దళాలు మరింత స్వయంసమృద్ధితో ఉండేలా చేయడమే కాదు, అత్యాధునిక పేలుడు సాంకేతికతల ఎగుమతి దారుగా భారత్‌ను నిలబెడుతుంది. భారతీయ ఆయుధాలను, మందుగుండు సామగ్రి సామర్థ్యాన్ని, శక్తిని సెబెక్స్-2 గణనీయంగా పెంచనుంది. ఈ పురోగతి, సర్టిఫికేషన్లు అంతర్జాతీయ భద్రతలో వ్యూహాత్మక భాగస్వామ్యాలకు దారితీస్తున్న విషయం తెలిసిందే.

**రక్షణ ఉత్పత్తుల ఎగుమతి**

భారత్ ప్రధానంగా ఎగుమతిచేస్తున్న వాటిలో డోర్నియర్ 228, బ్రహ్మోస్ క్షిపణులు, ఆకాశ్ క్షిపణి వ్యవస్థలు, సిమ్యులేటర్లు, రాడార్లు, మైన్ ప్రొటెక్టెడ్ వాహనాలు, ఆర్మర్డ్‌వాహనాలు, పినాకా రాకెట్లు, లాం చర్లు, మందుగుండు సామాగ్రి, థర్మల్ ఇమేజర్లు, బాడీ ఆర్మర్లు, విడిభాగాలు,ఏవియానిక్స్, చిన్న ఆయుధాలుసహా పలురకాలవి ఉన్నాయి. దేశీయంగా తయారు చేస్తున్న ఎల్‌సిఎ- తేజస్, లైట్ కంబాట్ హెలికాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్, ఎంఆర్‌ఓ కార్య కలాపాలు తదితరాలకు అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతోంది.

– జాగృతి డెస్క్


# నలంద.. నిరంతర మేధోస్ఫూర్తి

"భారతదేశపు అభివృద్ధి ప్రయాణంలో ఇది ఒక గణనీయమైన అడుగు... ఇది కేవలం ఒక పేరు కాదు, ఇది ఒక గుర్తింపు.. ఒక ఆత్మగౌరవపు చిహ్నం. నలంద మూసివేత అన్నది భారతదేశాన్ని అంధకారంలోకి నెట్టివేసింది. నలంద భారతదేశపు విద్యా వారసత్వానికి, సజీవమైన సాంస్కృతిక బదలాయింపునకు సంకేతం... ఈ పురాతన నలంద సంప్రదాయాన్ని మనం పునరుద్ధరించాలి. నేను మూడవసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన 10 రోజులలోపే నలందలో పర్యటించే అవకాశం రావడం పట్ల సంతోషిస్తున్నాను... నలంద ఒక గౌరవం... ఒక విలువ.. ఒక మంత్రం. అగ్ని పుస్తకాలను దగ్ధం చేయగలదు కానీ విజ్ఞానాన్ని కాదు" అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే నలంద విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తూ చేసిన ఉపన్యాసంలో అన్న మాటలు అక్షర సత్యాలు.

నిజానికి, భారతదేశపు కీర్తిపతాకాన్ని రెపరెపలా డించింది విజ్ఞానమే అన్నది నిర్వివాదం. ఆ జ్ఞానం కోసం తీరని దాహమే నలంద వంటి విశ్వవిద్యాల యాల ఏర్పాటుకూ దారితీసింది. ఆ కాలంలోనే అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన నలంద విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించేందుకు చైనా, టిబెట్టు నుంచి ప్రమాదకర మార్గమైనా, హిమాలయ పర్వతాలను దాటుకుని వచ్చేవారట! అంతటి గొప్ప విశ్వవిద్యాలయాన్ని ఒక మతోన్మాది, అజ్ఞాని దగ్ధం చేశాడు. అనంతర కాలంలో దాని శిథిలాలు అలా పడి ఉన్నాయే తప్ప ఎటువంటి ఆదరణకు నోచుకో లేదు. మొత్తం మీద ఎన్డీయే ప్రభుత్వం చొరవతో దాని నిర్మాణం పూర్తయ్యి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే దానిని ప్రారంభించడంతో తిరిగి ఒక్కసారి వార్తల్లోకి ఎక్కింది.

నలందా విశ్వవిద్యాలయ ప్రారంభం సంద ర్భంగా, ప్రాచీన నలంద శిథిలాలను దర్శించిన ప్రధాని మోదీ అందుకు సంబంధించిన ఫోటోలను 'ఎక్స్'పై పోస్ట్ చేశారు. "తవ్వకాలలో బయటపడిన నలంద అవశేషాలను సందర్శించగలగడం ఒక అద్భుత అనుభూతి. ప్రాచీన ప్రపంచంలో విద్యకు సంబంధించిన అత్యున్నత పీఠాన్ని సందర్శించే అవకాశమిది. ఒకనాడు, ఇక్కడ వర్ధిల్లిన పాండిత్య గతంపై ఒక గొప్పదైన దృష్టిని ఈ ప్రదేశం అందిస్తుంది. మన దేశంలో నేటికీ కొనసాగుతున్న మేధోస్ఫూర్తిని సృష్టించింది నలందానే" అంటూ ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు.

భారత్, తూర్పు ఆసియా దేశాల కూటమి (ఇఎఎస్) మధ్య ఒక సహకార ప్రాజెక్టు ఈ నూతన విశ్వవిద్యాలయంగా దీనికి రూపకల్పన చేశారు. ఈ ప్రారంభోత్సవానికి 17దేశాలకు చెందిన రాయబారి కార్యాలయాల అధిపతులు సహా



# ఆ విధ్వంసకులు

ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టిన పురాతన భారతీయ మహా విద్యాసంస్థ నలందా విశ్వ విద్యాలయం. ఇటీవల జరిగిన విశ్వవిద్యా లయం పునరుద్ధరణ కార్యక్రమంతో ఆ పేరు విశ్వ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రపంచంలో ఎటువంటి శాస్త్ర విజ్ఞానం లేనప్పుడే ఇక్కడ అన్ని రంగాలలో పరిశోధనలు జరిగాయి. మత ఛాందస వాద ఖల్జీ వంశీకుడు ఇక్తియార్ అల్ దిన్ మహమ్మద్ భక్తియార్ ఖిల్జీ ఈ విశ్వవిద్యాలయాన్ని కూలగొట్టిన విషయం చరిత్ర ప్రసిద్ధం. ఎప్పటి లాగానే తమ 'రంగు' పూసిన చరిత్రను ఈ దేశం మీద రుద్దడానికి ప్రయత్నం వామపక్ష చరిత్రకారులు చేస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయాన్ని ధ్వంసం చేసినవాడు భక్తియార్‌ఖిల్జీ కాదనీ, హిందూ మతానికి బౌద్ధానికి ఉన్న అంతర్గత కలహాల కారణంగా స్థానిక బ్రాహ్మణులు తగలబెట్టారని డాక్టర్ రుచికాశర్మ (జేఎన్‌యు, ఢిల్లీ) అనే పరిశోధకురాలు పొంతన లేని కట్టు కథలను చెప్పుకొచ్చింది. అక్కడితో ఆగకుండా భక్తియార్ ఖిల్జీ కూల్చాడనడానికి ప్రాథమిక సాక్ష్యాలను చూపెట్టాలని ఇటీవల సవాల్ విసిరింది (https://twitter.com/tishasaroyan/status/ 1739 156864045322 338?tR-AldCm6GLMRVX FD8vj-huA& s =19). దీనిని బట్టి చరిత్రను వక్రీకరించి అల్పసంఖ్యా కులను బుజ్జగించాలన్న బురదగుంట నుండి వామపక్ష మేధావులు ఇంకా బయటికి రాలేదన్న విషయం అర్థమౌతుంది.

**ఇక వాస్తవాల వైపు చూస్తే...**

భక్తియార్‌ఖిల్జీ ఆ విశ్వవిద్యాలయాన్ని ఏ విధంగా ధ్వంసం చేసినదీ, గ్రంథాలయాన్ని దగ్ధం చేసినదీ తబకత్–ఎ–నసిరి (పర్షియన్ చరిత్ర పుస్తకం)లో సుస్పష్టంగా ఉంది. అలాగే డాక్టర్ రుచిక చెబుతున్న వాదన ఎంత కృతకమో కూడా ఆ గ్రంథం చెప్పింది. అతడు బ్రాహ్మణులను ఎలా ఊచకోత కోశాడో, 200 మంది అశ్వికులు ఎంత బీభత్సం సృష్టించారో కూడా ఆ గ్రంథం వివరిస్తుంది. ఇంతకీ నలందను ధ్వంసం చేసిన భక్తియార్‌ఖిల్జీ పేరు మీదనే ఆ ప్రాంతానికి పేరు వచ్చింది. ఇప్పటికీ రైల్వే స్టేషన్‌ను భక్తియార్‌పూర్ స్టేషన్ అనే పిలుస్తారు.

భక్తియార్ దాడి చేసినప్పుడు పాలా/సేన వంశీకులు పాలించేవారు. నలంద, పరిసర ప్రాంతా లను బ్రాహ్మణులు ఎన్నడూ పాలించలేదు. ఆ నాలుగు వందల సంవత్సరాల కాలఖండంలో, బౌద్ధాన్ని అనుసరించే రాజులు ఎక్కువ కాలం నివసించారు. పాలా రాజవంశం కూడా బౌద్ధాన్ని అనుసరించేది.

పాలకుల పోషణలోని మఠాన్ని నష్టపరచడానికి ఎవరూ సాహసించరు. ముఖ్యంగా బ్రాహ్మణులు వాదసంవాదంతో తార్కికంగా విషయాలను చర్చించే వారే తప్ప, భౌతికంగా నష్టపరిచే పనులు చేసేవారు కాదు. అదే ఇతర మత గ్రంథాలకు హిందూ ధార్మిక గ్రంథాలకు ఉన్న వ్యత్యాసం.

ఈ విషయాన్ని ఇంకాస్త లోతుగా చర్చించాలంటే రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఉటంకించిన విషయాలను గమనించాలి.

విన్సెంట్ స్మిత్ రాసిన early history of India (1924) pp. 419–420 పుస్తకాన్ని ఉదహరిస్తూ అంబేడ్కర్ ఇలా అంటారు –క్రీస్తుశకం 1197లో నలంద, విక్రమశిల, జగద్దాల, ఒదంత పురి బౌద్ధ విశ్వవిద్యాలయాలను ముస్లిం ఆక్రమణ

పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

**అమర్త్యసేన్ నిర్వాకం**

కాగా, ఇంతటి చారిత్రిక నేపథ్యం కలిగిన విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని మాజీ రాష్ట్రపతి డా॥ఎపిజె అబ్దుల్ కలాం 2006లో ప్రతిపాదించగానే, నితీష్ కుమార్ శిథిలాల పక్కనే భూమిని కూడా కేటాయించారు. నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం 2007లో 'నలంద మెంటార్ గ్రూప్'ను ఏర్పాటు చేసి, పాలనా వ్యవస్థ, అంతర్జాతీయ సహకారం, భాగస్వామ్యానికి చట్రం, వ్యవస్థను అందించే పనిని అప్పగించింది. దానికి అధిపతిగా అమర్త్య సేన్‌ను ఎంపిక చేశారు. ఇస్లామిక్ దాడులపై అభిప్రాయాల కారణంగా, అతడి నియామకమే మొదటి నుంచీ వివాదాస్పదమైంది, కానీ పెద్ద మేధావులు ఎవరూ నోరు మెదపలేదు. కానీ తొమ్మిదేళ్ల తర్వాత జరిగిన పరిశీలనలో సేన్ విశ్వసనీయత, ఉద్దేశాలు ప్రశ్నార్థకంగా తేలాయి, 2010–16 మధ్య ఆయన ఖర్చులను, వ్యవహారాలను కాగ్ పట్టి చూపింది, డా॥కలాం ఆయన వ్యవహారశైలిని విమర్శించారు. మొత్తం మీద ఈ వివాదాలన్నీ సమసి, ఎట్టకేలకు ప్రాణం పోసుకున్న తర్వాత ప్రధాని దానిని అధికారికంగా ప్రారంభించారు.

**నెట్ జీరో క్యాంపస్‌గా నలంద**

ప్రధాని మోదీ ప్రారంభించిన నూతన నలంద విశ్వవిద్యాలయ ప్రాంగణం ప్రాచీన శిల్పకళాశైలి వారసత్వ, ఆధునిక నిలకడైన పద్ధతుల మిశ్రమం. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో 455 ఎకరాల భూమిలో ఉన్న ఈ క్యాంపస్ కర్బన తటస్థత, సున్నా వ్యర్థాలను సాధించేందుకు 'నెట్–జీరో' విధానాన్ని అవలంబిస్తోంది. ఇందులో భాగంగా ఇక్కడ 6.5 మెగావాట్ల సోలార్ ఫార్మ్, 1.5 మెగావాట్ల బయో గ్యాస్ కేంద్రంతో పాటుగా 100 ఎకరాలలో జలాశయాలు, చెరువులతో పాటు, 300 ఎకరాలలో హరిత ఆవరణను సృష్టించేందుకు ఉద్దేశించారు.

నూతన విశ్వవిద్యాలయ రూపకల్పన ప్రాచీన భారతంలో ప్రముఖమైన అధ్యయన కేంద్రంగా వర్ధిల్లిన ప్రాచీన నలందా విశ్వవిద్యాలయానికి నివాళులర్పిస్తుంది. ఇక్కడ మౌలిక సదుపాయాలు సంప్రదాయ ఇటుకలకు బదులుగా కంప్రెస్డ్ స్టెబిలైజ్డ్ ఎర్త్ బ్లాక్స్ (సిఎస్ఇబి)ని ఉపయోగించడం ద్వారా నిలకడైన పర్యావరణానికి దోహదం చేశారు.

సమర్ధవంతమైన నీటి నిర్వహణ విధానాలు, వికేంద్రీకృత వ్యర్థాల శుద్ధి వ్యవస్థలు దాని పర్యావరణ అనుకూల చర్యలను మరింత వృద్ధి చేస్తున్నాయి.

**– జాగృతి డెస్క్**



# ఎవరు?

దారులు కొల్లగొట్టారు. వేల సంఖ్యలో బౌద్ధ సన్యాసులు నేపాల్, టిబెట్, భారతదేశం వెలుపల ఇతర ప్రాంతాలకు పారిపోయారు. చాలా పెద్ద సంఖ్యలో పూజారులు ముస్లిం సేనానుల చేతులలో హతమయ్యారు. ఇస్లామిక్ ఆక్రమణదారులు బౌద్ధ భిక్షువుల మీద సాగించిన ఊచకోత అలాంటిది. ఇస్లాం బౌద్ధ మతాచార్యులను చంపడం ద్వారా బౌద్ధమతాన్ని చంపింది. భారతదేశంలో బౌద్ధానికి సంభవించిన అతి పెద్ద విపత్తు ఇది. పురోహిత వర్గం లేకుంటే మతం అంతరించి పోవాలి. ఇస్లాం ఖడ్గం పురోహిత వర్గంపై ఎక్కువగా పడింది. అలా బౌద్ధం నశించింది లేదా భారతదేశం వెలుపలకు పారిపోయింది.

బౌద్ధమత జ్వాల రగిలించడానికి ఎవరూ మిగలలేదు. (First Edition by Education Depart ment, Govt. of Maharashtra : 4 October, 2003 Re-printed by Dr. Ambedkar Foundation : January, 2014)

నలంద చరిత్ర వక్రీకరణ మన తరం ముందే యథేచ్ఛగా సాగిపోతోంది. ఖిల్జీ చేసిన నేరాన్ని బ్రాహ్మణులపై నెడుతున్నారు. అల్ప సంఖ్యాకులను ప్రసన్నం చేసుకోవడానికి లౌకికవాద పరిరక్షణ మాటున కొన్ని రోజుల తర్వాత వామపక్ష చరిత్రకారులు అఫ్ఘానిస్తాన్‌లోని బమియాన్, పాకిస్తాన్‌లోని స్వాత్ లోయలో వేలాది బుద్ధ విగ్రహాలను ధ్వంసం చేయడం వెనుక, ధార్మికస్థలాల మీద జరుగుతున్న దాడుల వెనుక ఉన్నది తాలిబాన్, ఇస్లామిక్ ఛాందసవాదులు కాదనీ, బ్రాహ్మణులే అనీ రుజువు చేయడానికి ప్రయత్నించినా ఆశ్చర్యపోనక్కరలేదు.

ఇప్పుడు సమస్య నలంద చరిత్ర కాదు. వామపక్ష చరిత్రకారులు రాసిన అవాస్తవ చరితను తొలగించి లేదా వాస్తవ చరిత్రను దేశానికి అందించే ప్రయత్నం ఎంతవరకు జరిగింది అనేది. ఇందులో గత 10 సంవత్సరాలలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయమెంత? వామపక్ష చరిత్రకారులు చాపకింద నీరులా తమ పని తాము చేసుకొంటూ ఉంటే ప్రభుత్వానికి సంబంధించిన కొంతమంది సోకాల్డ్ మేధావులు మాత్రం పైరవీలు చేసుకొంటూ తమకేమి వస్తోంది, ప్రమోషన్ వస్తుందా లేదా, అపాయింట్‌మెంట్ అవుతుందా లేదా ఇవే విషయాలతో కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని విద్యారంగంలో పని చేయాల్సిన అవసరం ఉంది.

**– గుగులోత్ కృష్ణబాబు నాయక్**
**8522849697**

# నలంద విధ్వంసకుడికి తగిన శిక్ష!


భరతవర్షంలో ధర్మపరిరక్షణార్థం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. మేధావులుగా చెప్పుకునేవారు, చరిత్రకారులు ఇటువంటి ధర్మదీక్షాపరుల వీరోచిత గాథలను చరిత్ర పుటలనుంచి సమూలంగా తుడిచివేసినా, జానపద కథలరూపంలో సజీవంగా ఉండటం విశేషం. అటువంటి వారిలో కామరూప (నేటి అస్సాం) పాలకుడు మహారాజ పృథు ఉన్నారు. విదేశీ రాక్షస మూకలను అడ్డుకొని, ధర్మపరిరక్షణ కోసం త్యాగం చేశారు.

భక్తియార్ ఖిల్జీపై మహారాజ పృథు సాధించిన విజయానికి సంబంధించి 818వ వార్షికోత్సవాన్ని మార్చి 28,2024న జరుపుకున్నారు.

మధ్యయుగాల్లో కామరూపను పాల వంశీకులు పాలించారు. క్రీ.శ.12వ శతాబ్దపు చివరి రోజుల్లో కామరూప చరిత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. ఇందుకు ప్రధానకారణం మహారాజ పృథు. పర్షియన్ గ్రంథం తబాకత్-ఇ-నస్రీలో ఈయన పేరు 'బార్తు' అని పేర్కొనడం గమనార్హం. ఈ గ్రంథ రచయిత మిన్హజ్ సిరాజ్ అల్ దిన్. ఇందులో నలంద, విక్రమ శిల విశ్వవిద్యాలయాల విధ్వంసానికి కారకుడైన భక్తియార్ ఖిల్జీ కామరూపపై దాడికి సంబంధించిన సంఘటనలు విస్తృతంగా వివరించారు.

కామరూపపై దాడికి ముందు భక్తియార్ ఖిల్జీ, అతని తురుష్క సైన్యం బెంగాల్, బీహార్‌లలో భయంకరమైన హింసాకాండకు పాల్పడింది. నాటి కాలంలో ప్రసిద్ధ విద్యాకేంద్రాలుగా విలసిల్లిన ఓదాంతపురి, విక్రమశిల, నలంద విశ్వవిద్యాలయాలను భక్తియార్‌ఖిల్జీ నేతృత్వంలోని సైన్యం క్షమార్హం కాని రీతిలో ధ్వంసం చేసింది. వేలాదిమంది బౌద్ధ సన్యాసులను హతమార్చింది. నలంద విశ్వవిద్యాలయాన్ని తగులబెట్టడంతో వేలు, లక్షల్లో ఉన్న రాతప్రతులు, గ్రంథాలు కాలి బూడిదై పోయాయి. ఆ గ్రంథాలు పూర్తిగా తగులబడిపోవ డానికి మూడు నెలలు పట్టిందట! ఈ పాపం ఊరికే పోలేదు.

కామరూపపై దాడి చేసినప్పుడు మొత్తం తురుష్క సైన్యాన్ని మహారాజ పృథు సైన్యం తుడిచిపెట్టేసింది. భక్తియార్‌ఖిల్జీ ప్రాణాలు అరచేత పట్టుకొని బ్రహ్మపుత్ర నదిలో దూకి ఈదుకుంటూ పారిపోయి ఉత్తర గౌహతి ప్రాంతంలోని మదన కామదేవ మందిరంలో దాక్కుంటాడు. హిందూరాజైన పృథు దేవాలయంపై దాడిచేయడని అతని నమ్మకం. అయితే పృథు దేవాలయం చుట్టూ వెదురు కర్రలతో గట్టి కంచె ఏర్పాటుచేసి ఖిల్జీని బయటకు రాకుండా చేస్తాడు. చివరకు ఉన్న కొద్దిమంది అనుచరులతో ఏదోవిధంగా ఈ కంచెగుండా దారిచేసుకొని బ్రహ్మపుత్రలో దూకి ఈదుకుంటూ బతుకుజీవుడా అని పారిపోతాడు. చివరకు కేవలం కొద్ది వందల మంది సైన్యంతో కూచ్‌బీహార్‌కు చేరుకున్నాడు. ఈ పరాజయంతో భక్తియార్ భారత్‌ను జయించాలన్న ఆలోచన విరమించుకున్నాడు. తర్వాతి కాలంలో అతని సైనిక జనరల్ అలీ మర్దాన్ చేతిలో హత్యకు గురవుతాడు. ఈవిధంగా ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాల విధ్వంసకుడికి తగిన శిక్ష పడింది. ఈ ఉదంతం జరిగింది క్రీ.శ.1206లో!




విచిత్రమేమంటే ఉత్తర గౌహతి ప్రాంతంలోని 'కన్హయ్ బొరోక్సీ బోవా గ్జిల్' రాతిశాసనంలో రెండు లైన్ల సంస్కృత శాసనంలో ఈ అంశం పేర్కొని ఉండటం విశేషం. "శక సంవత్సరం 1127, వసంత రుతువు 13వ రోజున కామరూపపై దాడి చేసిన తురుష్కులు తుడిచిపెట్టుకు పోయారు" అని దీని అర్థం! దారుణమైన అంశమేమంటే ఈ చరిత్ర మన పాఠ్యపుస్తకాల్లో ఎక్కడా స్థానం సంపాదించకపోవడం! బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో అత్యంత దారుణ హింసాకాండకు, హత్యాకాండకు కారకుడైన భక్తియార్ ఖిల్జీ ఉదంతం మన పాఠ్యపుస్తకాల్లో మచ్చుకైనా కనిపించదు. కాకపోతే ఇది అస్సాం రాష్ట్రవాసులకు మాత్రమే తెలిసిన స్థానిక చరిత్రగా మిగిలిపోయింది.

మహారాజ పృథు అసలు పేరు విశ్వసుందర దేవుడు. ఈయన క్రీ.శ. 1185 నుంచి 1228 మధ్య కాలంలో కామరూపను పరిపాలించాడు. ప్రముఖ చరిత్రకారుడు చటర్జీ ప్రకారం ఈయన కాలంలోనే కామరూపపై రెండుసార్లు అంటే 1206, 1227 సంవత్సరాల్లో ముస్లింల దాడులు జరిగాయి. ఈ రెండు దాడులను పృథు సమర్థంగా తిప్పికొట్ట గలిగాడు. మూడవసారి అంటే 1228లో నాటి ఢిల్లీ పాలకుడు ఇల్‌టుట్‌మష్ కుమారుడు, బెంగాల్ గవర్నర్ నసిరుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం సైన్యాలు కామరూపపై దాడులు చేసాయి. ఈ యుద్ధంలో పృథు ఓటమి పాలైనా ఈ విజయం నసిరుద్దీన్‌కు అంత తేలిగ్గా లభించలేదు. రెండువైపులా భారీ నష్టం సంభవించింది. అంతేకాదు గెలిచినా ఆ తర్వాతి కాలంలో నసిరుద్దీన్ మళ్లీ కామరూపపై కన్నేయలేదు. ఓడినప్పటికీ పృథు అంతటి భయాన్ని సృష్టించగలిగాడు. అంతేకాదు నసిరుద్దీన్ ఎదుట లొంగిపోవడానికి ఇష్టపడక, 'మహారా జర్ దిఘి' అనే ఒక చెరువులో తన అంగరక్షకులతో సహా దూకి ఆత్మహత్య చేసుకుంటాడు. ప్రస్తుతం ఇది బంగ్లాదేశ్‌లోని రంగ్‌పూర్ ఉంది. కామరూపను ఒకప్పటి ప్రాగ్జోతిష రాజ్యంగా రంగ్‌పూర్ జిల్లా గెజిట్స్‌లో పేర్కొన్నారు.

జల్పాయ్ గురి, టిటాల్యా రోడ్డుకు దక్షిణాన వున్న భితార్‌గఢ్ (రామ్‌పర్త్ నగరం)లో రాజా పృథు రాజధాని శిథిలాలు ఇప్పటికీ కనిపిస్తాయి. బ్రిటిష్ అన్వేషకుడు బుఛానన్ హామిల్టన్ ఈ భితార్‌గఢ్‌పై విస్తృత పరిశోధనలు చేశాడు. ముఖ్యంగా మహారాజ పృథు రాజభవనం గురించి విపులంగా వర్ణించాడు.

విచిత్రమేమంటే నలంద విశ్వవిద్యాలయాన్ని తగులబెట్టింది భక్తియార్ ఖిల్జీ కాదని, అసలు అతను నలంద వైపునకు వెళ్లినట్టు తబాకత్-ఇ-నస్రీలో పేర్కొనలేదని రాంపునయిని వంటి రచయితల వాదన! ముఖ్యంగా డాక్టర్ డి.ఎన్. ఝా రచించిన "హిస్టరీ ఆఫ్ బుద్ధిజం ఇన్ ఇండియా" పుస్తకంలో పేర్కొన్నట్టుగా కొన్ని సంఘటనలు ఉటంకిస్తున్నారు. డాక్టర్ పాటిల్ రాసిన దాని ప్రకారం ఇది కేవలం బ్రాహ్మణికులు, బౌద్ధుల మధ్య సంఘర్షణ.

ఈ వాదనల్లో నిజానిజాలెలా ఉన్నా, మధ్య యుగాల్లోని ముస్లింల దాడుల్లో ధ్వంసమైంది, దోపిడీకి గురైంది హిందువుల దేవాలయాలు, హత్యాకాండకు గురైంది హిందువులే! ఒకరకంగా మధ్యయుగాల్లో విదేశాల నుంచి దాడులు చేసిన మత ఛాందసవాదులు భారత్‌లో రక్తపాతం సృష్టించారన్నది చరిత్రలో ఎంత దాచినా దాగని సత్యం!

వసుధైక కుటుంబకం అని బోధించే సాత్విక హిందూమతం దారుణమైన హింసాకాండను చవిచూసిన కాలం ఇది! ఏదో ఒకటి అర సంఘటనలను వాదనా పటిమతో సమర్థించుకోవడం వల్ల, శిథిల చరిత్ర చెబుతున్న అక్షరసత్యాలు ఎంత దాచినా దాగవు! ★



# మత స్వేచ్ఛలనడ్డం పెట్టుకొని అమెరికా విమర్శలు-భారత్ ఖండన

తాము ఎంతగా ఎన్నికలలో జోక్యం చేసుకున్నా భారత్‌లో తిరిగి ప్రధాని మోదీ ప్రభుత్వం రావడం అమెరికాకు మింగుడుపడడం లేదనేందుకు తాజా ఉదాహరణే అమెరికా విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకన్ ఇటీవల చేసిన వాఖ్యలు. తమ అధ్యక్షుడు బైబిల్‌పై మాత్రమే ప్రమాణం చేసి మరీ అధికారాన్ని చేపట్టిన పర్వాలేదు కానీ, ప్రపంచంలోనే బహుళత్వానికి ప్రతీకగా నిలిచిన భారత్‌లో మాత్రం తమ మార్కు సెక్యులరిజమే నడవాలన్నది పెద్దన్న అమెరికా ఆకాంక్షలా కనిపిస్తోంది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఇటీవలే 'అంతర్జాతీయ మత స్వేచ్ఛలపై నివేదిక' (ఐఆర్ఎస్ఆర్)ను విడుదల చేసింది. ఇంకేముంది దాన్నడ్డుపెట్టుకొని, భారత్ ముస్లిం, క్రైస్తవ మైనార్టీలపై హిందూ జాతీయవాద ప్రభుత్వమైన బీజేపీ , దాని మిత్రపక్షాలు, అధికారులు మతమార్పిడి వ్యతిరేక చట్టాలు, ద్వేషపూరిత ఉపన్యాసాలు, మైనార్టీ మతాలవారి ఇళ్లను, ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేస్తున్నారని, ఇది తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నాయని బ్లింకన్ శలవిచ్చారు. నిజానికి యుఎస్‌సిఐఆర్ఎఫ్ 2020ల నుంచే భారతదేశాన్ని కంట్రీ ఆఫ్ పర్టిక్యులర్ కన్సర్న్ (సిపిసి) హోదాను ఇప్పించాలని ప్రయత్నించి విఫలమవుతూనే ఉన్న విషయాన్ని ప్రస్తావించడం అవసరం.

అయితే, గతంలోలానే ఈ నివేదిక తీవ్రమైన పక్షపాత వైఖరి, భారతీయ సామాజిక అల్లికపై అవగాహనా లేమితోనే కాక, ఓటుబ్యాంకును ఎలా పరిగణనలోకి తీసుకోవాలో నిర్దేశించేందుకు ఉద్దేశించిన దానిలా ఉందని, కనుక దానిని తాము తిరస్కరిస్తున్నామని ఈసారి భారతదేశం ఘాటుగా స్పందించింది. అంతేకాదు, ఇది ఆరోపణలు, తప్పుడు ప్రాతినిధ్యాలు, ఎంపిక చేసి ఉపయో గించిన వాస్తవాలను కలిపి వండిన నివేదిక అంటూ తిప్పికొట్టింది. వీటన్నింటినీ మించి యుఎస్ విదేశాంగ శాఖ పక్షపాతపూరిత సూత్రాలపై ఆధారపడ్డారని, విషయాలను ఏకపక్ష కోణంలోనే నివేదిక చూపిందని ఆరోపించింది. "ఇది మన రాజ్యాంగ నిబంధనలు, భారతదేశం యథోచితంగా రూపొందించిన చట్టాల చిత్రణ వరకు కూడా విస్తరించింది. ఇది ముందస్తుగా రూపొందించిన కథనాన్ని కూడా ముందుకు తీసుకెళ్లడానికి తగిన సంఘటనలను మాత్రమే ఎంపిక చేసింద"ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణదీప్ జైస్వాల్ విమర్శించారు.

**ఇండియన్ మైనారిటీస్ ఫౌండేషన్ (ఐఎంఎఫ్) ఖండన**

ఇదిలా ఉండగా, భారత్‌పై యుఎస్‌సిఐఆర్ఎఫ్ తీసుకువచ్చిన మత స్వేచ్ఛలకు సంబంధించిన నివేదికను ఇండియన్ మైనారిటీస్ ఫౌండేషన్ తీవ్రంగా ఖండించింది. అఫ్ఘాన్, డిపిఆర్‌కె, రష్యా, చైనా వంటి నిరంకుశ ప్రభుత్వాలతో భారత ప్రభుత్వాన్ని పోల్చి, దేశ ఇమేజ్‌ను వక్రీకరించేందుకు యుఎస్‌సిఐఆర్ఎఫ్ ప్రయత్నిస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. తన పక్షపాతపూరిత వైఖరి కారణంగా యుఎస్‌సిఐఆర్ఎఫ్ భారతదేశ ప్రజాస్వామిక చట్రాన్ని, సజీవమైన పౌర సమాజాన్ని, బహుళత్వాన్ని ఉపేక్షించిందని కూడా ఐఎంఎఫ్ విమర్శించింది.

**యుఎస్‌సిఐఆర్ఎఫ్ లక్ష్యాల వెనుక ఏముంది?**

అసలు యుఎస్‌సిఐఆర్ఎఫ్ సమైక్యతకు పరికరంలా కాకుండా సంఘర్షణలకు మూలంగా పని చేస్తోందనే విషయం మనం దాని కార్యకలాపాలను లోతుగా గమనించినప్పుడు విదితమవుతుంది. ఎన్జీవోల ముసుగులో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేందుకు వీలు లేకుండా విదేశాల నుంచి వస్తున్న సొమ్ము ఎక్కడ నుంచి వస్తోందో, ఎవరికోసం ఖర్చుపెడుతున్నారో చెప్తేనే వారి సంస్థ లైసెన్సు కొనసాగుతుందంటూ భారత ప్రభుత్వం పెట్టిన నిబంధన చాలా సంస్థలనే ఇరుకున పెట్టిందనేది వాస్తవం. ఎస్‌సిఐఆర్ఎఫ్ ఎన్జీవోల స్థానంలో మతాన్ని, మైనార్టీలను జొప్పించి తన అసలు రంగును బయటపెట్టుకుంది.

మణిపూర్‌లో జాతుల మధ్య సంఘర్షణకు మతపరమైన ట్విస్టును ఇవ్వడం ద్వారా మైతీలను హిందువులుగా, కూకీలను క్రైస్తవులుగా మతపరమైన ముద్రవేయడం ద్వారా ప్రమాదకరమైన రేఖను దాటిందని విశ్లేషకుల భావన. నిజానికీ మైతీలలో అనేకమంది క్రైస్తవ నాయకులు ఉన్న విషయాన్ని ఒక నివేదికలో ఇంఫాల్ మీడియా బయటపెట్టింది. దీనితో అక్కడ హింసకు మతపరమైన ఉద్దేశ్యాలను అంటగట్టడం నేరం.

ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఉత్తర అమెరికాకు చెందిన నాయకులు భారత్‌పై చిమ్ముతున్న విషాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం చిత్రమే. ఇందులో ఇటీవలే చోటు చేసుకున్నది, ఇంకా స్మృతి పథంలోంచి తొలిగిపోనిది, ఒక భారతీయ ప్రధానమంత్రి హత్య చేయడాన్ని వేడుకలా జరుపుకోవడం, హింసను గొప్పగా చూపడం. ఈపాటికి అది ఏ దేశంలో జరిగిందో మీకు అర్థమయ్యే ఉంటుంది. ఇక ఖలీస్తానీ ఉద్యమానికి యుఎస్‌సిఐఆర్ఎఫ్ మద్దతు ఎంత ఉందో, అది ఖలీస్తాన్ యాక్టివిస్టులు దేశాంతర అణచివేతకు గురవుతున్నారంటూ అభివర్ణించడం ద్వారానే అవగతమవుతుంది.

యుఎస్‌సిఐఆర్ఎఫ్ మన దేశానికి కంట్రీ ఆఫ్ పర్టిక్యులర్ కన్సర్న్ హోదా ఇప్పించడం కోసం పడరానిపాట్లు పడుతోంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ హోదా ఇచ్చేందుకు అంగీకరించకపోవడం అంటే దాని మాటల్లో ఎంత సత్యముందో దానికి అర్థమైనట్టే కదా? సమాజాలలోని లోపాలను కాక అందులో ఉన్న మంచిని వెతికేందుకు ప్రయత్నించనంత వరకూ యుఎస్‌సిఐఆర్ఎఫ్ నివేదికల విశ్వసనీయత ప్రశ్నార్థకంగానే ఉంటుంది. ★




**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ సాధించామని గర్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీలోనూ భయం నెలకొందా? అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులు రాష్ట్రంలో లేవని ఆ పార్టీ భావిస్తోందా? కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ తెలంగాణలో చాపకింద నీరులా విస్తరిస్తోందని, ఇప్పటికే విస్తరించిందని గుబులు పడుతోందా? ప్రజల్లో పూర్తి స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల అభిప్రాయం లేదని గ్రహించిందా? ఇప్పటి కిప్పుడు ప్రజాక్షేత్రంలోకి వెళ్తే.. కాంగ్రెస్‌కు కాకుండా భారతీయ జనతాపార్టీకే మెజారిటీ ఆదరణ ఉంటుందని డిసైడ్ అయ్యిందా? తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ తీరు ఈ సంశయాలను లేవనెత్తుతోంది. ఆ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అవలంబిస్తున్న తీరు, వ్యవహారశైలిపై వాదనలకు బలం చేకూరుస్తోంది.**

# 'స్థానిక' ఎన్నికలపై

ఇప్పటికే తెలంగాణలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో మగ్గుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత అయినా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావించినా.. అనూహ్య రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలను అటకెక్కించింది. దానికి కులగణన అంటూ ఓ కారణాన్ని వెతుక్కుంది. కులగణన కారణంగానే ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రకటనలు చేసింది.

**ముగిసిన పరిషత్ పాలకవర్గాల పదవీకాలం**

రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల చైర్మన్ల పదవీకాలం జులై 3, 4 తేదీల్లో ముగిసింది. వారి స్థానంలో ప్రత్యేకాధికారుల నియామకం చేపట్టారు. జిల్లా పరిషత్‌లకు జిల్లా కలెక్టర్‌లు, మండలపరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా నియమతులయ్యారు. దీంతో రాష్ట్రంలో గ్రామపంచాయతీల మాదిరిగానే మండల, జిల్లాపరిషత్‌లలోనూ ప్రత్యేకాధికారుల పాలన మొదలయ్యింది. 2019 మే నెలలో 539 జడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అదే ఏడాది జులై మూడో తేదీన మండల పరిషత్‌లకు పాలకవర్గాలు ఏర్పడ్డాయి. జులై నాలుగో తేదీన 28 జిల్లా పరిషత్‌లకు.. ఆగస్టు 7న ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జడ్పీలకు ఛైర్‌పర్సన్లు, వైస్‌ఛైర్‌పర్సన్లు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉందన్న కారణంగా ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసిన ప్రభుత్వం, తాజాగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను, జడ్పీ ఛైర్‌పర్సన్లు, ఎంపీపీల ఎన్నికలను వాయిదావేసి ప్రత్యేకాధికారులను నియమించింది. మండల పరిషత్‌లకు జులై నాలుగో తేదీ నుంచి జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేకాధికారులుగా, ఐదో తేదీన 28 జిల్లా పరిషత్‌లకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. ఆగస్టు 7వ తేదీన ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జడ్పీలకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

**స్పెషల్ ఆఫీసర్ల పాలనలో స్థానిక సంస్థలు**

ఇక గ్రామ పంచాయతీల విషయం చూస్తే.. 2019 జనవరి 21, 25, 30 తేదీలలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2024 జనవరి 30తో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఎన్నికలు 2024 ఫిబ్రవరి మొదటి వారంలో జరగాల్సి ఉండగా ప్రత్యేకాధికారులను నియమించి త్వరలో ఎన్నికలు జరపాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. ఎమ్మార్వో, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి, ఎండీవో, ఎంపీవో తదితర అధికారులు, లేక వీరికి సమానస్థాయి గెజిటెడ్ అధికారిని ప్రత్యేక అధికారులుగా నియమించారు. గ్రామకార్యదర్శితో పాటు వీరికి జాయింట్ చెక్ పవర్ ఇచ్చారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల ఏలుబడిలో పంచాయతీలు నెట్టుకొస్తున్నాయి. అయితే పార్లమెంటు ఎన్నికలు ముగియగానే పంచాయతీ ఎన్నికలకు నగారా మోగుతుందని భావించారు. రాష్ట్రంలోని 12,769 పంచాయతీలకు, రాష్ట్ర మొత్తం మీద 88,682 పంచాయతీ వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ముందుగా అనుకున్నట్లుగా జూన్ మొదటి వారానికి వార్డుల విభజన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. రెండో వారానికి రిజర్వేషన్లు ఖరారు కావాల్సి ఉంది. జూలై మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవ్వాల్సి ఉంది. అనంతరం ఆగస్టు 10వ తేదీలోగా ఎన్నికలు పూర్తయి ఫలితాలు కూడా రావాల్సి ఉంటుందని అందరూ అంచనా వేశారు. కానీ, ఆ ఆనవాళ్లు కూడా ఇప్పటికీ కనిపించడం లేదు. అంటే.. పంచాయతీల ప్రత్యేకాధికారుల పాలనను మరో ఆరు నెలల పాటు పొడిగించడం అనివార్యంగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచుల పదవీకాలం జనవరితో ముగియడంతో ఆ వెంటనే ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. గెజిటెడ్ అధికారులను ఆయా స్థానాల్లో నియమించారు. ఇప్పుడు మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకూ ప్రత్యేక అధికారులు నియమితులు కావడంతో స్థానిక సంస్థల్లో ఇకపై మొత్తం అధికారుల పాలనే సాగనుంది. ప్రత్యేకాధికారుల పాలన ఆరునెలల వరకు నిర్వహించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంది. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో మరో ఆరునెలల పాటు గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన పొడిగించనున్నారు.

**బీసీ కులగణన సాకు మాత్రమే!**

బీసీ కులగణన అంత సులభ సాధ్యం కాదన్న విషయం అందరికీ తెలిసిందే. కులగణన చేపట్ట డానికి చాలా సమయం తీసుకుంటుంది. అలాంటిది కనీసం ప్రతిపాదనలు, మార్గదర్శకాలు, బ్లూప్రింట్ కూడా రెడీ కాలేదు. కానీ, ఇప్పట్లోనే కులగణన పూర్తవుతుందని, అది పూర్తి కాగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలోనే పలు బీసీ సంఘాల నాయకులతో సమావేశం కూడా నిర్వహించింది. సూచనలు, సలహాలు తీసుకుంది. అయితే, ఇదంతా అందరి దృష్టినీ మళ్లించేందుకు చేసిందన్న విశ్లేషణలు సాగుతున్నాయి. ఈ సాకుతో ఎన్నికలను మరింత ఆలస్యం చేసేందుకు వీలు దొరుకుతుందన్న లోగుట్టు ఉందంటున్నారు. ఒకవేళ నిజంగానే ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందంటే... కాంగ్రెస్ అధికారం



# అధికార పక్షం బెరుకు

సుజాత గోపగోని, 6302164068

లోకి వచ్చి ఆరు నెలలు గడిచింది. గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి దాదాపు ఐదు నెలలయ్యింది. ఇప్పుడేమో మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవీ కాలం కూడా ముగిసిపోయింది. అంటే.. పంచాయతీలతో పాటు.. పరిషత్‌లకూ స్పెషల్ ఆఫీసర్ల పాలన అనివార్యంగా మారిపోయింది. ప్రభుత్వం ముందుగానే కులగణనపై దృష్టిపెట్టి, ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తే.. ఇప్పటికే దాదాపు సగం సర్వే పూర్తయి ఉండేదని.. ఇప్పటికే సర్వే పూర్తయి లెక్కలు అందుబాటులోకి వచ్చేవని అంటున్నారు. అంటే.. ఆ సాకుతో మరింత కాలం సాగదీయొచ్చన్న ఆలోచనలో కాంగ్రెస్ సర్కారు ఉండి ఉంటుందన్న చర్చ సాగుతోంది. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పంచాయతీ ఎన్నికలను విధిగా నిర్వహించాలి. సాంకేతిక లేదా రాజకీయపరమైన కారణాలతో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేస్తే కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు నిలిచిపోతాయి. అప్పుడు పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుంది. అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గానీ, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు గానీ ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా కుల గణన చేసేందుకు అసెంబ్లీ తీర్మానం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి కుదించి.. ఆ ప్రకారమే గడిచిన కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. దీన్ని సవాలు చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో, వచ్చే పంచాయతీ ఎన్నికల్లోపు బీసీ రిజర్వేషన్ల లెక్క తేల్చాలని న్యాయస్థానం సూచించింది. దానికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అదే సమయంలో బిసి కులగణన పూర్తి చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని బీసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని అందుకే పాత పద్ధతుల్లోనే రిజర్వేషన్లు అమలు చేస్తే పంచాయతీ ఎన్నికల్లో కూడా బీసీలకు అన్యాయం జరుగుతోందని చెబుతున్నారు. అందుకే ఐదేళ్లకు ఒకసారి వచ్చే పంచాయతీ ఎన్నికలను కొంతకాలం వాయిదా వేసి.. బీసీ జనాభా లెక్కలు తేలిన తర్వాత జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు పంచాయతీలో బీసీలకు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. కానీ, బీసీల కులగణన త్వరగా తేల్చే అంశం కాదు. 52 శాతానికి మించి రాష్ట్రంలో బీసీ జనాభా ఉంది. దీంతో బీసీల లెక్క తెలడానికి ఎక్కువ సమయం బట్టే అవకాశాలు ఉన్నాయి.

**అసలు కారణం అదే...**

పై కారణాలతో బీసీ రిజర్వేషన్ల అంశంతో ఎన్నికలు ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం చెబుతుండగా.. రాష్ట్ర ప్రభుత్వం కులగణన అనంతరం ఈ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. ఈ ఆగస్టుతో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం కూడా ముగియనుంది. దీంతో, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసుకునే బీసీ కమిషన్ ద్వారానే ఈ లోకల్‌బాడీస్ ఎన్నికల కార్యాచరణను నిర్వహించాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్న చర్చ జరుగుతోంది. ఆగస్టులో బీసీ కమిషన్‌కు కొత్త పాలకమండలిని నియమించి కులగణన చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ దశలో ప్రకటించారు. దీనిని బట్టి ఆగస్ట్‌లో కొత్తగా బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించాక... బీసీ జనగణనకు సంబంధించిన కార్యక్రమం చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు.. క్షేత్రస్థాయిలో అప్పటివరకు బీజేపీకి ఆదరణ తగ్గిపోయే అవకాశం ఉంటుందని.. అప్పుడే ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్‌కు కాస్త ప్రయోజనకరంగా ఉంటుందన్న ఆలోచనలో సర్కారు ఉంటుందంటున్నారు. అంతేకాదు.. కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన మరికొన్ని హామీల కార్యాచరణ కూడా అప్పటివరకు మొదలుపెట్టవచ్చని, జనంలో అధికార పార్టీకి అనుకూల వాతావరణం నెలకొంటుందని రేవంత్‌రెడ్డి ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీనిని బట్టి ఈ ఎన్నికలు ఏడాది చివరి వరకు వెళ్లొచ్చుననే ఊహాగానాలు సాగుతున్నాయి. దీంతో ఏ ఎన్నికలు ముందు జరుగుతాయి? ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలుంటాయా? లేక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎలక్షన్లు మొదట నిర్వహిస్తారా? లేక ఈ ఏడాది చివర్లో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకటి తర్వాత మరొకటి వరుసగా నిర్వహిస్తారా? అన్న చర్చ జరుగుతుంది. ఏదేమైనా ప్రస్తుతం నెలకొన్న పరిణామాలను గమనిస్తే.. డిసెంబరు వరకు ఆ ప్రక్రియ కొనసాగే వీలుంది. అంతవరకు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగవు. మరోవైపు.. మండల, జిల్లా పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల పాలన మొదలు కాగా.. వాటికి డిసెంబరు వరకు గడువు ఉంటుంది. అప్పటికి ఎన్నికలు జరిగితే 2025 నుంచి కొత్త పాలకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

**రాష్ట్ర ప్రభుత్వం కులగణన అనంతరం ఈ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. ఈ ఆగస్టుతో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం కూడా ముగియనుంది. దీంతో, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసుకునే బీసీ కమిషన్ ద్వారానే ఈ లోకల్‌బాడీస్ ఎన్నికల కార్యాచరణను నిర్వహించాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్న చర్చ జరుగుతోంది.**

# దక్షిణాదిన పట్టు పెంచు

‘ఉత్తరాదికి చెందిన భారతీయ జనతా పార్టీ బలం దక్షిణాదిన నామమాత్రమే. హిందీ బెల్టు రాష్ట్రాల్లో ఆధిపత్యం చెలాయించే బీజేపీకి ఇక్కడ ఉనికే లేదు…’ అంటూ విపక్షాలు, మేధావులుగా చెప్పుకునే రాజకీయ విశ్లేషకులు నిత్యం చేసే వ్యాఖ్యలు తప్పని 2024 దేశ సార్వత్రిక ఎన్నికలు నిరూపించాయి. ఈ ఎన్నికల్లో దక్షిణ భారత దేశంలోని ఐదు రాష్ట్రాల్లో బీజేపీ గణనీయమైన ఫలితాలను సాధించింది. ఎన్నికలకు ముందు నుంచి ‘ఇండీ’ నేతలు రెచ్చిపోయి ‘ఉత్తర’, ‘దక్షిణ’ భూతాలను మేల్కొల్పాలని తీవ్రంగా ప్రయత్నించిన నేపథ్యంలో జరిగిన పరిణామమిది.



నరేంద్ర మోదీని ఎదుర్కోలేమనే ‘ఇండీ’ కూటమి నేతలు బీజేపీని దక్షిణాదిన అడ్డుకుంటే ఎన్డీఏను కేంద్రంలో అధికారానికి దూరం చేయవచ్చనే ఆలోచనలతో ఎన్నికలకు ముందే ప్రణాళికలు రూపొందించారు. మోదీ ప్రభుత్వంలో దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, వివక్ష చూపిస్తున్నారని ఆరోపణలు చేశారు. వీటికి సమాధానంగా కేంద్ర ప్రభుత్వం రైల్వే, జాతీయ రహదారుల కల్పనలో దేశ వ్యాప్తంగా ఒకే విధంగా అభివృద్ధి చేయడం, సంస్థల ఏర్పాటులో, అన్ని రాష్ట్రాలకు రావాల్సిన కేంద్ర నిధుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించిన తీరును లెక్కలతో సహా నిరూపించడంతో ప్రతిపక్షాలు తమ బాణీని మార్చాయి.

**మైనార్టీ ఓట్లే లక్ష్యంగా ‘ఇండీ’ కూటమి**

మరొకవైపు ద్రవిడవాదంతో తమిళనాడు డీఎంకే ప్రధాన నేతలు సనాతన ధర్మంపై విషం కక్కుతూ తలాతోక లేని వాదనలు చేశారు. కేరళ వామపక్ష ప్రభుత్వం రాష్ట్రంలో సంఘ్ పరివార్, ఇతర హిందూ సంస్థల, బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగినా చూసీచూడనట్టు వ్యవహరించింది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై మతపరమైన దాడులు జరుగుతున్నా పట్టించుకోలేదు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఎంఐఎం అధినేత ఓవైసీ ప్రాపకం కోసం పాకులాడింది. ఈ రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు కొంచెం భిన్నం. ఇక్కడ వైసీపీ ప్రభుత్వం అన్యమతస్తుల ఆగడాలను అడ్డుకోకుండా చోద్యం చూసింది. రాష్ట్రంలో బలమైన హిందూ సంఘాలున్నా అవి కలిసికట్టుగా సంఘటితంగా లేకపోవడం ఇక్కడ బలహీనత.

భారత దక్షిణ భాగంలోని ఐదు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు గట్టి సవాలు విసిరినా బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించిందని గణాంకాలు నిరూపిస్తున్నాయి. దక్షిణాదిన 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ 29 స్థానాలే గెలిచింది. గత ఎన్నికల కంటే ఇప్పుడు ఒక్క సీటు కూడా అదనంగా గెలవని బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించిందని చెప్పడానికి ప్రధాన కారణం ఆ పార్టీ ఐదు రాష్ట్రాల్లోనూ గణనీయంగా ఓట్ల శాతాన్ని పెంచుకొని పార్టీ పునాదులను పటిష్ట పర్చుకుంది. పార్టీకి ఉనికే లేదని విమర్శలు ఎదుర్కొన్న కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీలకు ముచ్చెమటలు పట్టించింది.

**మర్రి వృక్షం నీడ నుండి బయటకు**

39 స్థానాలున్న తమిళనాడులో బీజేపీకి 2024 ఎన్నికలు ప్రత్యేకమైనవి. 2019 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీజేపీ గెలవలేదు. ఈసారి రిక్తహస్తమే ఎదురయినా పార్టీ గణనీయంగా పుంజుకుంది. జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు ఇక్కడ గెలవాలంటే ఈ రెండింటిలో ఏదో ఒక పార్టీ చెంతన చేరాలి. రాష్ట్రంలో డీఎంకే, అన్నాడీఎంకే మర్రి వృక్షాలు. ఈ నేపథ్యంలో గతంలో అన్నాడీఎంకేతో జతకట్టిన బీజేపీ ఇప్పుడు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో చిన్నపార్టీలను కలుపుకొని సొంతంగా పోటీ చేసింది. అన్నామలై రాష్ట్ర చీఫ్‌గా బీజేపీ ఈ ఎన్నికల్లో డీఎంకెకు ముచ్చెమటలు పట్టించింది.

2019 లోకసభలో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేసిన బీజేపీ 3.6 శాతం, 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 3 శాతం లోపే ఓట్లను పొంది, 2024లో సొంతంగా 11 శాతానికి పైగా ఓట్లను సాధించింది. మొత్తం ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో 18 శాతానికి పైగా ఓట్లను పొందింది. పొత్తులో భాగంగా 23 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 9 స్థానాల్లో రెండో స్థానంలో నిలవడం గొప్పే.

**కర్ణాటకలో ముప్పేట దాడి**

కర్ణాటకలో 28 స్థానాలకు గాను బీజేపీ అత్యధిక సీట్లలో గెలిచింది. సంవత్సరం క్రితం జరిగిన ఎన్నికల్లో 38 శాతం ఓట్లనే సాధించిన బీజేపీ 2024లో 46 శాతం ఓట్లు పొందింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ రాష్ట్రంలో 13 శాతానికి పైగా ఉన్న ముస్లిం ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడింది. రాష్ట్రంలో పలు హిందూ సంస్థలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోలేదు. హనుమాన్ చాలీసా పారాయణ పెట్టుకున్న వారిపై దాడి చేసిన వారిని వదిలేసి బాధితులనే ఇబ్బంది పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం. సున్నితమైన అంశాలతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టింది కాంగ్రెస్. ఐదు గ్యారెంటీల హామీలతో గద్దె ఎక్కిన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దిగజారినా ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వాటిని అమలు చేస్తున్నట్టు ప్రజల్లో భ్రమలు కలిగిస్తూ జనాకర్షణ పథకాలతో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నించింది. కనీసం 15–20 స్థానాల్లో గెలవాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేసినా, బీజేపీ పరిస్థితులకు ఎదురీదుతూ 17 స్థానాల్లో గెలిచింది. దాని మిత్రపక్షం జేడీ(ఎస్) మరో రెండు స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ 9 స్థానాలతో సరిపెట్టుకుంది. 2019 ఎన్నికల్లో 51 శాతం ఓట్లతో 25 స్థానాలు పొందిన బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడానికి స్వయం ప్రకటిత మేధావులకు పలు ఎన్జీఓలు చాపకింద నీరులా పనిచేయడంతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నష్టపోయింది. ఈ ముప్పేట దాడులను దృష్టిలో పెట్టుకొని బీజేపీ ఈసారి జేడీ(ఎస్)తో పొత్తు పెట్టుకొని కాంగ్రెస్ సర్కారుకు గట్టి సవాలు విసిరి విజయం సాధించింది.

**దేవభూమిలో బలపడిన బీజేపీ**

దేవభూమిగా పిలిచే కేరళ బీజేపీకి, సంఘ్ పరివార్‌కు మొదటి నుండి కొరకరాని కొయ్య. రాష్ట్రంలో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు నిర్ణయాత్మకంగా ఉండడంతో బుజ్జగింపు రాజకీయాలతో ఇక్కడ

వామపక్షాలు, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటముల ఆధిపత్యమే కొనసాగుతూ వచ్చింది. రాష్ట్రంలో 2011 అధికారిక జనాభా లెక్కల ప్రకారమే హిందువులు సుమారు 54 శాతంకు పైగా, ముస్లింలు 26 శాతంకు పైగా, క్రిస్టియన్లు 18 శాతంకు పైగా ఉన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో అనధికారికంగా ప్రస్తుతం మైనార్టీల సంఖ్య హిందూ జనాభాను దాటిపోయి ఉండచ్చు. హిందూ ఓట్ల బదులు గంపగుత్తగా మైనార్టీల ఓట్లు సాధిస్తే అధికారం ఖాయమనే వైఖరితో కాంగ్రెస్/యూడీఎఫ్, వామపక్ష/ఎల్‌డీఎఫ్ హిందువులపై వివక్షను చూపిస్తూ




# కున్న బీజేపీ

పాలించసాగాయి.

రాష్ట్రంలో మైనార్టీల రాజకీయ ప్రభావం ఎంతో చెప్పుకోవాలంటే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పోటీ చేసిన వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గమే పెద్ద ఉదాహరణ. ఇక్కడ ముస్లింలు 41 శాతం, క్రిస్టియన్లు 13 శాతం ఉండడంతో ఇది సురక్షిత స్థానమని భావించిన రాహుల్ పోటీ చేసి గెలిచారు. నియోజకవర్గంలో ముస్లిం సంఘాల ఆధిపత్యం ఎంత ఉంటుందంటే స్వయాన రాహుల్ పాల్గొన్న పార్టీ రోడ్ షోలో కాంగ్రెస్ జెండాలు ఎగరేయడానికి కూడా ఆ పార్టీకి మద్దతిచ్చిన ముస్లిం సంఘాలు అనుమతించలేదు.

యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ కూటముల్లో ఎవరు అధికారంలో ఉన్నా హిందూ సంఘాలపై దాడులు నిత్యం జరగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడమే మానేశాయి. అంతేకాక హిందువులంటే వివక్ష చూపే ఎల్‌డీఎఫ్ సర్కార్ హయాంలో హిందువుల ఆరాధ్య దైవమైన శబరిమలలై అయ్యప్పస్వామి దేవాలయం పుణ్యక్షేత్రాన్ని వివాదాస్పదం చేశారు. కమ్యూనిస్టు ప్రభుత్వ వైఖరిని ఆర్‌ఎస్‌ఎస్‌తో సహా పలు హిందూ సంఘాలు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో అక్కడ నిత్యం యుద్ధమే. ఎంత మంది హిందూ సంఘాల కార్యకర్తలు బలిదానాలు చేశారో లెక్కేలేదు. ఇంతటి ఘర్షణ వాతావరణం మధ్య మొదటిసారి కేరళలో బీజేపీకి సంతోషకరమైన పరిణామాలు ఏర్పడ్డాయి.

2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 19 శాతం ఓట్లు సాధించిన బీజేపీ త్రిశూర్‌లో 74 వేలకు పైగా మెజార్టీతో గెలిచింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 13 శాతం, 2016 అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతం, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 12 శాతం ఓట్లు పొందిన బీజేపీ నేటి అననుకూల వాతావరణంలోనూ 2024లో 19 శాతంకు పైగా ఓట్లు పొందడం సాధారణ విషయం కాదు. 2019లో తిరువనంత పురంలో రెండో స్థానంలో నిలిచిన బీజేపీ ఇక్కడ 2024లో చివరి నిమిషం వరకు పోరాడి ఓడి పోయింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పట్టిన్‌మిట్ట, కన్నూర్ నియోజకవర్గాల్లో బీజేపీ మూడో స్థానంలో నిలిచింది. మొత్తంమీద 2024 ఎన్నికల ఫలితాలతో కేరళలో బీజేపీ కూడా ప్రధాన పార్టీలలో ఒకటిగా అవతరించిందని చెప్పవచ్చు.

**ఆంధ్రప్రదేశ్‌లో సత్ఫలితాలు**

ఆంధ్రప్రదేశ్‌లో 2019 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నోటాతో పోటీపడి ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న బీజేపీ ఈసారి టీడీపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకొని సత్ఫలితాలను పొందింది. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన బీజేపీ మొత్తం 25 స్థానాల్లో పోటీ చేసి కనీసం ఒక్క శాతం ఓట్లు, ఒక్క ఎంపీ స్థానం కూడా పొందలేదు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 2024 ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్న బీజేపీ 6 పార్లమెంట్ నియోజక వర్గాల్లో పోటీ చేసి 11 శాతం పైగా ఓట్లతో అనకాపల్లి, రాజమండ్రి, నర్సాపురం స్థానాల్లో గెలిచింది.

**తెలంగాణలో రెట్టింపు స్థానాలు**

తెలంగాణలో 2014లో టీడీపీతో పొత్తు పెట్టుకున్న బీజేపీ అనంతరం ఒంటరి పోరుకు ప్రాధాన్యతనిచ్చి ప్రతి ఎన్నికల్లో బలాన్ని పెంచు కుంటూ వచ్చింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 6 శాతం ఓట్లతో ఒక్క సీటే గెలిచిన బీజేపీ, ఐదు నెలల వ్యవధిలో జరిగిన 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 19 శాతం ఓట్లతో 4 స్థానాల్లో గెలిచింది. తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలలో ఎవరూ ఊహించని



**డా॥ ఐ.వి.మురళీ కృష్ణ శర్మ**
9949372280

విధంగా గణనీయమైన సీట్లు సాధించి, హుజురాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సంస్థాగత సమస్యలతో 13 శాతం ఓట్లతో 8 స్థానాలకే పరిమితమైంది. ఆరు నెలల వ్యవధిలో జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో 35 శాతం ఓట్లతో 8 స్థానాల్లో గెలిచింది. బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినా గల్లీలో ఎవరున్నా, ఢిల్లీలో మోదీయే ఉండాలనే లక్ష్యంతో ప్రజలు తీర్పు ఇచ్చారు.

తెలంగాణలో రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో భంగపడిన బీజేపీకి రెండు పార్లమెంట్ ఎన్నికల్లోనూ సానుకూల ఫలితాలు రావడం గురించి కొందరు ప్రశ్నలు లేవనెత్తారు. మోదీ చరిష్మాతో పాటు, జాతీయ అంశాల ఆధారంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందనే వాదనలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు పొందిన బీజేపీకి ఇప్పుడు బీఆర్ఎస్ బలహీనపడడం ఒక సదావకాశం. 8 స్థానాల్లో గెలిచిన పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే 56 అసెంబ్లీ సెగ్మెంట్లలో కూడా పార్టీ బలోపేతానికి సంబంధిత ఎంపీలు కృషి చేస్తే సగం రాష్ట్రంలో పార్టీ పటిష్టపడి నట్లే.

గెలిచిన ఎనిమిది మంది ఎంపీలు, రెండో స్థానంలో నిలిచిన మరో ఏడుగురు ఎంపీ అభ్యర్థులతో పాటు ఇప్పటికే ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కూడా కలిసికట్టుగా సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తే బీజేపీకి తెలంగాణలో అధికారం అందని ద్రాక్ష కాదు. తమ బలం పాలమీద పొంగు కాదని నిరూపించవచ్చు.

భారత దక్షిణ భాగంలో మరింత బలపడి ఉత్తరాది పార్టీ అనే మచ్చను చెరిపేసుకునేందుకు బీజేపీ ఈ ఐదు రాష్ట్రాల్లో ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో సానుకూల ఫలితాలను అందుకుంది. అన్ని రాష్ట్రాల్లో ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకుంటూ పార్టీ పునాదులను పటిష్టం చేసుకుంటున్న భారతీయ జనతా పార్టీ భారతీయులందరి పార్టీ అని నిరూపించుకునే రోజులు ఎంతో దూరంలో లేవు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**


# 'కేరళలో ముస్లింలకు మలబార్'

కేరళలో (1969) మలప్పురం జిల్లాను ఏర్పాటు చేశారు. అది కూడా ముస్లింల డిమాండ్ మేరకే. ఇది సరికాదనీ, ముస్లిం మతోన్మాదులు తరువాత వేసే అడుగు ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌తోనేనని ఆనాడు భారతీయ జనసంఘ్ హెచ్చరించింది. ఈ విషయాన్ని బీజేపీ కేరళ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. సురేంద్రన్ గుర్తు చేయవలసిన పరిస్థితి ఇప్పుడు వచ్చింది. ఒక ప్రాంతంలోని పాఠశాలల్లో తగినన్ని సీట్లు లేకపోతే ఏం చేయాలి? సీట్ల సంఖ్య పెంచమని ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి. కానీ కేరళలో సున్నీ ముస్లింలు ఆ నెపంతో ఏకంగా కేరళను చీల్చి వేరే రాష్ట్రం ఇవ్వాలని అడిగారు. దేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా గుర్తింపు పొందిన ఆ రాష్ట్రంలో కొద్దిరోజుల క్రితమే ఈ ఉదంతం జరిగింది. సున్నీ యువజన సంఘం (ఇది సంస్థా కేరళ జమాయత్ ఉల్ ఉల్మా యువజన విభాగం) సమావేశంలో ఆ మత సంస్థ నాయకుడు ముస్తాఫా ముండుపారా ఈ నినాదం ఇచ్చాడు. ఉత్తర కేరళ ప్రాంతంతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని అతడు పిలుపునిచ్చాడు. ఆ భాగాన్నే మలబార్ అంటారు. పాలక్కాడ్, కొజికోడ్, కన్నూర్, మలప్పురం, కాసర్‌గోడ్ వంటి జిల్లాలో ఇందులో ఉన్నాయి.

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలో ఉత్తీర్ణులైన వారందరూ కళాశాలల్లో చేరడానికి తగినన్ని సీట్లు అందు బాటులో లేనందుకు నిరసనగా జూన్ 24న సున్నీ యువజన సంగం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ముస్తఫా ప్రసంగించాడు. ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర కేరళ పట్ల వివక్షతో ఉన్నదని ఆరోపించాడు. దక్షిణ కేరళ మాదిరిగానే తాము అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా ఈ వివక్ష ఏమిటని, ఈ నేపథ్యంలో ఎవరైనా ప్రత్యేక ఉత్తర రాష్ట్రం ఏర్పాటు చేయాలని కోరినా ఆశ్చర్యం లేదని, వారిని తప్పు పట్టలేమని ముస్తఫా ముక్తాయించాడు. సంస్థా కేరళ సున్నీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కూడా బాహాటంగానే ముస్లింలు అధికంగా ఉన్న మలబార్ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని కోరింది. ఈ విద్యార్థి సంఘం పత్రిక 'సత్యధర్' సంపాదకుడు అన్వర్ సాదిక్ ఫైయాసీ కూడా ఇదే డిమాండ్ వినిపించాడు. మా డిమాండ్‌ను నెరవేర్చడంలో జాప్యం జరిగితే 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమం' తరహాలో ఉద్యమిస్తామని కూడా హెచ్చరించాడు. కొత్తగా ఏర్పాటు చేసే మలబార్ రాష్ట్రానికి కొజికోడ్ రాజధాని కావాలని కూడా చెప్పాడు. అంటే ఏదైనా ఒక పథకం ప్రకారం కుట్ర మేరకు చేస్తున్నారు. అదేమీ ఆకస్మికం కాదు.

కేరళ సంస్థా అంటే కేరళలోనే సనాతన ముస్లిం సంస్థ. దీనికి కాంగ్రెస్‌తో, ముస్లిం లీగ్‌తో గట్టి బంధం ఉంది. కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)లో ముస్లింలీగ్ 2021 ఫిబ్రవరిలో భాగస్వామి అయింది. అప్పుడు సంస్థా మలబార్ రాష్ట్రం కోరింది. ముస్లింలీగ్ యువ విభాగం యూత్‌లీగ్ 2013లో అదే డిమాండ్ ముందుకు తెచ్చింది. మలబార్ రాష్ట్రం అంటే త్రిశూర్ జిల్లా మొదలు కాసర్‌గోడ్ జిల్లా వరకు

# దేవుని ముందు మోకరిల్లితే మరణదండన సడలిస్తారా?



ఆరేళ్ల బాలిక మీద లైంగిక అత్యాచారం చేసి చంపాడతడు. ఈ 36 ఏళ్ల దోషికి కోర్టు మరణ దండన విధించింది న్యాయస్థానం. కానీ ఒడిశా హైకోర్టు అతడి మరణ శిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. అందుకు చూపించిన కారణం– అతడు రోజూ అనేక పర్యాయాలు నమాజ్ చేస్తాడట. దైవానికి మోకరిల్లడం ద్వారా శిక్షను అతడు ఆహ్వానించాడు అని కూడా కోర్టు వివరించింది. ఏమైనా రోజులో ఎక్కువ పర్యాయాలు నమాజ్ చేస్తున్న కారణంగా ఒక దోషికి విధించిన మరణదండనను యావజ్జీవ శిక్షగా మార్చడం లేదా తగ్గించడం అంటే ఏమిటి? ఈ ప్రశ్నే పలువురు న్యాయవాదులు వేశారు.

మరణదండనను తగ్గిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును ఎస్‌కే సాహూ, ఆర్‌కే పట్నాయక్‌లతో కూడిన ఒడిశా హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఆ నేరానికి గాను షేక్ ఆసిఫ్ అలీ మీద 302/376 (ఐపీసీ) సెక్షన్ల కింద కేసు నమోదైంది. దీనితో పాటు పోస్కో చట్టంలోని 6వ సెక్షన్‌ను కూడా నమోదు చేశారు.

2014లో ఈ కేసు నమోదైంది. అప్పటికి అతడి వయసు 26 సంవత్సరాలు. ఇతడిని మరణించే వరకు జైలులో ఉంచాలని, బాధితురాలి కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. కింది కోర్టు ఇచ్చిన ఈ తీర్పును యావజ్జీవ శిక్షగా మార్చడానికి తాను పరిగణనలోని తీసుకున్న అంశాలను కూడా హైకోర్టు వెల్లడించింది. అవేమిటి? దోషికి పెద్ద కుటుంబం ఉంది. 63ఏళ్ల వయసు ఉన్న తల్లి ఉంది. పెళ్లి కావలసిన ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. అతడే కుటుంబాన్ని పోషించాలి. గతంలో ముంబైలో రంగు పనుల మేస్త్రీగా పని చేసిన అలీకి ఉన్న ఆర్థిక కష్టాలు కూడా ఎక్కువే. అతడు పాఠశాలలో చదువుకున్న కాలంలో మంచి బాలుడేనట.

2000 సంవత్సరంలో మెట్రిక్యులేషన్ కూడా ఉత్తీర్ణుడయ్యాడట. పై చదువులు చదవగలిగిన ఆర్థిక స్థోమత లేక ఆపేశాడు. క్రికెట్, ఫుట్‌బాల్ బాగా ఆడతాడు. పదేళ్ల జైలు జీవితం చూసినా ఇతడు సౌమ్యంగానే ఉన్నట్టు మనస్తత్వ శాస్త్రవేత్త ఇచ్చిన నివేదిక వల్ల తెలుస్తున్నది. సిబ్బందితో చాలా మర్యాద పూర్వకంగా వ్యవహరించాడు. కాబట్టి కేసును అప్పీలు చేసుకున్న ఈ వ్యక్తి సంస్కరణకి, మార్పుకు దూరంగానే ఉండిపోయాడని చెప్పడానికి ఆధారాలు లేవు అని కూడా కోర్టు కితాబిచ్చింది. ఇవన్నీ పరిగణనలోనికి తీసుకున్న తరువాత మరణ శిక్షే అవసరం లేదని అనిపిస్తుంది అని కూడా కోర్టు చెప్పింది. దీనినే ఇప్పుడు న్యాయవాదులు ప్రశ్నిస్తున్నారు. ★

## రాష్ట్రం కావాలి'

విస్తరించి, మాహె, నీలగిరి ప్రాంతాలను కూడా కలుపుకుని ఉంటుంది. విశేషం ఏమిటంటే ఇందులో మాహె ప్రస్తుతం కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి పరిధిలో ఉంది. నీలగిరి జిల్లా తమిళనాడులో ఉంది. మొత్తంగా ఇది రాష్ట్రాల మధ్య చిచ్చు రేపే సమస్య. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీ వరసగా రెండుసార్లు ఎంపీ కావడం, తాజాగా జరిగిన ఎన్నికలలో రాయబరేలీలో కూడా విజయం సాధించడం వల్ల వయనాడ్ వదులుకున్నప్పటికీ, ఆయన సోదరి ప్రియాంకకే మళ్లీ అక్కడ నుంచి పోటీచేసే అవకాశం కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న నేపథ్యంలో ఈ వేర్పాటువాద నినాదాలు ఊపందు కున్నాయన్న వాదన వినిపిస్తున్నది. అమేఠీలో ఓడిపోయిన తనను గెలిపించినందుకు కేరళ ముస్లింలకు రాహుల్ ఈ రీతిలో కృతజ్ఞత తెలియ చేయాలని అనుకుంటున్నారా?

వయనాడ్ లోక్‌సభ స్థానం పరిధిలో మలప్పురం జిల్లా ఉంది. ఇందులో మూడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయి. అవన్నీ ముస్లింలు మెజారిటీ ఉన్నవే. ఇదే కాకుండా, కటింగ్ సౌత్ పేరుతో నిరుడు జరిగిన సమావేశానికి కొనసాగింపు ప్రత్యేక మలబార్ రాష్ట్ర డిమాండ్ అన్న వాదన కూడా ఉంది. ఒక విధంగా నిషిద్ధ పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా నినాదాన్నే ఇప్పుడు సంస్థా అందుకున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. సురేంద్రన్ విమర్శించారు. కేరళను విభజించాలన్న ఏ కుట్రనైనా బీజేపీ వ్యతిరేకిస్తుందని ఆయన హెచ్చరించారు. కేరళను రెండు ముక్కలు చేయాలన్న డిమాండ్ వచ్చిందంటే అందుకు కారణం లెఫ్ట్‌ఫ్రంట్, యూడీఎఫ్ మితిమీరిన బుజ్జగింపే కారణమని, ఇప్పుడు ఈ డిమాండ్ మీద ఆ రెండు ఫ్రంట్‌లు మాట్లాడాలని ప్రజులు కోరు తున్నారని కూడా సురేంద్రన్ అన్నారు. సాంస్కృతిక సంస్థల మాటున ముస్లిం లీగ్ ఈ రాజకీయాలు నడుపుతున్నదని కూడా అన్నారు. 1947లో దేశ విభజనకు కారకులైన వారి వారసత్వాన్ని ముస్లిం లీగ్ ఇంకా కొనసాగిస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ అధికారంలో ఉన్నంత కాలం విద్యాశాఖను నిర్వహించిన ముస్లిం



లీగ్ ఇప్పుడు మలబార్ ప్రాంతంలోని పాఠశాలల్లో తగినన్ని సీట్లు లేవని, అందుకు కొత్త రాష్ట్ర ఏర్పాటే పరిష్కారమని చెప్పడం అసంబద్ధమని ఆయన అన్నారు. ఇది ముస్తఫా వాదన వేర్పాటువాదమేనని సీపీఎం ప్రస్తుతానికి ఒక ప్రకటన అయితే ఇచ్చింది. దీనిని ఖండించాలని మలప్పురం జిల్లా పార్టీ కార్యదర్శి మోహన్‌దాస్ విమర్శించారు. మలయాళీల రాష్ట్రాన్ని రెండుగా చీల్చాలన్న యోచన దిగ్భ్రాంతి కలిగిస్తుందని అన్నారు. ★

# మైనార్టీ అయినా బీజేపీలో ఉంటే స్పందించని ప్రతిపక్షాలు




బ్రిటిషువారు వెళ్లిపోయినా ఆ వాసనలు పోకుండా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విభజించి, పాలించు రాజకీయాలలో కూడా నిజాయతీ కనిపించడం లేదు. అందుకు కారణం ఇద్దరు మైనార్టీ మహిళలపై రెండు ప్రాంతాలలో జరిగిన ఘోర అత్యాచారాల పట్ల దాని స్పందనే. ఎన్నికల ముందు జరిగిన ఘటనను చురుకుగా ఖండించిన కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు, ఎన్నికలు అయిన తర్వాత జరిగిన ఘటన విషయంలో పట్టనట్టు వ్యవహరిస్తుండడం వారి అసలు రంగును బయట పెడుతోంది.

పశ్చిమ బెంగాల్‌లోని ఎన్నికలానంతర హింసలో భాగంగా కూచ్‌బెహార్‌లో ఒక బీజేపీ ముస్లిం మహిళా కార్యకర్తను వివస్త్రను చేసి, జుట్టుపట్టుకొని ఒక కిలోమీటరు ఈడ్చుకుపోవడం, ఆమెపై దాడి చేయడానికి సంబంధించి, ఆ రాష్ట్ర 'ప్రజా ప్రతినిధు'లతో సహా ఎవ్వరూ పార్లమెంటులో నోరు మెదపడం లేదు, ప్రశ్నించడం లేదు. మణిపూర్‌లో ఇటువంటి ఘటనే కొద్ది నెలల కింద జరిగినప్పుడు తీవ్రంగా స్పందించి, ఒక జెట్ విమానం మాట్లాడుకొని మరీ ఆ రాష్ట్రానికి వెళ్లి మరీ పరామర్శించిన రాహుల్ గాంధీ, ఇప్పుడు కూచ్ బెహార్ మాటే ఎత్తకపోవడం వెనుక అంతరార్థ మేమిటి? మైనార్టీల పట్ల ప్రేమ ఎన్నికలుంటేనే ఉంటుందా? అటు మెజారిటీ పట్లా, ఇటు మైనార్టీ పట్లా ఎటువంటి దయ, బాధ్యత లేని ఈ పార్టీలు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో మనకు తెలిసిందే. డాట్ డాట్ కూటమి కేవలం అవకాశ వాద కూటమే అని అందరికీ తెలిసిన విషయమే అయి నప్పుడు మమతా బెనర్జీ పాలిత రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ గూండాలు పాల్పడిన పనిని ఖండించేందుకు ముందుకు రాకపోవడానికి కారణం ఆమె 'బీజేపీ' కార్యకర్త కావడమే కారణమా?

ఈ దుర్ఘటన కూచ్‌బెహార్ జిల్లాలోని మాత భంగ -11 బ్లాకులోని రుయిదంగ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు ప్రస్తుతం అక్కడికి సమీపంలో గల ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. స్థానిక మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం బాధితు రాలు బీజేపీ కార్యకర్త కావడం వల్లనే టీఎంసీ గూండాలు దాడి చేశారు. తండ్రి ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడినప్పటి నుంచీ ఆమెను ఇంట్లోంచి బయటకు రాకుండా స్థానిక టీఎంసీ కేడర్ అడ్డుకుందని, ఆమె గతవారం దగ్గర్లో ఉన్న ఒక పార్కుకి వెళ్లి వస్తుండగా, టీఎంసీ గూండాలు ఆమెపై దాడి చేసి, వివస్త్రను చేసి, ఆమె దుస్తులను పక్కనే ఉన్న నదిలో పారేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే, ఆమె ఇంటి బయటకు వస్తే ఆమె ఇంటిని ధ్వంసం చేస్తామని కూడా వారు హెచ్చరించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు షఫీకుల్ సహా 4 వ్యక్తులను దీదీ తాలూకు పోలీసులు అరెస్టు చేశారని వార్తలు వచ్చాయి. ఇందులో షఫీకుల్ అనే రాక్షసుడు ఆమెను నగ్నంగా చేసినప్పుడు ఫోటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ★

కథ



# సమర్థ

రాయప్రోలు సుజాతాప్రసాద్.

తాను ఆడపిల్లగా పుట్టినందుకు సమర్థకు ఎంతో గర్వం. ఆడతనం అంటే చాలా ఇష్టం. ఏరోజూ ఆడపిల్లగా ప్రకృతి సహజంగా పడే ఏ ఇబ్బందికి బాధ పడలేదు. సమర్థ పెరిగిన వాతావరణం అలాంటిది. కానీ, తను పెరిగిన సమాజం పట్ల పరిశీలనా దృష్టి, అవగాహన ఉండడంతో పుట్టినప్పటి నుంచి ఆడపిల్ల జీవితం మీద అధికారం చలాయించే సమాజం అంటే చాలా అసహనం ఉంది. ఆడపిల్లని ఏ దశలోనైనా, ఏ స్థితిలోనైనా, ఎంత బాగున్నా రంధ్రాన్వేషణ చేసి వేలెత్తిచూపే సమాజం పట్ల చాలా కోపం ఉంది. ఆ సమాజానికి అధిక శాతంలో ప్రాతినిధ్యం వహించే ఆడవాళ్లను చూస్తే మొదట్లో చాలా ఆశ్చర్యం కలిగేది. తరువాత బాధగా మారింది. తల్లి శారద అన్నట్లు ఆడవాళ్లంతా ఏకమయితే చాలావరకు సమస్యలు పరిష్కారం అవుతాయి అనిపించేది. చదువుకుని ఉద్యోగాలు చేసే స్త్రీలలో కూడా కనిపించే ఈ నైజానికి విస్తుపోతుండేది. క్రమేపీ వాళ్లలోని సంస్కార లేమికి జాలిపడే స్థాయికి ఎదిగింది. ఎవరి గురించీ వాళ్ల లోపాలు పరోక్షంగా మాట్లాడకుండా ఉంటే కొన్ని అయినా సమస్యలు తీరుతాయని గాఢంగా నమ్మి, అదే పూనికతో జీవించడంతో సమర్థ అంటే కొంతమందికి ఆరాధన అయితే, కొంతమందికి అయిష్టం! ఏ రకమైన విమర్శకీ దొరకని సమర్థని విమర్శించే అవకాశం దొరికింది. ఉద్యోగంలో టెన్షన్స్, కుటుంబ బాధ్యతలు, పిల్లల చదువు, అన్నీ కలగలిపి సమర్థను ఛాలెంజ్ చేస్తున్నాయి. వాటి ప్రభావం శరీరంపై పడుతూ ఉంది. దానివలన సహనం నశించి..కోపం, చిరాకు పెరిగిపోతున్నాయి. కానీ ఎవరి మీద చూపించలేని పరిస్థితి. ఆ టెన్షన్ ఇక శరీర ఆకృతి మీద, ఆరోగ్యం మీద కనపడుతోంది.

* * *

“సమర్థా! నా ప్రాణ స్నేహితురాలు రమ! ఢిల్లీ నుంచి ఈ మధ్యే వచ్చిందిట. మీ పెళ్లి తరువాత నిన్ను చూడలేదు. తను మధ్య మధ్యన వచ్చింది కానీ అది నీ ఆఫీసు టైమ్ అవడం వలన నిన్ను కలియలేదు. ఈరోజు నిన్ను కలిసి వెళ్లాలనే వెయిట్ చేస్తోంది..” అప్పుడే ఆఫీసు నుండి వచ్చిన సమర్థకు స్నేహితురాల్ని పరిచయం చేసింది అత్తగారు మంజుల. “నమస్తే ఆంటీ!” అలసటను కప్పుకుంటూ చక్కటి నవ్వుతో పలకరించి సమర్థ లోపలికి వచ్చింది. వెనకాలే మంజుల వచ్చి “సరళా! ఫ్రిజ్‌లోంచి పిండి తీసిపెట్టాను. నీ చేత్తో చక్కగా రేకుల్లా దోసెలు వెయ్యి. కొత్తిమీర కారం చెయ్యి. సులభంగా అయిపోతుంది. ఫిల్టర్ వేశాను. టిఫిన్ అయ్యేసరికి కాఫీ రెడీ చేసెయ్!” చెయ్యవలసింది టకటకా చెప్పి వెళ్లి పోయింది. ఇక తప్పదనుకుని వంటింట్లోకి వెళ్లి వాళ్లకు టిఫిన్ కాఫీ అందించింది. ఈ లోపల మామగారు, మరిది వచ్చారు. వాళ్లకు కాఫీ టిఫిన్ ఇచ్చి బెడ్ రూమ్‌లోకి వచ్చి మంచం మీద కూలబడింది. రోజూ ఎప్పుడూ తను వచ్చేసరికి లేటే! ఈ రోజు కాస్త త్వరగా వచ్చేసరికి ఇంట్లో పని సరిపోయింది. ఏం జీవితం! విశ్రాంతి కోసం తపించిపోయే జీవితం! ఆరు గంటలు పడుకుని ఎన్ని నెలలయింది? ఎన్నాళ్ల యింది? తను కాస్త ఇష్టంగా, శ్రద్ధగా కడుపునిండా భోంచేసి!

టైము చూసేసరికి పిల్లలు ట్యూషన్ నుంచి వచ్చే వేళ అయిపోయింది. ఇక తప్పనిసరిగా లేచి స్నానం చేసి ఫ్రెష్ అయి వస్తుంటే రమ. “ఏమో మంజూ! రవి చూస్తే మంచి పొడవు. నీ కోడలు పొట్టి అయినా చాలా చక్కగా ఉందని చేసుకున్నారు. ఏదీ ఇప్పుడు చూడు! ఎంత ఒళ్లు వచ్చేసింది? ఇప్పుడు ఫర్వాలేదు గానీ ఇలాగే కంటిన్యూ అయితే ఏం బాగుంటుంది? గుమ్మడిగింజలా ఉంటుంది. కళ్లు కూడా చిన్నగా అయిపోయి చాలా మారిపోయింది.” అంటోంది. సమర్థకి చాలా కోపం వచ్చింది. ఆవిడకి తనని విమర్శించే అధికారం ఎవరిచ్చారు? ఇంతకీ అత్తగారే మంటారో అని నిలబడి వింది. “మన కాలంలోలాగ శారీరక కష్టం ఏమన్నా ఉందా? విసరడం, రుబ్బడం, దంపడం, నీళ్లు తోడడం అన్నీ చేసేవాళ్ల . ఇప్పుడే ముంది అన్నింటికీ మిషన్లు. దానికే ఉస్సు! హుస్సు! ఏం చెప్తాములే! ఏమన్నా అంటే ఉద్యోగం ఒక మిష!” అన్న అత్తగారి అభిప్రాయం విని మరింత నివ్వెర పోయింది. ఇదే అమ్మ అయితే తన వైపే మాట్లాడేది కాదా? అనుకునేసరికి కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

సమర్థ సాఫ్టువేర్ ఇంజనీరు. పెళ్లికి ముందు టైము తన చేతుల్లో ఉండేది. భగవంతుడిచ్చిన తీరైన రూపం, సుధలొలికే మంచి మధురమైన గొంతు, తెలివితేటలు, పనిలో అంకితభావం, మంచి చెడుల విచక్షణ, వెనుక తల్లిదండ్రుల ప్రేమపూర్వక మద్దతు, వెరసి జీవితం చాలా బాగుండేది. కొంచెం హైట్ తక్కువన్న మాట తప్ప ఎంచడానికి ఏమీ లేదు.సమర్థ కళ్లు చాలా చక్కటివి. విశాలనేత్రి! అనేవారు.



చిన్నప్పటినుంచి ఉమ్మడి కుటుంబంలోనే పెరగడం వలన, ధైర్యంగా ఉమ్మడి కుటుంబంలోకి కోడలుగా వచ్చింది. రవీ వాళ్లే కోరి సంబంధం కలుపుకున్నారు. రవి కూడా సాఫ్టవేరు ఇంజనీరే! అత్తవారింట్లో విలన్లు ఎవరూ లేరు. "కాకపోతే అత్తవారు." అంతే! మధ్యతరగతి కుటుంబాలలో మనుషులు చెడ్డవారు కారు పరిస్థితులే చెడ్డవి అని అనుభవం నేర్పింది.. "ఇంతవరకూ జీవితంలో అలిసిపోయాం. ఇప్పుడు విశ్రాంతి తీసుకోవాలి" అనుకునే అత్తమామలు. పోటీ ప్రపంచంలో కంపెనీలు మారుతూ ఉంటే ప్యాకేజీ పెరగడం అందరికీ బాగానే ఉంటుంది కానీ ఆఫీసులో పని గంటలు, బాధ్యతలు పెరిగితే ఇంట్లో ఎవరికీ ఇష్టమూ ఉండదు. ఒ.డి.సి.లో చేస్తే వర్క్ ఫ్రమ్ హోమ్ అన్నమాట లేదు. అరగంట కొకసారి లేచి ఐదు నిమిషాలు నడుద్దామన్నా ఖాళీ లేనంత పని! గంటలు గంటలు కూచుని చేసే పనికి ఒళ్లు రాక ఏమవుతుంది? అప్పటికీ ఆ బాధ పడలేక వేరే ప్రాజెక్టుకి మారింది. తనకి ఒళ్లు వచ్చేస్తోంది అని ఇంకొకరు చెప్పాలా? అసలు లాస్ అంతా తనదే కదా? తన ఆరోగ్యం గురించి టెన్షన్ ఒకవైపు నడుస్తోంది. ఆడది ఈ కొలతలలో ప్యాకేజీలో ఉండాలని నిర్ణయించిన మహానుభావులు కనబడి తేనా? అనుకునేది. ఒకప్పుడేమోగానీ ఇప్పుడందరికీ అవేర్‌నెస్ ఉంది. కానీ తనకి ఏది చేయడానికీ టైమ్ ఉండదు. అద్దంలో చూసుకుంటే మోహం ఉబ్బడంతో కళ్లు చిన్నవయిపోయాయి. నిద్రలేమికి కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ వచ్చేస్తున్నాయి. తల్లి ఎన్నోసార్లు దగ్గరకు తీసుకుని "నీ గురించి నువ్వు పట్టించుకోరా ఆరోగ్యం జాగ్రత్త!"! అనేది ఆర్తిగా! రెండుసార్లు సిజరిన్ ఆపరేషన్స్! పిల్లలతో రాత్రి నిద్రలేమి. అలసట! అలసట! అలసట! థైరాయిడ్ కూడా వచ్చింది. ఎక్సర్సైజెస్ ఎన్నిసార్లో ప్రారంభించడం! ఏదో ఉపద్రవం వచ్చి గండి కొట్టుకుపోవడం! వంట మనిషిని పెట్టినా ఎవరికీ నచ్చదు. రవి కఠినంగా ఏమీ అనకపోయినా "పెళ్లికి ముందులా అయిపోవా? ప్లీజ్" అంటుంటాడు. రవిలో శారీరకంగా ఏ మార్పు లేదు. పెళ్లికి లాగానే రివటలా చక్కగా ఉన్నాడు. తన టైమ్ అంతా తన చేతుల్లోనే ఉంటుంది. రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేస్తాడు. ఇంటిపని అక్కరలేదు. పిల్లలను కనే బాధ్యత లేదు. బజారు పని కూడా రవికి చెపితే మామగారు చేసి కొడుక్కి రెస్ట్ ఇస్తారు. తను వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తే పిల్లలని ఇంటిని చూస్తూ చేయాలి. అదే రవి అయితే రూమ్‌లోకి వెళ్లి తలుపేసుకుంటే అటువైపు ఎవరూ వెళ్లరు. శనివారం వచ్చిందంటే ఇంకా పని! పిల్లలకి నలుగురు తలంట్లు! స్పెషల్స్ చేయాలి. మసాలాలతో పెద్దవాళ్లు తినరు. వాళ్లకి వేరే చేయాలి. ఒక పక్క స్కూల్లో టీచర్స్ అంతంత మాత్రం గానే ఉన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్ పైగా! ఫీజులు లక్షలలో ఉన్నాయి గాని పిల్లల స్టాండర్డ్ మాత్రం తను అనుకున్నట్టు లేదు. వాళ్లకి వేరే చోట ట్యూషన్ పెట్టించింది. అదీ అంతంత మాత్రం గానే సాగుతోంది.

భర్తకి, పిల్లలకి, అత్తమామలకి అందరికీ తన మీద ఎక్స్పెక్టేషన్స్! అవి రీచ్ అవడానికి తను ఒళ్లు హూనం చేసుకోవడం! 'నీ చేత్తో చేసిపెట్టు' అనేది ఆవిడ ఊతపదం! కానీ మనసులో ఏముంది? అనేది ఈరోజు స్పష్టంగా వింది. తను తేడా లేకుండా తల్లిలాగే చూసినా ఆవిడ తనని కూతురుగా అనుకోరని అర్థమయింది. ఎన్నాళ్లనుంచో రగులుతున్న లావా ఆ రోజే బయటకు వచ్చిన ట్లయింది. వంట భోజనాలు అయ్యాయనిపించి వచ్చి పడుకుంది. సమర్థ సీరియస్‌గా ఉండడం చూసి అందరూ ఏదో జరిగింది అనుకుని, మౌనంగానే ఉండి పోయారు.

మోచేయి కళ్లకద్దం పెట్టుకుని పడుకున్న సమర్థలో అనంతంగా ఆలోచనలు సాగుతున్నాయి. ఆడది ఒకప్పుడు చదువులేక, ఆర్థిక స్వాతంత్ర్యం లేక, అజ్ఞానంతో మగవాడి దాష్టీకానికి బలయ్యింది. ఈ తరం చదువుకుని ఉద్యోగాలు చేస్తూ ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నా సుఖమేది? అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ఆడదాని బతుకు సమస్యల మయమేనా? శాంతికి, సుఖానికి, నిర్వచనం వెతుక్కోవడమేనా? సమస్య రూపమే మారుతోంది కానీ శాశ్వతంగా పరిష్కారం కావడంలేదు. ఆడవారిలో ఐకమత్యమూ లేదు. తాము ఒక సమస్యలో ఉంటారు. అయినా మరొకరికి సమస్యగా మారుతారు. ఏంచేయాలి? ఇంత కష్టపడకా తప్పడం లేదు. అయిన వాళ్ల చేత మాటలు పడకా తప్పడం లేదు. ఇంట్లో, బయట హెచ్చరికలు, విమర్శలూ వినకా తప్పడం లేదు. విరక్తి

వస్తోంది జీవితమంటే! మండుతున్న కళ్లని గట్టిగా మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించింది సమర్థ.

మర్నాడు తల్లికి ఫోన్ చేసింది. శారద ఫోన్ తీసి "అమ్ములూ! ఎలా ఉన్నావు? అంతా కులాసా యేనా?" అని ఆత్మీయంగా అడగ్గానే ముందురోజు నుండి పేరుకుని ఉన్న ఉక్రోషం, ఫ్రస్టేషన్ కరిగి పోయినట్లు ఏడిచింది.

శారద కంగారు పడుతూ. "తల్లిగా! ఏమయింది చెప్పవా?" అని అడిగింది. ఐదు నిమిషాలు ఎంతో లాలించాక "అమ్మా! నాకు నేను ఫెయిల్యూర్‌ని అనిపిస్తోంది. జీవితం అంటే విసుగు, చికాకు వస్తున్నాయి. నువ్వు చెప్పు ఎందుకలా ఉంది?" అంది నిరాశగా!

శారదకి మనసు అర్థమైంది. "సమర్థా! చక్కగా చదువుకుని, మంచి ఉద్యోగంలో ఉన్నావు. ఆఫీసులోనూ అవార్డ్స్ తీసుకుంటున్నావు. ప్రేమించే భర్త! ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. ఉమ్మడి కుటుంబాన్ని సక్సెస్‌ఫుల్‌గా నడుపుతున్నావు. సక్సెస్‌కి ఇంక పరిభాష ఏమిటో చెప్పవా? ఇందులో ఏ ఒక్కటి లోపించినా నువ్వు తట్టుకోగలవా?" ఒకపక్క ఛీరప్ చేస్తూనే తనకున్న ప్లస్ పాయింట్స్ అన్నీ చెప్పింది.

"ఈ అలసట భరించలేకపోతున్నానమ్మా! ఏదో తెలియని విసుగు, కోపం వస్తున్నాయి. ఒక్కసారి మన ఊరు వచ్చి నీ ఒళ్లో హాయిగా పడుకోవాల నుందమ్మా!" బేలగా నీర్సంగా చెప్పింది. "తప్పకుండా రా! కానీ ఈ లోపల ఈ చిరాకుకి కారణం తెలుసుకో! మనిషి ఆనందానికి కుటుంబంలోను, సమాజం లోను ఉన్న గుర్తింపే ప్రధానం. దానికి ముఖ్యంగా మూడు కారణాలు ఉంటాయి. మొదటిది శారీరక ఆకర్షణ! రెండు పదిమందిని ఆకర్షించే వ్యక్తిత్వం! మూడు నీ కోసం నువ్వు ఏదన్నా చేసుకుని పొందే ఆత్మానందం. ఇందులో ఏది కోల్పోవడం వలన నీకు

"అదేమిటి సమర్థా! నిన్నెవరు అంతమాటన్నారు?" 'రవి కాస్త ఆవేశంగానే అన్నాడు. మంజుల తేలు కుట్టిన దొంగలా ఊరుకుంది. "పిల్లలకి హోమ్ ట్యూషన్ మాట్లాడు తున్నాను మావయ్యగారూ! మీరు టీచర్ గా రిటైర్ అయ్యారు. మీరు అదే రూమ్‌లో ఉండి వచ్చే టీచర్‌ని మానిటర్ చెయ్యండి చాలు. మీ పని మీరు చేసుకుంటూ ఒక కంట కనిపెట్టండి. ఇది నా రిక్వెస్ట్! పిల్లలు బాగుపడాలి. నా మాట మన్నించి విన్నందుకు చాలా సంతోషం."




అశాంతి కలుగుతోందో నీకు తెలియంది కాదు.. నా బిడ్డ దీనికి సమాధానం వెతుక్కోలేని చేతకానిది కాదు. సమర్థ అంటే నాకంటే ఎవరికి బాగా తెలుసు? సమర్థకి ఇది చేయలేని పనీ కాదు, పరిష్కరించలేని సమస్యా కాదు." ఎంతో విశ్వాసంతో అన్న తల్లి మాటలు సమర్థకు నిజంగానే ఊపిరి పోశాయి.. గట్టిగా ఫోన్‌లోనే తల్లికి ముద్దు పెట్టి "థాంక్యూ అమ్మా! నేను నా సమస్య పరిష్కరించుకుని మళ్లీ కాల్ చేస్తాను. బై! "అని పెట్టేసింది.

రాత్రి తొమ్మిది అవుతోంది. హాల్‌లో కూచున్న సమర్థ అత్తగారికి, మామ గారికి, మరిదికి, రవికి అందరికీ సస్పెన్సు గానే ఉంది. పిల్లలను పడుకోబెట్టి వచ్చి మాట్లాడతానని ఎవరినీ పడుకోవద్దనీ సమర్థ చెప్పింది. వాళ్లకి చాలా తొందరగా పడుకునే అలవాటుంది. ఏమయి ఉంటుంది అనేది ఎవరికీ తెలీలేదు. సమర్థ వచ్చి ఒక్క నిమిషం మౌనంగా కూచుంది. తరువాత మెల్లగా "మిమ్మల్ని ఈ టైమ్‌లో ఇబ్బంది పెట్టానేమో తెలియదు. నా మనసులో మాట చెప్పాలి. నాకు రోజులో మీ అందరూ ఉదయం 5.30 నుంచి 6.30, సాయంకాలం నేను ఆఫీస్ నుంచి వచ్చాక ఓ అరగంట టైమివ్వాలి." అంది. "అంటే" మంజుల అర్థం కానట్లు మొహం పెట్టింది. "అంటే ఆ టైములో ఇంట్లో ఏ అవసరానికి నన్ను పిలవకూడదు. ఆ సమయంలో నేను ఎవరికీ ఎటెండ్ అవలేను. ఆఖరికి పిల్లలకి అవసరమైనా మీరే చూడాలి. నా ఆరోగ్యం పాడవుతోంది. ఒక యోగ ట్యూటర్‌ని పెట్టుకుంటున్నాను. ఆ టైమ్‌లో యోగ చేసి తీరాలి. లేకపోతే అనారోగ్యం పాలై "గుమ్మడి గింజ" గానే పిలవబడతాను." అత్తగారి వైపు చూస్తూ నార్మల్‌గానే అన్నట్లే అంది. "అదేమిటి సమర్థా! నిన్నెవరు అంతమాటన్నారు?" 'రవి కాస్త ఆవేశంగానే అన్నాడు.

మంజుల తేలు కుట్టిన దొంగలా ఊరుకుంది. "పిల్లలకి హోమ్ ట్యూషన్ మాట్లాడు తున్నాను మావయ్యగారూ! మీరు టీచర్ గా రిటైర్ అయ్యారు. మీరు అదే రూమ్‌లో ఉండి వచ్చే టీచర్‌ని మానిటర్ చెయ్యండి చాలు. మీ పని మీరు చేసుకుంటూ ఒక కంట కనిపెట్టండి. ఇది నా రిక్వెస్ట్! పిల్లలు బాగుపడాలి. నా మాట మన్నించి విన్నందుకు చాలా సంతోషం." చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లి పోతుంటే "మరి సాయంకాలం ఏం చేస్తావు" అన్నాడు రవి. చిన్నగా తీయగా నవ్వి "చేస్తుంటే చూద్దురుగానీ!" అని వెళ్లిపోయింది. హాల్‌లో అందరూ చర్చకి ఉపక్రమించారు. పెళ్లయిన ఇన్నేళ్లలో సమర్థ అలా మాట్లాడింది లేదు. బెడ్‌రూమ్ లోకి వెళ్తూనే తనని, తన పాటని ఎంతో అభిమానించే తన సంగీతం గురువు గారికి ఫోన్ చేసింది. వారంలో శనివారం ఒక్కరోజు ఒక గంట క్లాస్ చెప్పమని అడగడానికి. అమ్మ చెప్పినట్టు నా హృదయానందాన్ని నేను మళ్లీ పొందాలి. అందరికోసం కాకుండా తన కోసం కూడా జీవించాలి అనుకుంది దృఢంగా!,




వచ్చేవారం కథ..
సహచరులు
-మణి వడ్లమాని








# భారత్ మెరిసింది... జాతి మురిసింది!

భారత క్రికెట్ చరిత్రలో మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఐసీసీ ప్రపంచకప్‌ను 13 సంవత్సరాలు,టీ-20 ప్రపంచకప్‌ను 17 ఏళ్ల విరామం తరువాత భారత్ గెలుచుకొంది. కరీబియన్ ద్వీపదేశం బార్బడోస్ వేదికగా జరిగిన 2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ ఫైనల్లో రోహిత్ శర్మ నాయకత్వంలోని భారతజట్టు కోట్లాది మంది అభిమానులు జీవితకాలం గుర్తుంచుకొనే విజయం సాధించింది.

భారత క్రికెట్ అభిమానుల నిరీక్షణ ఫలించింది. భారత్‌ను విశ్వవిజేతగా నిలపాలన్న సారథి రోహిత్ శర్మ కల సాకారమయ్యింది. గత 13 సంవత్సరాలుగా అందని ద్రాక్షలా భారత్‌ను ఊరిస్తూ, ఉడికిస్తూ వచ్చిన ఐసీసీ మరో ప్రపంచకప్‌ను భారత్ చేజిక్కింది. 2007 టీ-20 ప్రపంచ కప్ విజయం తరువాత మరోసారి 2024 టీ-20 ప్రపంచకప్‌ను భారత్ కైవసం చేసుకోగలిగింది.

**నరాలుతెగే ఉత్కంఠ నడుమ....**

వెస్టిండీస్, అమెరికా క్రికెట్ బోర్డుల సంయుక్త ఆతిథ్యంలో గత నాలుగు వారాలుగా సాగిన 55 మ్యాచ్‌ల టీ-20 ప్రపంచకప్ లో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జట్టు భారత్ తిరుగులేని చాంపియన్‌గా అవతరించింది. లీగ్ దశ నుంచి నాకౌట్ ఫైనల్స్ వరకూ ఒక్క ఓటమి లేకుండా విశ్వవిజేతగా నిలిచిన తొలి, ఏకైక జట్టుగా రికార్డు సృష్టించింది.




**కృష్ణారావు చొప్పరపు**

**సీనియర్ జర్నలిస్ట్, 84668 64969**


బార్బడోస్ రాజధాని బ్రిడ్జ్ టౌన్‌లోని కెన్సింగ్టన్ ఓవల్ వేదికగా.. ఆఖరి ఓవర్ వరకూ నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన టైటిల్ పోరులో భారత్ 7 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై సంచలన విజయం సాధించింది. 2007 నుంచి 2024 ప్రపంచకప్ వరకూ జరిగిన తొమ్మిది టోర్నీలలో భారత్ రెండోసారి మాత్రమే విజేతగా నిలువ గలిగింది. రోహిత్ శర్మ నాయకత్వ ప్రతిభకు.. విరాట్ కొహ్లీ అపార అనుభవం, సూర్యకుమార్, అక్షర్ పటేల్‌ల అసాధారణ ప్రతిభ, యార్కర్ల కింగ్ జస్ ప్రీత్ బుమ్రా అపూర్వ బౌలింగ్, హార్థిక్ పాండ్యా ఆల్ రౌండ్ నైపుణ్యం జతకలిసి భారత్ ను తిరుగులేని విజేతగా నిలిపాయి.

**భారత్ రికార్డుల మోత...**

టీ-20 ప్రపంచకప్ చరిత్రలో కనీసం ఒక్క మ్యాచ్ కూడా ఓడి పోకుండా వరుస విజయాలతో చాంపియన్‌గా నిలిచిన తొలిజట్టుగా భారత్ రికార్డు నెలకొల్పింది. గ్రూప్ లీగ్ దశలో మూడు, సూపర్-3 రౌండ్లో మూడు విజయాలు చొప్పున సాధించిన రోహిత్‌సేన నాకౌట్ రౌండ్లో సెమీస్, ఫైనల్స్ నెగ్గడం ద్వారా అజేయంగా నిలవడం ద్వారా రికార్డు సాధించింది. భారత టైటిల్ పోరులో 76 పరుగుల స్కోరుతో కీలకపాత్ర పోషించిన విరాట్ కొహ్లీకి ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్, ఫాస్ట్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రాకి ప్లేయర్ ఆఫ్ ది చాంపియన్షిప్ అవార్డులు దక్కాయి. భారత టీ-20 క్రికెట్ చరిత్రలో ఇద్దరు మేటి బ్యాటర్లు, ఓ స్పిన్ ఆల్ రౌండర్ శకం ముగిసింది. 2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌ను భారత్ గెలుచు కోవడంతోనే..కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కొహ్లీ, రవీంద్ర జడేజా తమ రిటైర్మెంట్‌ను ప్రకటించారు. వన్డే, టెస్టు ఫార్మాట్లలో తమ కెరియర్ కొనసాగుతుందని తెలిపారు.

**భారతజట్టుకు 20 కోట్ల 42 లక్షల ప్రైజ్ మనీ...**

విశ్వవిజేతగా నిలిచిన భారతజట్టు ప్రతిష్ఠాత్మక ఐసీసీ ట్రోఫీతో పాటు రూ. 20 కోట్ల 42 లక్షలు (2.45 మిలియన్ డాలర్లు ) ప్రైజ్ మనీ అందుకొంది. రన్నరప్ స్థానంతో సరిపెట్టుకొన్న దక్షిణాఫ్రికా రూ. 10 కోట్ల 67 లక్షలు (1.28 మిలియన్ డాలర్లు)లుతో సరిపెట్టుకొంది. సెమీఫైనల్లో పరాజయాలు చవిచూసిన అఫ్ఘనిస్థాన్, ఇంగ్లండ్ జట్లు చెరో రూ. 6 కోట్ల 56 లక్షలు (787,500 డాలర్లు) దక్కించు కొన్నాయి. టీ-20 ప్రపంచకప్ చరిత్రలో భారత్ సాధించిన ఈ విజయం క్రికెట్ ప్రేమికులకు అపురూపం, అనిర్వచనీయమైన జ్ఞాపకంగా మిగిలి పోతుంది.

**మూడో ప్రయత్నంలో కెప్టెన్ రోహిత్ సఫలం...**

విరాట్ కొహ్లీ నుంచి మూడేళ్ల క్రితం భారతజట్టు పగ్గాలు అందుకొన్న రోహిత్‌శర్మ తన మూడో ప్రయత్నంలో సఫలమయ్యాడు. మూడు వేర్వేరు ప్రపంచకప్ ఫైనల్స్‌లో రోహిత్ నాయకత్వంలో టైటిల్ వేటకు దిగిన భారత్..సంప్రదాయ టెస్టు, వన్డే ఫార్మాట్లలో రన్నరప్ స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గతేడాది జరిగిన ఐసీసీ టెస్టులీగ్, వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయాలు చవిచూసిన భారత్ టీ-20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో మాత్రం ఓటమి అంచుల నుంచి బయటపడి దక్షిణాఫ్రికాపై సంచలన విజయంతో విశ్వ విజేతగా అవతరించగలిగింది.

2022 టీ-20 ప్రపంచకప్‌లో భారత్‌కు నాయకత్వం వహించిన రోహిత్.. సెమీస్ ఓటమితో

తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాడు. అయితే.. వరుసగా రెండో టీ-20 ప్రపంచకప్ సెమీస్‌కు భారత జట్టు చేరడంలో ప్రధానపాత్ర వహించిన రోహిత్ ప్రపంచకప్ విజయంతో భారత్ తరపున తన టీ-20 కెరియర్ ముగిసినట్లు ప్రకటించాడు.

**159 మ్యాచ్‌లు... 4231 పరుగులు...**

2007 టీ-20 ప్రపంచకప్ ద్వారా అరంగేట్రం చేసిన రోహిత్.. గత తొమ్మిది టీ-20 ప్రపంచకప్ టోర్నీలలోనూ భారత్ తరపున ఆడిన ఏకైక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. 37 సంవత్సరాల రోహిత్ 18 సంవత్సరాల తన టీ-20 ప్రస్థానంలో 159 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 5 శతకాలు, 32 అర్ధ శతకాలతో 4231 పరుగులు సాధించడం ద్వారా అత్యుత్తమ, అత్యంత విజయవంతమైన ఓపెనర్లలో ఒకడిగా మిగిలిపోయాడు.

**అప్పుడు ధోనీ- ఇప్పుడు రోహిత్...**

2007లో తొలిసారిగా నిర్వహించిన టీ-20 ప్రపంచకప్ టోర్నీలో మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలో భారత్ తొలిప్రయత్నంలోనే విశ్వవిజేతగా నిలువగలిగింది. జోహెన్స్ బర్గ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన టైటిల్ పోరులో భారత్ చాంపియన్‌గా నిలవడంలో ఓపెనర్‌గా రోహిత్ శర్మ ప్రధానపాత్ర వహించాడు. తిరిగి 17 సంవత్సరాల తరువాత.. భారత కెప్టెన్‌గా రోహిత్ తన జట్టును మరోసారి టీ-20 చాంపియన్ గా నిలుపగలిగాడు.

**విరాట్‌ను మరువ గలమా?**

అంతేకాదు.. భారత పరుగుల యంత్రం విరాట్ కొహ్లీ సైతం టీ-20లకు గుడ్ బై చెప్పాడు. ప్రపంచకప్ ఫైనల్స్ లో 76 పరుగుల టాప్ స్కోరర్‌తో భారత్‌ను విజేతగా నిలపడంలో ప్రధానపాత్ర వహించిన విరాట్.. ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్స్ అవార్డు సైతం అందుకొన్నాడు. తన కెరియర్ లో ఆరోసారి టీ-20 ప్రపంచకప్ టోర్నీలో పాల్గొన్న విరాట్ కెప్టెన్‌గా విఫలమైనా ఓ ఆటగాడిగా మాత్రం ప్రపంచకప్ బంగారు పతకం సాధించగలిగాడు. టీ-20 ఫార్మాట్లో ఆరు ప్రపంచకప్ టోర్నీలలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన విరాట్ 4వేలకు పైగా పరుగులతో సాటిలేని మేటి బ్యాటర్ గా నిలిచాడు. రికార్డుస్థాయిలో 15సార్లు అత్యుత్తమ బ్యాటర్ అవార్డులు అందు కొన్నాడు. భారత టీ-20 జట్టులో విరాట్ లేని లోటునుపూడ్చడం అంత తేలిక కాబోదు.

**రాహుల్ ద్రావిడ్‌కు భలే గురుదక్షిణ...**

భారతజట్టు ప్రధాన శిక్షకుడు రాహుల్ ద్రావిడ్‌తో పాటు దిగ్గజ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కొహ్లీ, రవీంద్ర జడేజా, జస్ ప్రీత్ బుమ్రాలకు ఈ విజయం ఓ అపురూప కానుకగా మిగిలి పోతుంది. క్రికెట్‌లో నిఖార్సయిన శిక్షకుడిగా నీరాజనాలు అందు కొంటున్న భారత్ మూడు (టీ-20, వన్డే, టెస్టు) విభాగాలలో అగ్ర స్థానంలో నిలిచినా... గత ఏడాది కాలంలో మూడుసార్లు వేర్వేరు ఐసీసీ ప్రపంచకప్ టోర్నీల ఫైనల్స్ చేరినా.. మూడో ప్రయత్నంలో కానీ భారతజట్టు విజేతగా నిలువలేకపోయింది. రోహిత్‌శర్మ నాయకత్వంలోనే ఐసీసీ టెస్టు లీగ్, వన్డే ప్రపంచకప్ టోర్నీలలో రన్నరప్ స్థానాలతో సరిపెట్టు కొన్న భారత్ చివరకు టీ-20 ప్రపంచకప్‌లో విశ్వవిజేతగా నిలువగలిగింది. భారత్‌ను సాటిలేని మేటిజట్టుగా తీర్చిదిద్దిన రాహుల్ ద్రావిడ్ ఓ ఆటగాడిగా సాధించలేని విజయాన్ని శిక్షకుడుగా అందుకోడంద్వారా తన జీవితాన్ని పరిపూర్ణం చేసుకోగలిగాడు. ★

## 'రికార్డు మ్యాచ్'ల మొనగాడు రోహిత్


రోహిత్

ఐసీసీ టీ-20 ప్రపంచకప్ మ్యాచ్‌ల చరిత్రలోనే ఓ అసాధారణ రికార్డుకు రోహిత్ శర్మ ఉరకలేస్తున్నాడు. వరుసగా 9వ ప్రపంచకప్ టోర్నీ బరిలోకి దిగుతున్నాడు. ఆతనికి ధూమ్ ధామ్ టీ-20 ప్రపంచకప్‌కూ అవినాభావ సంబంధమే ఉంది. 21 సంవత్సరాల వయసులో తొలిసారిగా 2007లో టీ-20 ప్రపంచకప్ బరిలో నిలిచాడు. రెండేళ్లకోసారి నిర్వహిస్తూ వస్తున్న ప్రతిఒక్క టోర్నీలోనూ పాల్గొన్న ఒకే ఒక్కడుగా, అత్యధిక మ్యాచ్‌లు ఆడిన తొలి ఆటగాడిగా నిలిచాడు. భారత్ విశ్వవిజేతగా నిలవడంలో రోహిత్ కీలకపాత్ర పోషించాడు. మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలో టీ-20 ప్రపంచకప్ అరంగేట్రం చేసిన తరువాత మరి వెనుదిరిగి చూసింది లేదు. 47 మ్యాచ్‌లు ఆడటం ద్వారా.. ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. 2022 టీ-20 ప్రపంచకప్‌లో రోహిత్ నాయకత్వం లోనే భారత్ పోరు సెమీస్ లోనే ముగిసింది. 2024 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూపు- ఏ లీగ్‌లో మూడు మ్యాచ్‌లు, సూపర్- 8 రౌంట్లో 3 మ్యాచ్‌లు, సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు ఆడటం ద్వారా రోహిత్ తన రికార్డును తానే అధిగమించుకొని మరీ అంతర్జాతీయ టీ-20 నుంచి సగర్వంగా నిష్క్రమించాడు. 2007 నుంచి 2024 వరకూ వరుసగా తొమ్మిది ప్రపంచకప్ టోర్నీలలో పాల్గొన్న రోహిత్ మొత్తం 47 మ్యాచ్‌ల్లో 1100 పరుగులు సాధించగలిగాడు. టీ-20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక పరుగులు సాధించిన ఇద్దరు బ్యాటర్లలో రోహిత్ ఒకడిగా నిలిచాడు. టీ-20 ఫార్మాట్లో 200కు పైగా సిక్సర్లు బాదిన తొలి, ఏకైక ఓపెనర్‌గా కూడా రోహిత్ పేరుతోనే ప్రపంచ రికార్డు నమోదయ్యింది. ★

## ఒక్కో ఆటగాడికి రూ.5 కోట్లు


రాహుల్ ద్రావిడ్

రోహిత్ శర్మ సారథ్యంలోని మొత్తం 15మంది సభ్యులకు రూ.5 కోట్లు చొప్పున బీసీసీఐ అందచేయనుంది. భారతజట్టు ప్రపంచ చాంపియన్‌గా నిలవడం వెనుక చీఫ్ కోచ్ రాహుల్ ద్రావిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్ పరస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌తో పాటు.. ముగ్గురు ఫిజికల్ ట్రెయినర్లు, ముగ్గురు బాల్ త్రోయర్లు, లాజిస్టిక్స్ మేనేజర్‌తో పాటు సహాయక సిబ్బందిలోని మరో ఇద్దరికి రూ. కోటి వంతున ఇవ్వనున్నారు.

ఇప్పటికే బీసీసీఐ వార్షిక కాంట్రాక్టు, ఐపీఎల్ కాంట్రాక్టు, మ్యాచ్ ఫీజులు, ఎండార్స్ మెంట్ల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న ఈ 15 మంది భారత జట్టు సభ్యులకు ప్రపంచకప్ విజయం పుణ్యమా అంటూ అయిదేసి కోట్ల రూపాయలు అదనంగా దక్కనుండడం... ఆకస్మిక ధనలాభం కాక మరేమిటి. 204 దేశాలు తలపడే విశ్వక్రీడలు ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన క్రీడాకారుడికి భారత ప్రభుత్వం ఇచ్చే నగదు బహుమతి కోటి రూపాయలు మాత్రమే. అదే 20 దేశాలు మాత్రమే పోటీపడిన టీ-20 ప్రపంచకప్‌లో విశ్వవిజేతగా నిలిచిన భారతజట్టులోని ఒక్కో ఆటగాడు 5 కోట్ల రూపాయల చొప్పున అందుకోడం చూస్తే..

క్రికెట్టా..మజాకానా! అనుకోక తప్పదు కాక తప్పదు. ★

# మహిళా ఉపాధే లక్ష్యంగా సేవాభారతి సేవలు




**భాగ్యనగర్ :** మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ఎస్.పి.ఎం.సి.ఐ.ఎల్. సంస్థ సీఎస్ఆర్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన బోయినపల్లి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ గ్రాడ్యుయేషన్ వేడుకలు జూన్ 22న మౌలాలిలోని వాత్సల్యసింధులో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హైదరాబాద్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీకర ప్రధాన్ హాజరయ్యారు. గౌరవ అతిథి స్కిల్ డెవలప్‌మెంట్ సీఈఓ ఆశిష్‌జైన్ పాల్గొన్నారు. ఆత్మీయఅతిథి, న్యూఢిల్లీ రాష్ట్రీయ సేవాభారతి అధ్యక్షులు పన్నాలాల్ మాట్లాడుతూ, ఈ కోర్స్‌లో శిక్షణ ద్వారా ఉద్యోగంతోపాటు సేవకు కూడా అవకాశం ఉంటుందని అన్నారు. సేవాభారతి తెలంగాణ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

సేవాభారతి నిరుపేదలకోసం 'వైద్య' పరంగా రెండు ఆసుపత్రులు, బస్తీలలో మెడికల్ క్యాంపులు, 'విద్య' పరంగా 15 వసతిగృహాలు,4 పాఠశాలలు,, ట్యూషన్ సెంటర్లు. 'సామాజిక, స్వావలంబన'లో భాగంగా కుట్టు, ఎంబ్రాయిడరీ, రేపర్స్, ఆర్మీ, పోలీస్ ట్రైనింగ్, స్కిల్ ఏసీ, టీఈ,వాషింగ్ మిషన్‌ల నిర్వహణలో శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి రామమూర్తి వివరించారు.

తెలంగాణ సేవాభారతి అధ్యక్షులు దుర్గారెడ్డి మాట్లాడుతూ, మానవసేవే మాధవసేవ అని, బడుగు బలహీనవర్గాల వారికి సేవ అందించడమే తమ సంస్థ ముఖ్యఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాభారతి ప్రతినిధులు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, మహిళలు, సంస్థ వాలంటీర్స్ పాల్గొన్నారు.



# ప్లాస్టిక్‌పై అవగాహన సదస్సు

**నంద్యాల జిల్లా :** సంఘమిత్ర సేవాసమితి, నంద్యాలలో పీఏవి టవర్స్‌లో ప్రపంచ పర్యావరణదినోత్సవం సందర్భంగా "పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత" కార్యక్రమం జూన్ 30న జరిగింది. సంఘమిత్ర వ్యవస్థాపకులు డాక్టర్ కాదర్‌బాద్ ఉదయశంకర్ ప్రసంగిస్తూ ఆస్తి, ఐశ్వర్యం, ఆరోగ్యం, విద్య, విలువలతో చక్కని పర్యావరణం కూడా మన వంశాంకురాలకు అందించడం కర్తవ్యం. పర్యావరణ విస్తృతిని దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ వినియోగంపై కట్టడి, విద్యుత్ దుర్వినియోగం, గ్లోబల్ వార్మింగ్ విషయాలు వివరించారు. వినియోగదారుల ఆలోచనలో స్వచ్ఛందంగా మార్పువస్తే తప్ప యంత్రాంగం, చట్టాలతో మార్పు సాధ్యం కాదని, ఆ మార్పేదో మనతోనే ఎందుకు ప్రారంభం కాకూడదు అని పిలుపు నిచ్చారు.

# పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణి






**వరంగల్ :** ముల్కనూరు బుడగ జంగాల కాలనీ పాఠశాల విద్యార్థులకు స్థానిక సేవాభారతి జూన్ 24న పుస్తకాల సంచులు, పరీక్షల కోసం అట్టలు వితరణ చేసింది. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు సురేందర్ అధ్యక్షత వహించారు.

## తెలుసుకుందాం

# మార్తాండ దేవాలయం - కశ్మీర్



జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ పట్టణానికి 9 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం కొలువుదీరింది. దీనిని సూర్య భగవానునికి అంకితమిచ్చారు. 8వ శతాబ్దంలో కశ్మీర్ రాజు 'లలితాదిత్య ముక్తాపీడుడు' దీనిని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. ఈ ఆలయం అద్భుతమైన శిల్పకళా చాతుర్యానికి, అపురూప అలంకారాలకు ప్రసిద్ధి పొందింది.

## కథ | దొంగ నుంచి తెలివిగా తప్పించుకున్న బాటసారి!



అనగనగా ఒక బాటసారి సంతలో ఒక మేకని కొనుక్కుని తన గ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్నాడు.

దారిలో అతనికి ఒక శూన్యమైన ప్రదేశం ఎదురైంది.

బాటసారి జాగ్రత్తగా వెళ్తుంటే హఠాత్తుగా ఒక దొంగ చేతిలో కర్ర పట్టుకుని అడ్డుపడ్డాడు.

బాటసారిని కర్రతో బెదిరించి, తన దగ్గరున్న డబ్బును దోచుకున్నాడు. అది సరిపోక మేకను కూడా ఇవ్వమన్నాడు.

దొంగ అడిగినవన్నీ ఇచ్చిన బాటసారి 'నీకు ఇవన్నీ ఇచ్చాను కదా.. వాటికి బదులుగా నీ కర్ర నాకు ఇస్తావా?' అని అడిగాడు.

## పద్యము

**ప్రేమను గూర్చి యల్పునకుఁబెద్దతనంబును దొడ్డవానికిం**
**దా మతి తుచ్ఛపుంబని నెదం బరికింపక యీయరాదుగా**
**వామకరంబుతోడ గుడువంగుడిచేత నపానమార్గముం**
**దోమగ వచ్చునే మిగుల దోచని చేతలు గాక భాస్కరా!**

**భావం :** భాస్కరా! లోకంలో నీచునకు గొప్ప పదవిని, గొప్పవానికి చిన్న పదవిని ఆలోచించకుండా అప్పగించకూడదు. అనాలోచిత చర్యవల్ల ఎడమ చేతితో భుజించడం, కుడిచేతితో మల మూత్రాలను శుభ్రపరచుకోవడం వంటిదే.

## శ్లోకము

**యస్య నాస్తి స్వయం ప్రజ్ఞా శాస్త్రం తస్య కరోతి**
**లోచనాభ్యాం విహీనస్య దర్పణః కిం కరిష్యతి**

**భావం :** స్వయంగా ప్రజ్ఞ లేనివారికి శాస్త్రం వల్ల ప్రయోజనం ఏమి ఉంటుంది? కళ్లు లేని వారికి అద్దంతో లాభమేమిటి? అంటే స్వతః ప్రజ్ఞావంతులకు శాస్త్రం మరింత శోభనిస్తుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| వైట్ హౌజ్ | క్రెమ్లిన్ |
| పార్లమెంట్ | అమెరికా |
| రష్యా | గణభవన్ |
| దక్షిణ కొరియా | భారత్ |
| బంగ్లాదేశ్ | బ్లూ హౌజ్ |

**జవాబులు :** వైట్ హౌజ్–అమెరికా, పార్లమెంట్–భారత్, రష్యా–క్రెమ్లిన్, దక్షిణ కొరియా–బ్లూ హౌజ్, బంగ్లాదేశ్–గణభవన్

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### లక్ష్మీ నారాయణ్ మిశ్రా



ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత. ఈయన 1904 ఏప్రిల్ 11న జన్మించారు. విద్యార్థిగా ఉన్న సమయంలోనే బ్రిటిష్ అణచివేత పాలనకు వ్యతిరేకంగా నిరసన ప్రారంభించారు. సహాయ నిరాకరణోద్యమం, అస్పృశ్యత వ్యతిరేకోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉద్యమంలో భాగంగా పదిహేడేళ్లపాటు జైలు శిక్ష అనుభవించారు. 1970 మే 31న మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రస్తుత డిప్యూటీ సీఎం ఎవరు?
2. ఒడిశా ముఖ్యమంత్రిగా ఎవరు నియమితులయ్యారు?
3. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏ తేదీన జరుపుకుంటారు?

జవాబులు : 1. పవన్ కళ్యాణ్; 2. మోహన్ చరణ్ మాఝీ; 3. జూన్ 21



దొంగ 'ఎందుకు?' అని ఆశ్చర్యంగా అడిగాడు.

దానికి బాటసారి 'నేను ఖాళీ చేతులతో ఇంటికి వెళ్తే నా భార్య బాధ పడుతుంది. కనీసం ఈ కర్ర తీసుకుని వెళ్తే సంత నుంచి తెచ్చాననుకొని సంతోషిస్తుంది' అని అన్నాడు.

అన్నీ తీసుకున్నాను కదా, కర్రదేముందిలే అనుకున్న దొంగ బాటసారికి తన కర్రను ఇచ్చాడు.

దీంతో బాటసారి కర్రతో దొంగకి నాలుగు దెబ్బలు తగిలించి తన సొమ్మును, మేకను తిరిగి తీసుకున్నాడు. ★

## మెదడుకు మేత

ఎర్రని మూట విప్పితే,
అన్నీ కెంపుల రాశులే..
ఏమిటది?

జవాబు : దానిమ్మపండు


## మంచిమాట

ధనం కంటే కాలం విలువైనది..
ఎక్కువ ధనం సంపాదించగలం
కానీ ఎక్కువ కాలాన్ని మాత్రం
సంపాదించలేం!




# వారఫలాలు

08-14 జూలై 2024




సింహంభట్ల సుబ్బారావు
6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

మీ ఆశయాలు నెరవేరతాయి. సోదర సోదరీలతో విభేదాలు తొలగుతాయి. చిన్ననాటి విషయాలు గుర్తుకు వస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వాహనయోగం. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగస్తులు కొత్త హోదాలు దక్కించుకుంటారు. రాజకీయవేత్తలు, క్రీడాకారులు, రచయితలకు మరింత ఆదరణ లభిస్తుంది. 8,9 తేదీల్లో వృథాఖర్చులు. దూరప్రయాణాలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

యుక్తిగా వివాదాలనుంచి బయటపడతారు. ప్రతిభావంతులుగా గుర్తింపు పొందుతారు. ప్రముఖులతో చర్చలు సఫలమవుతాయి. నిరుద్యోగులకు ఒక సమాచారం ఊరటనిస్తుంది. వ్యాపారులు ఆశించిన పెట్టుబడులు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత స్థితి రాజకీయ వర్గాలకు పదవీయోగం. కళాకారులు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 10,11 తేదీల్లో వ్యయప్రయాసలు. బంధువులతో వివాదాలు. శివపంచాక్షరి పఠించండి

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొన్ని సమస్యలు సహనాన్ని పరీక్షిస్తాయి. భూములు, వాహనాల కొనుగోలుయత్నాలు వాయిదా. ఆరోగ్యంపై దృష్టిసారించండి. వ్యాపారులకు కొంత గందరగోళంగా ఉంటుంది. ఉద్యోగులకు మరింత పనిభారం తప్పదు. కళా కారులకు ఒత్తిడులు పెరుగుతాయి. పరిశోధకులు, రచయితలకు విదేశీ పర్యటనలు వాయిదా. 11,12 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. విష్ణుధ్యానం చేయండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

సన్నిహితులు, స్నేహితులతో సఖ్యత నెలకొంటుంది. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. కొన్ని సమస్యలు తీరుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులకు లాభాలు తథ్యం. ఉద్యోగస్తులు కోరుకున్న మార్పులు పొందుతారు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు విశేషంగా కలిసి వస్తుంది. 13,14 తేదీల్లో దూర ప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ముఖ్యమైన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. స్థిరాస్తులు కొనుగోలు. దేవాలయాలు సందర్శన. మీ నిర్ణయాలపై కుటుంబంలో ఆమోదం. ఉద్యోగులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. రాజకీయ వేత్తలు, కళాకారులు, రచయితలకు ఊరటనిచ్చే ప్రకటన రావచ్చు. 8,9తేదీల్లో వృథా ఖర్చులు. స్నేహితులతో తగాదాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆత్మీయుల నుంచి కీలక సందేశం అందుతుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితుల నుంచి శుభవార్తలు. నూతన ఉద్యోగాన్వేషణలో విజయం. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. 11,12తేదీల్లో దూర ప్రయాణాలు. అనుకోని ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

విచిత్రమైన సంఘటనలు ఎదురవుతాయి. కొన్ని సమస్యలు తీరి ఊరట. ఇంట్లో శుభకార్యాలు. చేపట్టిన కార్యక్రమాలు పూర్తి చేస్తారు. వ్యాపారులు విస్తరిస్తారు. కొత్త భాగస్వాములను చేర్చుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. పారిశ్రామికవర్గాలకు అనుకూలం. కళాకారులు, రచయితలకు అవార్డులు. 11,12 తేదీల్లో దూర ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొన్ని సమస్యలు ఎట్టకేలకు పరిష్కారవుతాయి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడతాయి. కాంట్రాక్టర్లు, రియల్టర్లకు కలిసి వచ్చే కాలం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు అనుకూలం. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహం. 9,10 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. అనారోగ్యం. కాలభైరావష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కొన్ని వ్యవహారాలలో పట్టింది బంగారమే కాగలదు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. పారిశ్రామికవర్గాలకు ఆహ్వానాలు అందుతాయి. రచయితలు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 10,11 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. దుర్గాస్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

అనుకున్నది సాధించాలన్న తపనతో ముందడుగు వేస్తారు. ఆత్మీయులతో ఉత్సాహంగా గడుపుతారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపారులకు మరింత అనుకూలం. ఉద్యోగులకు హోదాలు. కళాకారులకు సన్మానయోగం. రచయితలు, క్రీడాకారులు నైపుణ్యతను చాటుకుంటారు. 12,13తేదీల్లో వృథా ఖర్చులు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

చిన్ననాటి సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటారు. ఆలోచనలు అమలు చేస్తారు. ఆత్మీయులతో వివాదాలు తీరతాయి. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. పారిశ్రామిక వర్గాలకు సంతోషకరమైన సమాచారం. రచయితలు, క్రీడాకారులకు మంచి గుర్తింపు. 13,14 తేదీల్లో ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆదాయం సంతృప్తినిస్తుంది. చేపట్టిన కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం. ఇంటర్వ్యూలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, పరిశోధకులకు అరుదైన ఆహ్వానాలు అందుతాయి. 10,11 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

# పదరసం-471

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 | | 5 |
| | | | | 6 | | | | | |
| 7 | | | 8 | | | | 9 | 10 | |
| | | | 11 | | | | | | |
| | 12 | | | | 13 | 14 | | | |
| | | | 15 | | | | | 16 | 17 |
| 18 | | | | | 19 | | | | |
| | | | 20 | 21 | | | | 22 | |
| 23 | | 24 | | 25 | | | | | |
| | | 26 | | | | 27 | | | |

## ఆధారాలు

**అడ్డం**

1) బాణామతి వంటి ప్రయోగం (4)
4) తిరగబడ్డ చూపుడు వేలు (3)
6) గందరగోళ పరిస్థితి (4)
7) మొగుడు (4)
9) మైమరచిన స్థితిలో శూన్యం లోపించింది (3)
11) పరధ్యానం (3)
12) గతం (3)
13) తడబడ్డ పార్థుడు (4)
15) రాబోయే విష్ణు అవతారం (2)
16) పురుగుతో పాడైపోవు (సాధారణంగా కాయలు, పళ్ళు)
18) దసరా సమయంలో ఈ పిట్ట దర్శనం మంచిదట (4)
19) కిందటి ఏడాది (3)
20) కోపపు కోరిక (2)
22) చిన్నం ఎత్తు ధనం (2)
23) మహాకవి పోతనామాత్యుని ఇంటిపేరు (అటునుంచి) (3)
25) తలకు కట్టిన గుడ్డ (2)
26) కటికవాడు (3)
27) తిరగబడ్డ బాల్యం (4)

**నిలువు**

1) చనిపోయిన దూడ చర్మంలో గడ్డి, గాదం కూరి చేసిన బొమ్మ దూడ
2) దేహ బలం (3)
3) జ్ఞానవంతుడైన కార్యదక్షుడు (5)
4) తనకే సర్వాధికారాలుంచుకున్న రాజు, నాయకుడు (3)
5) మూడవ తిథి (3)
8) చిట్ట చివరిది పైకొచ్చింది (6)
10) మరో పుట్టుక సరిగాలేదు (4)
12) బయట కాదు (3)
14) ఆశ్చర్యం (4)
17) నగరాల్లో కనుమరుగౌతున్న ఈ పక్షి సరిగా లేదు (3)
18) ఈ ద్రవాన్ని ఉష్ణోగ్రత కొలవడంలో వాడతారు (4)
21) సైనికుడు (3)
22) అందమైనవ్యక్తి (3)
24) శూన్యం లోపించిన కొంగ (2)

## పదరసం - 470 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| స[1] | వ | ర | ణ[2] | | పు[3] | ట్టి | | కం[4] | చె |
| యో | | | ర | | ర | | పూ[5] | ప | |
| ధ్య[6] | విం[7] | | వ[8] | ల్ల | మా | లి | న | | క[9] |
| | త[10] | జే[11] | వి | | యిం | | కం[12] | క | ర |
| | | గు | | వి[13] | పు | లం[14] | | | వా |
| బొం[15] | గు | రు | | జ్ఞ | | క[16] | ల | క[17] | లం |
| గ | | | నా[18] | డు | య | కు | | ల | |
| రం[19] | గ[20] | రిం | చు | | | చే[21] | ట | దు | లు |
| | డి | | | మొ[22] | ర | టు | | సు | |
| న[23] | య | వం | చ | న | | | శి[24] | ఖం | డి |

అరుణ

# 'హను-మాన్' నుండి 'కల్కి' వరకు!

**తెలుగు సినిమా వెలుగులు దశదిశలా ప్రసరిస్తున్న సమయమిది. ప్రస్తుతం ఎక్కడ చూసినా 'కల్కి 2898 ఏడి' సినిమాపై చర్చ సాగుతోంది. నిన్నగాక మొన్న 2024లో అడుగు పెట్టినట్టుంది. అప్పుడే ఆరు నెలలు పూర్తయ్యాయా? అనిపిస్తోంది.**

ఈ ఏడాది 'సర్కారు నౌకరి' సినిమాతోనే తెలుగు చిత్ర ప్రయాణం మొదలయింది. జనవరి 1న విడుదలైన ఈ సినిమాతో ప్రముఖ గాయని సునీత కొడుకు ఆకాశ్ గోపరాజు హీరోగా పరిచయం కాగా, ఈ సినిమాతోనే గంగమోని శేఖర్ దర్శకునిగా తొలిసారి మెగాఫోన్ పట్టాడు. అన్నిటినీ మించి ఈ చిత్రాన్ని దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు నిర్మించడం విశేషం! జనవరిలో మొత్తం 19 చిత్రాలు విడుదల కాగా, వాటిలో 17 స్ట్రెయిట్ మూవీస్, రెండు డబ్బింగ్ సినిమాలు. జనవరి వస్తోందంటే చాలు.. సినీ ఫ్యాన్స్‌లో సంక్రాంతికి సందడి చేసే చిత్రాలవైపే ఆసక్తి ఉంటుంది. ఈసారి అలా ఎదురు చూపులు దక్కించుకున్న సినిమాల్లో మహేశ్‌బాబుతో త్రివిక్రమ్ తెరకెక్కించిన 'గుంటూరు కారం' అగ్రస్థానం ఆక్రమించింది. జనవరి 12న విడుదలైన ఆ సినిమా ఎక్కువ థియేటర్లను పట్టేసింది. దాంతో ఓపెనింగ్స్ దక్కాయి. అదే తేదీన 'హను-మాన్' కూడా 'పాన్ ఇండియా మూవీ'గా విడుదలై ఘన విజయం సాధించింది. వెంకటేశ్ హీరోగా శైలేశ్ కొలను డైరెక్షన్‌లో రూపొందిన 'సైంధవ్', నాగార్జున హీరోగా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ తెరకెక్కించిన 'నా సామిరంగ' చిత్రాలూ సంక్రాంతికి వచ్చాయి. కానీ ఇవేవీ తమ ఉనికిని పెద్దగా చాటుకోలేదు.

టేకాఫ్ పరవాలేదు అనుకుంటే వెంటనే రెండో నెల ఫిబ్రవరి ఉసూరుమనిపించింది. ఈ నెలలో 27 సినిమాలు వెలుగుచూడగా, వాటిలో 24 స్ట్రెయిట్ మూవీస్, మూడు డబ్బింగ్ సినిమాలు ఉన్నాయి. ఫిబ్రవరి నుండే రాజకీయ వేడి రగులు కుంటూ ఉంది. దాంతో వైసీపీ మద్దతుగా రూపొందిన 'యాత్ర-2' ఫిబ్రవరి 8న విడుదల యింది. తరువాతి వారానికి అమరావతి రైతుల వ్యథతో తెరకెక్కిన 'రాజధాని ఫైల్స్' జనం ముందు నిలచింది. ఈ రెండూ అంతగా ఆకట్టుకోలేక పోయాయి. సుహాస్ నటించిన 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' కొద్దిగా ఫర్వాలేదనిపించినా అతని కెరీర్‌కి ఏ మాత్రం హెల్ప్ కాలేకపోయింది. రవితేజ 'ఈగిల్' సైతం ప్రేక్షకులను నిరాశ పర్చింది.

మార్చిలో మొత్తం 35 సినిమాలు విడుదల య్యాయి. వీటిలో తెలుగులో నేరుగా రూపొందిన చిత్రాలు 30 కాగా, ఐదు అనువాద చిత్రాలు ఉన్నాయి. వైసీపీ కోసం రామ్ గోపాల్ వర్మ రూపొం దించిన 'వ్యూహం' మార్చి 2న జనం ముందుకు వచ్చింది. కానీ, ఎవరి మనసూ గెలవలేక పోయింది. మార్చి 8వ తేదీన 'భీమా'గా గోపీచంద్, 'గామి'తో విశ్వక్సేన్ బాక్సాఫీస్ బరిలోకి దూకారు. ఇదే నెలలో వచ్చిన చిత్రాలలో పీరియడ్ డ్రామాగా వచ్చిన 'రజాకార్' ప్రేక్షకులను ఓ మోస్తరుగా ఆకట్టుకో గలిగింది. ఇక మార్చి నెలాఖరులో వచ్చిన 'డీజే టిల్లు' సీక్వెల్ 'టిల్లూ స్క్వేర్' యువ ప్రేక్షకులలో జోష్ నింపి, విజయాన్ని మూట గట్టుకుంది.

ఏప్రిల్ వచ్చే సరికే ప్రేక్షకుల్లో సినిమాలపై మూడ్ సన్నగిల్లిందని చెప్పొచ్చు. రాజకీయాల వేడి మొద లైంది. అయినా ఈ నెల 23 సినిమాలను చూసింది. అందులో స్ట్రెయిట్ మూవీస్ 15 మాత్రమే, అనువాద చిత్రాలు 8. అయితే భారీ అంచనాలతో ఏప్రిల్ 5న వచ్చిన విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' నిరాశ పరచింది. 'గీతగోవిందం' మ్యాజిక్‌ను విజయ్ దేవరకొండ, పరశురామ్ రిపీట్ చేయలేకపోయారు. 11వ తేదీన వచ్చిన 'గీతాంజలి' సీక్వెల్... 'గీతాంజలి మళ్లీ వచ్చింది' కూడా ప్రేక్షకు లను మెప్పించలేక పోయింది. ఇదే నెలలో వచ్చిన తమిళ అనువాద చిత్రం 'ప్రేమలు' యూత్‌ను ఆకట్టుకోగా, మలయాళ డబ్బింగ్ మూవీ 'మంజు మల్ బాయ్స్' సాధారణ ప్రేక్షకుడిని మెప్పించింది. మే నెలలో వచ్చిన సుహాస్ 'ప్రసన్న వదనం', నరేశ్ 'ఆ ఒక్కటీ అడక్కు', నారా రోహిత్ 'ప్రతినిధి', దిల్ రాజు 'లవ్ మీ' మంచి అంచనాలతో విడుదలైనా... కమర్షియల్‌గా లాభాలను తెచ్చిపెట్టలేదు. అలానే ఆ నెలాఖరులో వచ్చిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి', 'గమ్ గమ్ గణేశా', 'భజే వాయువేగం' కూడా పరాజయం పాలయ్యాయి.

జూన్ తొలి వారాంతంలో శర్వానంద్ నటించిన 'మనమే', కాజల్ ప్రధాన పాత్రలో రూపొందిన 'సత్యభామ', పాయల్ రాజ్ పుత్ కీ రోల్ లో తెరకెక్కిన 'రక్షణ' ఉన్నాయి. వీటితో పాటు నవదీప్ హీరోగా రూపొందిన 'లవ్ మౌళి' కూడా వచ్చింది. ఈ నెల 14న వచ్చి చిత్రాలలో తమిళ అనువాద చిత్రం 'మహారాజ'కు మంచి పేరు వచ్చింది. సుధీర్ బాబు నటించిన 'హరోంహర', వరుణ్ సందేశ్ 'నింద' వంటి సినిమాలు కమర్షియల్‌గా ఆడలేదు. ఈ నేపథ్యంలో నెలాఖరులో వచ్చిన 'కల్కి 2898 ఎ.డి.' పైనే అందరూ ఆశలు పెట్టుకున్నారు. త్రీ డీ, టు డీలో రూపుదిద్దుకున్న ఈ సినిమాను నాగ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వీనీదత్ నిర్మించారు. పాన్ ఇండియా మూవీగా ఐదు భాషల్లో ఇది విడుదలైంది. ప్రేక్షకుల అంచనాలకు కాస్తంత భిన్నంగా ఉన్నా... గ్రాండ్ విజువల్స్ కారణంగా థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్‌ను వారు ఎంజాయ్ చేస్తున్నారు. అందువల్ల మొదటి ఆరు నెలల్లో భారీ వసూళ్లు చూసిన చిత్రంగా ప్రభాస్ 'కల్కి' నిలచింది. దాని తరువాతి స్థానం 'హను-మాన్'కే దక్కుతుంది. ఈ రెండు సినిమాలు భారతీయ పురాణ, ఇతిహాసాల్లోని అంశాలను ఆధారం చేసుకొని తెరకెక్కిన సోషియో ఫాంటసీస్ కావడం విశేషం! యువతను ఆకట్టుకొనే అంశాలతో 'టిల్లూ స్క్వేర్' రూపొంది, బాక్సాఫీస్ వద్ద సందడి చేసి విజయాల జాబితాలో చోటు సంపాదించింది. ఈ మూడు సినిమాలను మినహాయిస్తే 133 స్ట్రెయిట్ మూవీస్‌లో మురిపించి నవి పెద్దగా కనిపించవు. 29 అనువాదాల్లో విజయ్ సేతుపతి 'మహారాజ' ఒక్కటే చక్కటి వసూళ్లు చూడగలిగింది. మరి రాబోయే ఆరు నెలల్లో తెలుగు సినిమా ఏ తీరున వెలుగుతుందో చూడాలి.




వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# బుడాపెస్ట్‌లో జగన్నాథ రథయాత్ర

హంగెరీ రాజధాని బుడాపెస్ట్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో జూన్ 29న జగన్నాథ రథయాత్ర ఘనంగా జరిగింది. ఇస్కాన్ ఏటా ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. ఎంతో కళాత్మకంగా అలంకరించిన రథం లాగుతూ, పాటలు, నృత్యాలతో శోభాయమానంగా భక్తులు పండుగ జరిపారు. ఈ ఉత్సవానికి మూలం జగన్నాథ రథయాత్రే. వేయేళ్ల క్రితం ఆరంభమైన ఆ యాత్రను ఇప్పటికీ పూరీలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలలోనే కాదు, కొన్ని విదేశాలలో కూడా ఈ ఉత్సవం హిందూ సంఘాలు, ఇస్కాన్ వంటి సంస్థలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాయి. బుడాపెస్ట్‌లో గడచిన 28 ఏళ్లుగా రథయాత్ర సాగుతున్నది. ఇక్కడ రెండు భాగాలుగా ఉత్సవం జరుగుతుంది. మొదట రథాన్ని ఊరేగిస్తారు. తరువాత నగరంలోని ప్రధాన కూడళ్లలో నృత్య ప్రదర్శనలు ఇస్తారు.





From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 35

**DSC**
**DHRUV SCHOOL OF CIVILS**

**DHRUV SCHOOL OF CIVIL SERVICES STUDIES**

A unit of Dhruv Foundation for Education & Research
Affiliated to Central Sanskrit University, New Delhi

## B.A (Hons.) (Civil Services Studies)

**Contains 5 Core Subjects: 1. SANSKRIT 2. HISTORY 3. POLITY 4. ECONOMICS 5. GEOGRAPHY**

- 4 Years BA (Hons.) Program
- Extensive Mock Interviews
- Regular Test Series
- Detailed Coverage of CSAT
- 100% Smart Class Rooms
- Elaborative Doubt Clearance
- Library with 10,000+ Books
- Student Centric Pedagogy
- 3000+ hours of Teaching
- Daily Current Affairs
- Fee Waiver and Scholarship
- One-on-One Mentorship
- Earning while Learning
- Focus on Ethics & Values
- Covers Syllabus of UPSC Exam (Prelims, Mains & Interview)
- 600+ hours of Essay Writing Program & Personalised Feedback
- Practice of Previous Years' Questions & Trends Analysis

"Spoorthy" Chatra Shakti Bhawan, Street No. 9
Lane No.1, Tarnaka, Secunderabad - 500 017

9100009767 www.dearedu.org